3994

విషయసూచిక

సంపుటి 3. సంచిక 50.
శుక్రవారం, జూలై 13, 1951.

మూగకంఠం

కనకమేడల వెంకటేశ్వరరావు

ఇది మూగవోయిన కంఠం
ఈ కంఠానికి శక్తిలేదు
తినడానికి భుక్తిలేదు
ధనిక దర్పపు సమాజం
నులిమివైచిన కంఠం
పలుకు లేని కంఠం
అంతులేని ఎంతో ఆవేదన
నిస్సహాయతా నయనాలతో
అనుభవించిన కంఠం
నా చలనం లేని కంఠం
ఈ కంఠం సహించింది
తరతరాల దాస్యాన్ని
అనుభవించింది యుగయుగాల
దారిద్ర్యపు బాధల్ని
కానీ ఈ కంఠానికి ముక్తిలేదు
పలకడానికి శక్తిలేదు
ఆకలి మంటల కాహుతియై
దహించి పోయింది కంఠం
పెద్దలనే వాళ్ల పెత్తనానికి
బలియై పోయింది కంఠం
ఇక పలుకు లేదు
ఇది మూగవోయింది

కాని
ఓ క్రూర సమాజమా!
అన్యాయమయ ప్రపంచమా!
తస్మాత్ జాగ్రత
కలిగి ఉండండి అప్రమత్తం.

ఈ కంఠం
ఆకలి మంటల కాహుతైన
కోటాను కోట్ల ప్రజల
హృదయ విదారక
ఆక్రందనాలకు నిలయం
భరింపరాని దారిద్ర్యపు
బాధలతో పడి నలిగిన
ప్రజానీకపు భయంకర
ఆర్తనాదాల కాకరం
ఇది పగిలిందా
ఇది పలికిందా
ఆగలేరు మీరు
నిలువలేరు నిజం
మూగబోయిన ఈ కంఠం
ప్రళయాన్ని [illegible].

స్వతంత్ర

సంపుటి-3
సంచిక-50

జూలై 13, 1951

ప్రచురణ:
ప్రతి శుక్రవారం

ఆశ్చర్యం: అద్భుతం

ఆలిండియా కాంగ్రెస్ కమిటీకి సమర్పించిన నివేదికలో, ప్రధాని నెహ్రూ యీ హెచ్చరిక చేశాడు: "ఏదో విధాన ఎన్నికలలో గెలిచి అధికారం చేజిక్కించుకునే మామూలు రకం రాజకీయవేత్తల వలెనే మనం ప్రవర్తించవలసి ఉంటుందా? లేక శాసనసభల్లో పార్లమెంటులో స్థానాలకంటె, మన ఆదర్శాలనూ, ఉద్దేశ్యాలనూ అమూల్యంగా ఎంచుకున్నట్లు ప్రవర్తించవలసి ఉంటుందా? వచ్చే ఎన్నికలకు అభ్యర్థులను నిలబెట్టడంలో జాగరూకత చూపాలని నా ఆశ. మనం పదేపదే ప్రబోధించే ఆదర్శాలను, ఆచరణలో చూపించిన చిత్తశుద్ధిగల విశుద్ధవర్తనులనే నిలబెట్టాలి. గెలవడమే ప్రధానంగా ఎంచి కల్మషాత్ముల్ని నెత్తికెట్టుకోవడం కంటె, శీలవంతుల్ని నిలబెట్టి ఓడిపోయినా గౌరవప్రదమే"

ఎన్నికల ప్రచారానికి సమయం వేరు: దాని ధోరణి కూడా వేరుగానే ఉంటుంది. ఆత్మశోధన వేళ వేరు. ఒక్క గుక్కలోనే రెండూ ఉచ్చరించడానికి ప్రయత్నించడం రెండింటిలో దేనినీ సాధించలేము. ఇటీవల తను ఏది మాటాడినా ప్రజలు అపనమ్మకంతోనే వింటున్నారన్నది గమనించకుండా పండిత నెహ్రూ యిలా ధర్మపన్నాలు వల్లించుకుంటూ పోతూండడం ప్రమాదకరం. సమీప భవిష్యత్తులో నెహ్రూ ఎలా ప్రవర్తిస్తాడన్నది ఎవరికీ తెలియదు. అభివృద్ధి నిరోధకశక్తులను ఎదిర్చి ధైర్యంగా నిలిచి కాంగ్రెస్‌ను ప్రక్షాళితం చేసి దేశానికి మేలు చెయ్యవచ్చు; లేదా మాటలకూ చేతలకూ ఎక్కడా పొందని విధంగా ప్రవర్తించి దుష్టశక్తులచేతుల్లో కీలుబొమ్మగా ఉండిపోవచ్చు. అది ఆయన అభిమతానికీ, అంతరాత్మకీ సంబంధించిన విషయం. తన కళ్లెదుటనే జరుగుతున్న యథార్థ సంఘటనలను చూసి కూడా కళ్లు మూసుకున్నట్టే, అవేవో భ్రాంతి అయినట్లే, మాట్లాడుతూంటే? కేవలం గంభీర ప్రవచనాల వల్ల నాయకత్వం శాశ్వతంగా నిలబెట్టుకో గల్గడం అసంభవం. కాని ప్రస్తుతం కాంగ్రెస్ సంస్థలో ఆలోచనా శక్తి స్తంభించి పోయింది. పదేపదే వాగిన గ్రామఫోన్ రికార్డులాగ, నాయకుల వాక్కులకు అర్థప్రేరేపణ శక్తి లేకుండా పోతున్నది.

ఒకచెంప పండిత నెహ్రూ యిలా ప్రబోధిస్తూ ఉండగానే యింకో చెంప

అచ్చంగా నెహ్రూగారి ఆశయాలకు విరుద్ధంగా కాంగ్రెస్ ఎన్నికల సన్నాహం జరుగుతున్నది. ఈ వారంలో కాంగ్రెస్ కార్యదర్శి కళా వెంకట్రావు గారు మద్రాసులో కొత్త మంత్రుల నియామకాన్ని గురించి సాగించిన మంతనాలు, వాటివివరాలు, బహుశా పండిత నెహ్రూ చెవిని పడడానికి అవకాశం ఉండదు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ పెదలకూ, కళా వెంకట్రావుగారికీ యిప్పుడు ఆంధ్రదేశం మీదా, మంత్రి వర్గంలో ఆంధ్ర ప్రాతినిధ్యం మీదా హఠాత్తుగా ప్రేమ జనించుకొచ్చింది. ఈసట్టున తమిళ నాయకుల వైఖరిపట్ల కొంత ఆగ్రహం ప్రదర్శించడం కూడా జరిగింది. ఇద్దరు తెలుగువారిని మంత్రులుగా నియమించడానికి సంప్రతింపులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇన్నాళ్లూ లేని తొందర యిప్పుడు దేనికి? రాష్ట్ర ప్రభుత్వాన్ని యింకో యిద్దరు ఆంధ్రులు అలంకరించకపోతే ప్రభుత్వం కుంటుపడుతుందా అంటే అదీ లేదు. మంత్రుల సంఖ్య ఎంత ఉన్నా ఒకటేనని ఏనాడో రుజువయింది. ఇక ఆంధ్ర ప్రాతినిధ్యం కొరవడిందని బెంగపెట్టుకుని అది భర్తీ చెయ్యడానికి పూనుకున్నారా అంటే,- కళా వెంకట్రావుగారి మంత్రిగిరీ స్థానం ఖాళీ అయి రెండున్నర సంవత్సరాలయింది. సంజీవరెడ్డిగారి స్థానం ఖాళీ అయిన వెంటనే, అది తిరిగి భర్తీ చెయ్యబడదని ముఖ్యమంత్రి ప్రకటించడం జరిగింది. ఇంతలోనే యిప్పుడీ హుటాహుటి మంతనాలు దేనికి?

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేజిక్కించుకోవడంలో, మంత్రి వర్గీయులు అనేకులకు అనేక వాగ్దానాలు చేసి తమ పక్షానికి తిప్పుకున్నారు. అందులో మంత్రి గిరీ యిస్తామని ఎందరికో హామీ యిచ్చారు. అటువంటి వాగ్దానాలన్నీ యిప్పుడు తక్షణం తీర్చమని కోరుతున్నవి. తప్పించుకునే మార్గం లేదు. రానున్న ఎన్నికలలో తమ పక్షాన ప్రచారానికి పెత్తందార్లు కావాలి. ఈ వర్గాలన్నీ ఎదురు తిరిగి ప్రతిపక్షం చేరిపోకుండా నొక్కిపట్టి ఉంచాలంటే, వాగ్దానం చేసిన వరాలు యిచ్చితీరాలి. మంత్రిపదవులు ఎవరికిస్తే ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటుందో అన్న సమస్యపై మంత్రివర్గీయులలోనే ఏకాభిప్రాయం లేకపోయేసరికి, కళా వెంకట్రావుగారు నడుంకట్టి రంగంలోకి దిగవలసివచ్చింది. ఇటుచూస్తే ఈ ఉద్యోగ ఫలప్రదానానికి ముఖ్యమంత్రి అంత సుముఖంగా లేకపోవడం, అటుచూస్తే మంత్రిత్వం. అపేక్షిస్తున్నవారి సంఖ్య అపారంగా ఉండడం—కళావారు ఎదుర్కొన్న సమస్య చిక్కుతో కూడుకున్నదే అనాలి. చివరికి శ్రీ కందుల బాలనారాయణరెడ్డిగారినీ, శ్రీ మల్లిపూడి పళ్ళంరాజుగారినీ నిశ్చయించారని వార్తలు. అంటే, శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారూ, శ్రీ కల్లూరి సుబ్బారావుగారూ, యథాప్రకారంగానే మిగిలిపోయారన్న మాట. వీరిద్దరిపట్లా ఆంధ్ర ప్రజలు ప్రత్యేకమైన సానుభూతి చూపవలసి ఉంటుంది. అయినప్పుడూ, కానప్పుడూ ప్రకాశంగారిమీద ధ్వజమెత్తడం దగ్గర నుండి, చేనేత కార్మికులకు "బావిలో పడి ఛావండి" అని సలహా యిచ్చేదాకా, శ్రీ కల్లూరివారు యథాశక్తి దేశ సేవ చేశారు. అయ్యదేవరవారి రంగు ఫిరాయింపు సరేసరి. చివరకి

వీరిద్దరి కృషి నిష్కామకర్మ అయింది.

రానున్న ఎన్నికల కోలాహలానికి నాందీప్రస్తావన యీ విధంగా ఉంది. ఇంకో ఆరు నెలల ముచ్చటకి ఇద్దరు కొత్తమంత్రులు రాష్ట్రానికి అవసరమా అన్నది వేరేప్రశ్న. ఆ యిద్దరూ తెలుగు వారైనంత మాత్రాన ఆంధ్రులు ఉబ్బి తబ్బిబ్బయిపోతారా అంటే, ఏమో! మంత్రివర్గంవారి ఆశ అది. కాంగ్రెస్ ఆదర్శాల సంగతి అటుంచి, ప్రజల్లో మతతత్వం, కులతత్వం, స్వార్థపరత్వం, వీలయినంతవరకూ ప్రకోపింపచేసి ఓట్లు సాధిస్తే, అదే పదివేలు. జరుగుతున్న చరిత్ర పండిత నెహ్రూకి తెలుసునో తెలియదో మనకి తెలియదు. ఆయనకు తెలియదంటే నిజంగా ఆశ్చర్యం. తెలిసే ఆయన యిలా మాట్లాడుతున్నారంటే, అద్భుతం.

నెహ్రూ సింహావలోకనం

"అశ్వని"

ఈ వారం బెంగళూరులో ఏ.ఐ.సి.సి. సమావేశం కానున్నది. ఇంతవరకూ జరిగిన కాంగ్రెసు పరిపాలన యొక్క మంచి చెడ్డలను గురించి సింహావలోకనం చేస్తూ నివేదిక ఒకటి ప్రధాని నెహ్రూ ప్రకటించాడు. దాని ఆధారంపైనే బెంగళూరులో చర్చలు జరుగుతాయని కూడా తెలిసింది.

నెహ్రూ సింహావలోకనం ఎవరి దృష్టినుంచి కూడా ఏమంత సంతృప్తికరమైనదిగా కనిపించదు. అందులో కొత్తవిషయాలేమీ లేవు. లోపాలైతే లోగడ ఆమోదించబడ్డాయో అవే ఇప్పుడూ పునరుద్ఘాటించబడ్డాయి; కాని వాటిని పరిష్కరించటానికి "విప్లవయుత"మైన మార్గాలేవీ సూచించబడ లేదు. "కాంగ్రెసు మంత్రులు నీతివంతులుగా వ్యవహరించాలి. ఆదర్శాలను పాటించాలి. 'తలుపులు' తెరిచి ఉంచాలి" ఇత్యాది ధర్మపన్నాలే ఉన్నాయి ఇందులో కూడా. సామాన్య ప్రజలు శ్లాఘించని అనేక విషయాలను గురించి నెహ్రూ కాంగ్రెసు వీపుతట్టాడు.

ఈ తరుణంలో కాంగ్రెసు అత్యవసరంగా చేయవలసిన పని ఏమంటే, నలుముఖాలా తనతో ఎన్నికలలో పోటీ చేయనున్న వివిధ రాజకీయ పక్షాల కార్యక్రమం సరిఅయినది కాదనీ, అంతకన్న తన కార్యక్రమం ప్రజల అవసరాలను సాధించి ప్రజాజీవితం ముందుకు తీసుకుపోవటానికి మరింత బాగా ఉపయోగపడ గలదనీ రుజువుచేయటం; లోగడ తాను చేసిన పొరపాట్లేవైనా ఉంటే వాటిని నిశితంగా విమర్శించి వాటిని ఎట్లా సరిదిద్దుకునేదీ సూచించటం. ఈ ఆశయాలతో ఏ. ఐ. సి. సి. బెంగుళూరు సమావేశానంతరం ప్రణాళిక ప్రచురిస్తే ప్రచురించవచ్చు. కాని ఆ ప్రణాళికకు నెహ్రూ సింహావలోకనం తోడ్పడుతుందనుకోవటానికి ఆట్టే అవకాశం కనిపించటం లేదు.

ఇతర పార్టీలను గురించి మాట్లాడుతూ సోషలిస్టులనూ, ప్రజాపార్టీనీ నెహ్రూ పైపైన విమర్శించాడు. కాంగ్రెసుకూ, ప్రజాపార్టీకీ గల వ్యత్యాసం విధానంలో ఉన్నదీ కార్యక్రమంలో ఉన్నదీ సరిగా తెలియటం లేదన్నాడు. అసలు విభేదాలు స్పష్టంగా లేనప్పుడు వ్యక్తిగతమైన సంఘర్షణలు బయలుదేరుతాయన్నాడు. (ఈమాట అబద్ధం కాదు. దీనికి ప్రజాపార్టీ నాయకులు ఏం సమాధానం చెబుతారో చూడవలిసి ఉంది.) మొత్తంమీద ప్రజాపార్టీ, సోషలిస్టు పార్టీలు కేవలం పదవుల కోసమే కాంగ్రెసుతో ప్రతిఘటించుతున్నట్లూ, వారికి వేరు లక్ష్యాలు లేనట్టూ

నెహ్రూ భావిస్తున్నా డనిపిస్తుంది. అందుచేత ఆ పార్టీల ప్రతిఘటనను గురించి నెహ్రూ ఎట్టి ఆందోళనా కనబరచలేదు. పోతే కమ్యూనిస్టులనూ, కమ్యూనలిస్టులనూ (హిందూ మహాసభలాటి సంస్థలనూ) విధ్వంసక వర్గాల కింద నెహ్రూ జమకట్టాడు. వాళ్లు రాజ్యాంగాన్ని తారుమారుచేయ యత్నిస్తారనీ. దాన్ని ఏ ప్రభుత్వమూ సహించదనీ ఆయన చెప్పాడు. మరొక సందర్భంలో కమ్యూనిజము గురించి మాట్లాడుతూ, "కమ్యూనిజము ప్రజల సుఖ్యావసరాలు జరుపుతాననీ భద్రత కలిగిస్తాననీ అంటుంది కనక చాలామంది కది రుచిస్తుంది. కాని దాని వెనకగా సంఘర్షణా, హింసా, నిరంకుశత్వమూ, వ్యక్తులను అణచివేయటమూ మొదలైనవి సంభవించటం మనం చూస్తూనే ఉన్నాం. ప్రజా స్వాతంత్ర్యాలను బలిచేయకుండా ఆర్థికభద్రతా అభ్యుదయాలను సాధించలేమా? కొన్ని ఇబ్బందు లున్నప్పటికీ ఇది సాధ్యం కాదనుకో నవసరంలేదు" అని, కమ్యూనిజం అవలంబించకుండానే "వెల్ ఫేర్ స్టేట్" సాధించవచ్చునని నెహ్రూ తేల్చాడు.

కమ్యూనిజం గురించి నెహ్రూ చెప్పిన దానిలో వింత ఏమీలేదు. కమ్యూనిజం గురించి సరిగా తెలియకుండా, అది అంటే భయపడేవారూ, పని పెట్టుకుని కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం చేసేవారూ, సోషలిస్టు వ్యవస్థలో అమలులోకి వచ్చే సంస్కారం రుచించని "మేధావులూ" కమ్యూనిజం విజృంభించటం వల్ల ఆర్థికంగానూ, రాజకీయంగానూ నష్టపడేవారూ తరుచు అనే మాటలనే నెహ్రూ కూడా అన్నాడు. కమ్యూనిజంలో విశ్వాసం గలవారూ, దాన్ని సమర్థించేవారూ, కోరే వారు నెహ్రూను చాలా ప్రశ్నలు వేయవచ్చును: ఈనాడు ఇండియాలో వ్యక్తులకున్న స్వాతంత్ర్యం ఏపాటిది? ప్రజాస్వామిక దేశాలు ఆర్థిక సుస్థిని యుద్ధయత్నాలద్వారా ఎందుకు కొని తెచ్చిపెట్టుకుంటున్నాయి? హింస మాట ఎత్తదలిస్తే ప్రపంచ యుద్ధాలను చెప్పి మరొకటి చెప్పాలి గనక, రెండు ప్రపంచ యుద్ధాలలో కమ్యూనిజం వహించిన పాత్ర ఏమిటి? "ప్రజాస్వామిక" దేశాలు వహించిన పాత్ర ఏమిటి? మూడో ప్రపంచయుద్ధానికి కాలుదువ్వుతున్న దెవ్వరు? ప్రపంచంచుట్టూరా యుద్ధస్థావరా లెవరికున్నాయి? ప్రజాస్వామిక దేశాలలో నూటికి 90 వలసదేశాలనూ, ఆర్థికంగా వెనకపడిఉన్న దేశాలనూ ఎందుకు దోచుకుంటున్నాయి?

ఈ ప్రశ్నలకు నెహ్రూ ఏ సమాధానమిచ్చినా మనకు ఒకటే ననుకుందాం. కాని నెహ్రూ ఇండియాలో కమ్యూనిజమునకు ప్రత్యామ్నాయంగా "వెల్ ఫేర్ స్టేట్" ఏర్పాటు కావాలనటం చాలా హాస్యాస్పదమైన సంగతి. ఇందులో నెహ్రూ రాజకీయ విచక్షణా శక్తి అణుమాత్రమైనా ప్రతిఫలించటంలేదు. ఈ "వెల్ ఫేర్ స్టేట్" నినాదం బ్రిటిషు వారిది. 1945లో లేబరు ప్రభుత్వం ఏర్పడిన తరవాత కొన్ని మార్పులు బ్రిటనులో జరిగాయి. ధనిక వర్గాలపై తీవ్రంగా పన్నుల భారం వేశారు. కొన్ని ప్రధాన పరిశ్రమలను జాతీయం చేయాలని సంకల్పించారు. నిరుద్యోగ సమస్య దాదాపు అంతమొందించారు. దేశమంతటా ఉచిత వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

కాని దీన్ని సాధించటానికే అమెరికా దగ్గర భారీగా అప్పులు చేయవలసి వచ్చింది. "మా దగ్గిర డబ్బు పట్టుకుపోయి ఈ బ్రిటిషు వాళ్ళు సోషలిజం అమలు చేస్తున్నారు" అని అమెరికను పత్రికలు హేళన చేశాయి. "పరిశ్రమలు జాతీయం చేయటమూ, ఉచితంగా కళ్లజోళ్ళూ, కట్టుడు పళ్ళూ యివ్వటము మానితేగాని మనం బ్రిటనుకు డాలర్లు ఇవ్వరాదు" అని మరికొన్ని అమెరికను పత్రికలు కారాలు మిరియాలు నూరాయి. ఏమైనా ఈ అప్పు ఊరికే పోలేదు. అమెరికా తెచ్చిన "ఒత్తిడి" ఫలితంగా బ్రిటను భారీగా యుద్ధయత్నాలకు ఒడిగట్ట వలసి వచ్చింది. "సోషలిజముకూ యుద్ధోత్పత్తికీ కూడగదు. ఏదో ఒకటి మానుకోవాలి" అన్నది నానాటికీ బ్రిటిషు వారికి స్పష్టంగా తెలిసి వస్తున్నది.

బ్రిటనులో ఆరంభమైన "వెల్ ఫేర్ స్టేట్" గతి ఈ విధంగా ఉంది. ఇక మనం ఈ దేశంలో "వెల్ ఫేర్ స్టేట్" సాధించే

లేమిటి? అది సమీపంలో లేదని నెహ్రూ కూడా ఒప్పుకున్నాడు. అదిసమీపంలో లేదన్న మాటకు దూరంగా ఉన్నదని ఎవరైనా అర్థం తీయవచ్చు. కాని నిజమేమిటంటే “వెల్ ఫేర్ స్టేట్” మనకు కనుచూపుమేరలో ఎక్కడా లేదు. ఈ మాట నెహ్రూ స్పష్టంగా అని ఉండవలసింది. కాని నెహ్రూ ఆ మాట అంటే కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం గాన కుసుమాలే నని ఒప్పుకోవలసి వస్తుంది. అందుచేతనే నెహ్రూ “వెల్ ఫేర్ స్టేట్” సన్నిహితంగా లేదని మాత్రం అన్నాడు.

“వెల్ ఫేర్ స్టేట్” మనకు ఎంతదూరంలో ఉందో చూద్దాం. (1) మనం ఇంకా పరిశ్రమలను జాతీయం చేసే పద్ధతిని గురించి నిర్ణయించలేదు. మన దేశానికి “మిశ్రమ” ఆర్థిక విధానము ఉండాలనీ, అందులో ప్రభుత్వ భాగమెంతో ఇకముందు నిర్ణయమవుతుందనీ నెహ్రూ అంటూనే ఉన్నాడు. కనీసం భారీ పరిశ్రమలనన్నా జాతీయంచెయ్యకుండా “వెల్ ఫేర్ స్టేట్” సాధించటం సాధ్యంకాదు. ప్రస్తుతం చైనాలో కూడా “మిశ్రమ” ఆర్థిక విధానమే ఉన్నది; అయినా చైనా కమ్యూనిస్టు రాజ్యం. కనక “మిశ్రమ” ఆర్థిక విధానమన్నంత మాత్రాన అది “వెల్ ఫేర్ స్టేట్”కు దారితీసేదో, సోషలిస్టు వ్యవస్థకు దారితీసేదో చెప్పటం సాధ్యంకాదు. దాన్ని నిర్ణయించటం సాధ్యం చేసే వివరాలింకా నెహ్రూకే తెలియవు. (2) మనకు అమెరికా భారీగా డాలర్లివ్వదు. ముఖ్యంగా మనం యుద్ధ వ్యతిరేకులం గనక. యుద్ధ యత్నాలు భారీగా చెయ్యటం మన అభిమతం కాదని నెహ్రూ స్పష్టంగా చెబుతున్నాడు గనక అమెరికా కోట్లకొద్దీ డాలర్లు అప్పిచ్చే ఆశ ఎంతమాత్రమూ లేదు. అమెరికా అంతులేకుండా డాలర్లు అప్పిస్తేగాని బ్రిటను వంటి పారిశ్రామికదేశమే “వెల్ ఫేర్ స్టేట్”కు ఉపక్రమించలేకపోతే, చెప్పుకోతగిన పరిశ్రమలు లేకుండా, అమెరికా డాలర్లూ లేకుండా మనం “వెల్ ఫేర్ స్టేట్” ఏవిధంగా సాధిస్తామన్న సమస్య కలిగితీరుతుంది. (3) అన్నిటికన్న ముఖ్యమైన విషయమేమంటే మనకు సామ్రాజ్యం లేదు!

బ్రిటను ప్రారంభించిన “వెల్ ఫేర్ స్టేట్”కు వలస ప్రాంతాల మద్దత్తు పూర్తిగా ఉంది. నెహ్రూ లెక్క ప్రకారం కమ్యూనిజంలో ఉన్నంత దౌర్జన్యంలో కాకపోవచ్చుగాని, మొత్తంమీద మలయాలో ప్రజల రక్తంపిండి బ్రిటను రబ్బరు సాధించి దానిమీద విపరీతమైన లాభాలు తీస్తున్నది. పెర్షియాలో బ్రిటను నూనెద్వారా సంపాదించే లాభాలు ఏ ప్రమాణంలో ఉన్నాయో మనం పత్రికలలో చదివేఉన్నాం. కామన్వెల్తుకు తలగానూ, ఆసియా ముడి పదార్థాల గుత్త ఎగుమతి దారుగానూ, స్టెర్లింగు ప్రాంతానికి బ్యాంకరుగాను బ్రిటను చాలా ఆర్జిస్తున్నది. ప్రతి బ్రిటిషు కార్మికుడు సంపాదించే ప్రతి నాలుగు షిల్లింగుల లోనూ ఒకటి “సామ్రాజ్యం” ధర్మాన లభిస్తున్నదనీ, అందుచేతనే బ్రిటనులో కమ్యూనిస్టుల మాటలు పారవనీ కూడా చెప్పేవారున్నారు! ఇటువంటి సదుపాయాలు ఇండియాకు లేవని వేరే చెప్పనక్కర్లేదు.

ఇదంతా కూడా ఎందుకు? మన ప్రభుత్వం మన ధనిక వర్గాలని పన్నులద్వారా పిండలేకపోవటమేగాక, వారు పన్నులు ఎగగొడితే గట్టి చర్య కూడా తీసుకోలేదు. ఇటువంటి ప్రభుత్వానికి ప్రధాని అయిన నెహ్రూ “వెల్ ఫేర్ స్టేట్” ప్రస్తావించటం కేవల వంచన కావాలి, లేదా అపాయకరమైన ఆత్మవంచన కావాలి.

నెహ్రూ సింహావలోకనంలో అన్నిటికన్న పెద్ద లోపమేమంటే నెహ్రూ కాంగ్రెసు పరిపాలనను పాలకుల దృష్టితో చూశాడు గాని పాలితుల దృష్టితో చూడలేదు. ఆయన తన మనస్సులో అనుకొనే ఊహాచిత్రాలకూ వాస్తవానికీ ఏమీ సంబంధం లేదు. యథార్థం కళ్ళ ఎదట నగ్ననాట్యం చేస్తున్నా ఆయన చూడలేదు. ఉదాహరణకు, సంస్థానాలను ఇండియాతో చేర్చటం చాలా గొప్ప విషయంగా నెహ్రూ చెప్పాడు. ఈపని సాధించిన సర్దారు పటేలు “సంస్థానాధీశులను మన మిత్రులుగా చేసుకున్నాం”, అని చెప్పి చనిపోయిన కొంత కాలానికి ఈ మిత్రులే ఒక సంస్థానాధీశుని అధ్యక్షుడుగా పెట్టుకుని యూనియను ఏర్పాటుచేసి ఒక ఆట ఆడారు! సంస్థానప్రజల

జీవితంలో అవగింజంత మార్పు కలిగినట్టు లేదు. పైపెచ్చు వారికష్టాలు పెరిగాయేమోకూడానూ. నెహ్రూ దృష్టినుంచి గొప్ప పరిణామంగా కనిపించేది ప్రజలదృష్టిలో చిన్న పరివర్తనగాకూడా లేదు. ఇదే రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్న కాంగ్రెసుమంత్రుల విషయంలోనూ వర్తిస్తుంది. వీరంతా ఋషీశ్వరులనీ, అగ్రతాంబూలవారనీ ఎన్నికలకు నిలబెట్టితే ఇంక దేశప్రజలు కోరతగింది ఏమీ లేదని నెహ్రూ భావిస్తున్నట్టు కనిపిస్తుంది. కాని ఈ వర్గాలలోనే అవినీతి ఏ విధంగా పెచ్చు పెరిగిందో, అభ్యర్థులను నిర్ణయించేందుకొరకు ఎటువంటి హేయమైన పనులు జరుగుతున్నాయో ప్రజలకు తెలుసు—నెహ్రూకు తెలిసినట్టు కనబడదు.

నెహ్రూ ఎంతసేపూ "ఇది చేశాము; ఇది చెయ్యలేకపోయాము, చెయ్యాలి" అన్న ధోరణిలో మాట్లాడతారు. ఈ కాంగ్రెసు ప్రభుత్వం ఏమీ సాధించలేకపోయినా ప్రజలు బాధపడి ఉండరు. తాము కోరిన ప్రభుత్వం కోసం ప్రజలు ప్రాణాలు విడువమంటే విడుస్తారు. కాని కాంగ్రెసువల్ల జరిగిన లోపం ఏమీ చెయ్యలేకపోవటంకూడా కాదు; కాంగ్రెసు చేసిన ప్రతిపనీ ప్రజాసామాన్యానికి ప్రాణాంతకంగా పరిణమించటం. దేశంలో ఎవరూ బాగుపడలేకపోతే ఎట్లా ఉండునో. కాని జరిగినది అదికాదు. కాంగ్రెసు అధికార వర్గాలవారు బాగుపడ్డారు; ధనిక వర్గాలవారు బాగుపడ్డారు; జమీందారులను రద్దు చేస్తామని నోటీసిచ్చి అందరి పొలాలూ కలుపుకునే అవకాశంకూడా విరివిగా ఇవ్వటంవల్ల జమీందార్లూ బాగుపడ్డారు; ప్రజల జీవితం అంతకంతకూ క్షీణించి మారణహోమం అవుతున్న సమయమందే ప్రజా విద్రోహక వర్గాలు బాగుపడటమూ, కాంగ్రెసు అధికార వర్గాలు ప్రజల దృష్టిలో ఈ ద్రోహాలకు సన్నిహితంగా కనబడటమూ జరిగింది. ఈ పరిణామానికి క్షమాపణ లేదు. నెహ్రూ తన సింహావలోకనంలో దాన్ని ప్రస్తావించలేదు. ప్రజల విముఖత హెచ్చిందని మాత్రమే నెహ్రూ అన్నాడు. ఆ విషయం తెలుసుకున్నవాడు చెప్పదగినది ఎంతో ఉన్నది కాని నెహ్రూ చెప్పలేదు. ప్రజల సమస్యలన్నీ కాంగ్రెసు ఒక్కతృటిలో పరిష్కరించనందుకు ప్రజలు విముఖులైనారని నెహ్రూ అనుమానం కావాలి.

తన సింహావలోకనంలో నెహ్రూ ఒక విచిత్రమైన మాట అన్నాడు. కాంగ్రెసు పరంగా ఆత్మవిమర్శ చేసుకునే శక్తి నెహ్రూలో ఎంతగా లోపించిందో ఈ మాటే వ్యక్తం చేస్తున్నట్టు కనిపిస్తుంది. నెహ్రూ అన్న మాట ఇది: "...స్వాతంత్ర్యం రావటంతో దేశానికిగల అభిప్రాయాలన్నీ వెనక పడ్డాయని బహుశా ప్రజలు అనుకుంటూండవచ్చు. అందుకనే వారు సంకుచిత వర్గాలకూ, [illegible] విధానానికీ లొంగుతున్నారు."

సరిగా దీనికి విరుద్ధమైన భావాన్ని "న్యూ స్టేట్స్‌మన్ అండ్ నేషన్" అనే బ్రిటిషు వార పత్రికలో ఒక విలేఖరి ప్రకటించాడు. "బాహ్య శత్రువు [illegible] వైదొలగటంతో కాంగ్రెసు విచ్ఛిత్తి ఆరంభమయింది" అన్నాడాయన. చూస్తే ఇదే నిజంగా కనబడుతుంది. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత, కడుపులు నింపుకోవడమూ, ఇళ్లు చక్కబెట్టుకోవడమూ తప్ప ఇంకే పని ఏదీ లేనట్టు ప్రవర్తిస్తున్న వారెవరన్నా సందేహంలో ఉంటే వారు కాంగ్రెసు అధికారులే. మిగిలిన పార్టీలలో సంఘర్షణ ఉంటే అవి సిద్ధాంతాలకు సంబంధించినవి. కేవలం పదవీ వ్యామోహంతో కూడిన సంకుచితత్వం కారణంగా చీలికలు బయలుదేరినది ఒక్క కాంగ్రెసులోనే. కాంగ్రెసు మనోవైకల్యాలను దేశప్రజలకు నెహ్రూ ఎందుకు అంటగట్టుతున్నాడో ఊహించరాకుండా ఉంది.



కాంగ్రెసుకని బ్రిటిషు సామ్రాజ్యస్త్రీము గతముతో కడ తేరింగి. తెల్లవారిన తరువాత భామ వేషమువలె దాని మొగాన ఇప్పుడు అర దళము మరకలు మొగమీసము మొలకలు మోటుశరీర లక్షణాలు ప్రస్ఫుటమగుచున్నవి —త్రిలిఙ్గ.

భాషాప్రయుక్త రాష్ట్రాలు

తుర్లపాటి వెంకటకుటుంబరావు

భాషాప్రయుక్తంగా భారతదేశ పునర్విభజనాందోళన ఈనాటిది కాదు. ఈ ఆందోళన అతిప్రాచీనమైనది. బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వాధికారులు సృష్టించిన ప్రస్తుత రాష్ట్రాలు, భాషా, సంస్కృతులు ప్రాతిపదికగా పునర్విభజించబడాలని 1903 లోనే స్వర్గీయ లోకమాన్య బాలగంగాధర్ తిలక్ ఒక ఉద్యమాన్ని ప్రారంభించాడు. 1916లో ఆయన డెమొక్రాటిక్ స్వరాజ్యపార్టీ ఎన్నికల ప్రణాళికలో కూడా భాషాప్రయుక్త రాష్ట్ర విభజనావశ్యకతను గురించి వివరించాడు.

1920 లో గాంధీజీ కూడా భాషాప్రయుక్త రాష్ట్రవిభజన సిద్ధాంతాన్ని అమోదించడమే కాక, ఆ సంవత్సరం డిసెంబర్‌లో శ్రీ సేలం విజయరాఘవాచారి అధ్యక్షతను నాగపూర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభలో ఆ సిద్ధాంతాన్ని అంగీకరింప చేశాడు. తదాది, అనగా 1921 నుంచి, అఖిలభారత కాంగ్రెస్ భాషాప్రయుక్త రాష్ట్రీయ కాంగ్రెస్ సంఘాలను స్థాపించి, వాటిద్వారానే కాంగ్రెస్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నది.

1937-9 సంవత్సరాలలో కాంగ్రెస్ మంత్రివర్గాల పరిపాలనా సమయంలో కూడా మద్రాస్, బొంబాయి శాసనసభలలో భాషాప్రయుక్తంగా ప్రస్తుత రాష్ట్రాలను పునర్విభజించాలనే తీర్మానాలు ఆమోదించబడినవి.

1945వ సంవత్సరంలో ఆమోదించబడిన కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో భాషా సంస్కృతుల ప్రాతిపదికగా ప్రస్తుత రాష్ట్రాలను పునర్నిర్మించాలని స్పష్టీకరించబడింది.

1903 లోనే ప్రారంభించబడి, 1920 లో గాంధీజీ, అఖిలభారత కాంగ్రెస్‌లచే ఆమోదించబడినా, భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణోద్యమం నేటివరకూ ఫలించకపోవడం మిక్కిలి శోచనీయం.

స్వాతంత్ర్యం సిద్ధించక పూర్వం భాషాప్రయుక్తనిర్మాణావశ్యకతను గురించి కాంగ్రెస్ నాయకులు మహోపన్యాసాలు చేసేవారు. భాషా, సంస్కృతులతో నిమిత్తం లేకుండా ప్రస్తుత వికృత రాష్ట్రాలను సృష్టించడంలో బ్రిటిష్‌వారు అనుసరించిన స్వార్థప్రేరిత సిద్ధాంతాలన్ని వారు విమర్శించేవారు. ఏకభాష, ఏక సంస్కృతి, ఏక చరిత్ర, ఒకే ఆచార సంప్రదాయాలు కల భాషావర్గాలను వివిధ రాష్ట్రాలలో విభజిస్తే, వారిలో సమైక్యత నెలకొనజాలదనీ, తాము నిర్మించిన అసహజ రాష్ట్రాలలోని వివిధభాషలవారు పరస్పరం కలహించుకొంటూవుంటారని, తత్ఫలితంగా భారత జాతీయోద్యమానికి భంగం కలుగగలదనీ, ఈ ముఖ్యోద్దేశంతోనే బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ప్రస్తుత కృత్రిమ రాష్ట్రాలను సృజించారనీ కాంగ్రెస్ నాయకులు ఇదివరలో చెబుతూ వుండేవారు. బ్రిటిష్‌వారి ఈ దుశ్చింతకు "విరుగుడు"గానే కాంగ్రెస్ మహాసభ భాషాప్రయుక్త రాష్ట్ర కాంగ్రెస్ సంఘాలను స్థాపించి, వాటిద్వారా తన కార్యక్రమాన్ని, స్వాతంత్ర్యోద్యమాన్ని నిర్వహించింది.

అయితే, స్వాతంత్ర్య సంసిద్ధికి పిదప పరిస్థితి మారింది. భాషాప్రయుక్త రాష్ట్రనిర్మాణ సూత్రాన్ని గురించి మహోద్ఘోషలు చేసిన కాంగ్రెస్ నాయకులే నేడు ఆసూత్రాన్ని నిరసిస్తున్నారు. ఆ సిద్ధాంతాన్ని ఖండించడమే నేడు దేశభక్తికి తార్కాణంగా పరిగణించబడుతున్నది. భాషాప్రయుక్త రాష్ట్రాలను కోరేవారు నేటి కాంగ్రెస్‌నాయకుల దృష్టిలో "సంకుచిత రాష్ట్రీయ తత్వప్రేరితులు."

భాషాప్రయుక్త రాష్ట్రాల నిర్మాణం వల్ల భారతదేశంలో వుండే రాష్ట్రాల సంఖ్య అధికం కాగలదనీ, తత్ఫలితంగా కేంద్రప్రభుత్వం బలహీనం కాగలదని, అందువల్ల, ఆ సిద్ధాంతాన్ని త్రోసిపుచ్చాలని కొందరి వాదం. కాశ్మీర్ వివాదం మున్నగు సమస్యలు పరిష్కారమయ్యే

వరకూ భాషాప్రయుక్త రాష్ట్రాల నిర్మాణ సమస్యను వాయిదా వేయాలని మరికొందరి అభిప్రాయం. అంతేకాక, భాషా రాష్ట్రాలు జాతీయ సమైక్యతకు భంగకరమనీ, వాటివల్ల వివిధ రాష్ట్రాల మధ్య విభేదాలు పెంపొందగలవని వీరి అపోహ. వాస్తవిక దృష్టితో పరిశీలిస్తే వీరి వాదన పరీక్షకు నిలచునట్టిది కాదు.

సుమారు 16 కోట్ల జనాభా కల యునైటెడ్ స్టేట్స్ 49 రాష్ట్రాలుగా విభజించబడినా, ప్రపంచంలో అగ్రరాజ్యంగా వెలుగొందుతున్నది కాని, దాని జాతీయ సమైక్యతకు భంగం వాటిల్లలేదు కదా! దాదాపు 20 కోట్లు జనాభా కల సోవియట్ రష్యాలో 17 రిపబ్లిక్‌లు (సంపూర్ణ స్వపరిపాలనాధికారం కల రాష్ట్రాలు) నిర్మించబడినవే! కాగా, ద్వితీయ ప్రపంచమహాసంగ్రామంలో యావత్ప్రపంచాన్ని గడగడ లాడించిన జర్మనీని ఎదుర్కొని సోవియట్ రష్యా అఖండ విజయాన్ని పొందడంలో భాషాప్రయుక్తంగా నిర్మించబడిన ఈ రిపబ్లిక్‌లు కేంద్రప్రభుత్వానికి ఇతోధిక శక్తిని చేకూర్చినవే కాని, దానిని బలహీనం చేయలేదుకదా! అయినప్పుడు భాషా ప్రయుక్త రాష్ట్రాలు కేంద్రాన్ని శక్తివిహీనం చేయగలవనే వాదనలో పటుత్వం వున్నదా?

ఇక, కాశ్మీర్ మున్నగు సమస్యలు పరిష్కార మయ్యేవరకు భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణ సమస్యను వాయిదావేయాలనే వాదన విషయం: నిజామ్, కాశ్మీర్ సమస్యలు పరిష్కరించబడేవరకు భాషారాష్ట్రాల నిర్మాణసమస్యను వాయిదా వేయాలని కొందరు కాంగ్రెస్ నాయకులు ఇదివరకు చెప్పేవారు. ఏవిధంగానైతేనేమి, తుదకు నిజామ్ సమస్య పరిష్కరించబడింది. ఇక, ఇపుడు కాశ్మీర్ సమస్య పరిష్కరించబడుతున్నది. ఈ సందర్భంలో కాంగ్రెస్ నాయకులు ఒక విషయాన్ని ఆలోచించాలి. ప్రభుత్వం అనేది వున్నపుడు, దానిని ఎల్లపుడు ఏదో ఒక సమస్య ఎదుర్కొంటూనే వుంటుంది. అనుక్షణం మహత్తర రాజకీయ పరివర్తనాలు జరుగుతున్న నేటి కల్లోల ప్రపంచంలో సమస్యలు లేనికాలమే వుండదు

అయినా, విప్లవం జరిగిన తొలిదినాలలో సోవియట్ రష్యా ఎదుర్కొన్న వాటికంటే విషమ సమస్యలను నేడు మన ప్రభుత్వం పరిష్కరించవలసి వున్నదా? ఒకప్రక్క విప్లవం ఇంకా సమాప్తి కాకపూర్వమే, మరొకప్రక్క దేశంలో, వెలుపల నుంచీ మహాప్రమాదాలు సంభవించనుండగా, విప్లవం జరిగిన మరునాడే 1917 నవంబర్ 8వ తేదీన లెనిన్ కలగాపులగంగా వున్న రష్యన్ రాష్ట్రాలను భాషాప్రయుక్తంగా పునర్నిర్మించాలనే ఆతురతను ఒక అమెరికన్‌తో వెలిబుచ్చాడు. తలపే వుండాలి కాని మార్గం అనేది లేకుండా పోతుందా?

భాషా ప్రయుక్త రాష్ట్రాలను నిర్మించడం వల్ల భారతదేశంలోని ఆయా ప్రాంతాలభాషలు, సంస్కృతులు, సారస్వతం, ఆచార సంప్రదాయాలు ఏకరీతిగా అభివృద్ధి చెందగలవు. ఆయా భాషావర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా అభ్యున్నతి చెందడానికి భాషా ప్రయుక్త రాష్ట్రనిర్మాణం విశేషంగా తోడ్పడగలదు. ఒకే రాష్ట్రంలో వుండే విభిన్న భాషా వర్గాల మధ్యవున్న పరస్పర అవిశ్వాస అనుమానాలు అపుడు తొలగిపోగలవు. తత్ఫలితంగా భారతదేశంలో సుస్థిరమైన జాతీయత నెలకొనడం, కేంద్రప్రభుత్వం మరింత పటిష్ఠం కావడం జరుగుతుంది.

కనుక, కేంద్రప్రభుత్వంలోని కాంగ్రెస్ నాయకులు స్వాతంత్ర్య సంప్రాప్తికి పూర్వం తాము ఈ సందర్భంలో చేసిన వాగ్దానాలను జ్ఞప్తికి తెచ్చుకొని, భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన సిద్ధాంతాన్ని అమలుపరచడానికి పూనుకోవాలి. నిష్పాక్షికమైన అధికార, అనధికార ప్రముఖులుకల సరిహద్దు నిర్ణాయక సంఘాలను నియమించి, వివిధ భాషారాష్ట్రాల సరిహద్దుల నిర్ణయానికి వారు ఉద్యమించాలి. వచ్చే ఎన్నికలలోగా ఈ కార్యకలాపం యావత్తు ముగిసిపోవాలి. అంతేకాని, ఎన్నికల ప్రణాళికలో "భాషాప్రయుక్త రాష్ట్రనిర్మాణం విషయం ప్రస్తావించబడినంత మాత్రాన ప్రజలు సంతుష్టి

ఉండబోరు. ఆ రోజులు పోయినవి. ఇదివరకు ఎన్ని ఎన్నికల ప్రణాళికలలో ఈ విషయం చేర్చబడలేదు కనక?

బెంగుళూర్‌లో జరుగనున్న భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణవాదుల సమావేశం ఈ విషయంలో కేంద్రప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొనివచ్చి, వచ్చే ఎన్నికలలోగా భాషా ప్రయుక్త రాష్ట్ర నిర్మాణోద్యమం ఫలించేటట్టు చూడాలి. ఈ సిద్ధాంతం విషయంలో కేంద్ర ప్రభుత్వనాయకులకు కల అపోహలను, అనుమానాలను తొలగించి, భాషా రాష్ట్రాల నిర్మాణానికి సంబంధించి నిర్దిష్టమైన సూచనలను జులై 16వ తేదీన జరుగనున్న సమావేశం చేయాలి.

క్షణంలో సగం

"శారద"

కృష్ణ గోదావరికీ, నేను పోలీసు స్టేషన్‌కీ వెళ్ళాను. గడియారం తప్పు నడుస్తోంది. కాలం ఎదురు తిరిగింది. కొరియా యుద్ధం సమాప్తమయ్యేటుంది. కావలసినన్ని గోషములు. రేషన్ పెరిగింది. మనుష్యులు సన్నగిల్లుతున్నారు.

అమెరికాకు ఆర్థిక సంక్షోభం రాకుండా కాపాడ్డానికి యూరోపియన్ రాజ్యాల విదేశాంగ మంత్రులు ఫ్రాన్సులో ఎక్కడో సమావేశమై ఆశియాలో మళ్ళీ ఎక్కడ యుద్ధం ప్రారంభించాలో చర్చించి నిర్ణయించగలరు.

సైనిక కవాతుల వార్తాచిత్రానికి 'శాంతి రక్షణ' అని పేరు పెట్టటం ఎంతయినా సముచితంగా ఉంది. చేతి బీరకాయలో నెయ్యి తియ్యటం విషయమై నియమించబడిన కేంద్ర "నెయ్యి నిపుణుల" సంఘం రిసెర్చి నిమిత్తం మద్రాసు రానున్నారు. ఆంధ్ర రాజకీయాల విషయం పట్టించుకోరట.

జానపద లక్షణాలు మిళితమైన సాంఘిక చిత్రాలు కూడా శతదినోత్సవాలు చేసుకోగలవని గాబోలు నమ్ముతున్న కొందరు తగిన వారిని వలవేసి పట్టుకోబోతున్నట్టు మద్రాస్ వార్త. ఇప్పటికే అట్లాంటివారు "సర్వం" తామే నిర్వహించగలమని మద్రాస్ చేరినట్టు తెలుస్తున్నది.

అసలు కన్న నకలుమీద మోజు. రచనల మీదకన్న రాసేవాళ్ళమీద మోజు. సినిమా పాత్రలమీదకన్న తారలమీద వ్యామోహం! పత్రికలమీదకన్న ముఖచిత్రాలమీద మోజు.

నక్షత్రాల పేర్లన్నీ ఇదివరకే పెట్టేసినందువల్ల, గ్రహాలపేర్లు ఉపయోగించటం అవసరమని గీతారావు మోతాంజర్‌లో వ్రాశాడు. ఉదా: భూమి పిలిమ్స్. శని పిక్చర్స్, బృహస్పతి ఫిలిం సర్క్యూట్; ఇత్యాది. అంగారక, సూర్య, చంద్ర, ఇత్యాది... అలా వ్రాస్తూ గీతారావు, వ్యాసారావుగారి పుస్తకంలోని కొన్ని అమూల్య భాగాల్ని కూడా ఉదహరించారు. కొత్త పిల్లల పత్రికలు స్థాపించగల వారికి కూడా అందులో పేర్లు ఉన్నాయి. "అముదం; ఉగ్గుగిన్నె; ఉయ్యాల; బిస్కట్లు" అల్లుళ్ళకు ప్రత్యేకంగా, "అలక" అనీ, ఎన్నిసార్లు ఓడిపోయినా తిరిగి తిరిగి, రాజకీయాల్లో ప్రవేశిస్తూ, కేంద్రానికీ, రాష్ట్రానికీ మధ్య రెక్కలు కట్టుకుని తిరిగే రాజకీయ వేత్తలకు ప్రత్యేకం "శిఖండి" అనీ పత్రిక పెట్టవచ్చునని వ్యాసారావు తన పుస్తకంలో ఉదహరించారు.

కొత్త పార్టీలో కలకలం, లేదా కలవరం, అంటే లేచిపోవటం; గైరు హాజరు; ఆ యింట ఆ పొయ్యిలో కొలని కట్టెలు, ఈ యింట ఈ పొయ్యిలో మాత్రం కొలుతయ్యా? తడి తడే; ఎండు ఎండే; పొగమాత్రం జోరుగావుంది. ఆంధ్రులకు ఈ పొగబాధ ఎప్పటికి నివారణ ఔతుందో జోస్యులు చెప్పలేరు.

"అవసరం" తప్ప అన్య పదంలేని నిఘంటువుల్ని వేదాంతరావు తన అనుచరులకు ఉచితంగా సప్లయిచేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో, అభ్యర్థులకు ఇవి చాలా "అవసరం" అని వారి ఉదారాశయం.

ద్వికంఠ

"ధారాశాస్త్రి"

వినవోయీ సంగీతం
ప్రతిధ్వనిత సొగసుల
ప్రత్యూషపు ప్రశాంతి మోద
సంరంభపు సౌరాంశం—
నా హృదయం మసాలాట్టు
వెట్టు కోట్టు స్వేషలట్టు
అనుభూతుల కైపైమంట
ఇల గాథలు అజ్యధార—

* * *

వినవోయీ రసగానం
విశ్వశ్రుతి మందస్వన
నిష్యంద స్పందములో
హృదయాలను రాగించే
మధుగానాల సమ్మేళన—
పాటపాడ పోయెనాకు
పాడు గొంతుకెక్కనాడు
చుట్టుప్రక్క జనమంతా
ఇల్లు వదలి వెళ్లినారు—

* * *

ఈ ప్రకృతి స్వర్గలోక
సమ్మోదోద్యానములో
పూలతావి పొంగించిన
తేనెజాలు గిలిగింతల
కోరిస్సుల కోటపట్టు—
ఏడుస్తున్నవి పూవులు
కన్నీళ్లుల కారుస్తూ
తిండిలేక బట్టలేక
చావలేక బ్రతకలేక—

* * *

ఈ ప్రకృతి స్వర్గలోక
సమ్మోదోద్యానములో
హిమనదీ తీరాంచలమున
చంద్రకాంత వేదిపైన
పల్లవాల శయ్యమీద జ్యోత్స్నతో
మిళదచ్ఛాభరణ కాంతిచ్ఛట కనరాగా
దేవకాంత శయనించిన
పుణ్యతీర్థ సమ్మేళన—
పుచ్చపువ్వు విచ్చినట్లు
వెన్నెల ఉన్నదనుకొంటే
మారుతముల నీలినీడ
వేయి పాము పడగల వలె
భయపెట్టిన గీ నేలను—

* * *

నీకోసం కాచుకున్న
వేల్పు సాని యోగిగానోయ్—
ఎవతే, నీదేవూరే,
ఎందుచేత యింతరాత్రి
ఒంటరిగా ఎక్కడగా
పడుకున్నావ్ పిచ్చిపిల్లా!—

* * *

నీకోసం కాచుకున్న
దేవకన్య పడకలాగు
చిక్కిపోయి మాసిపోయే
గతికి వచ్చె సోదరుడా—
ఈ రకం నాకు తెలుసు
చమకట్టున చెమట కంపు
గట్టిముట్టు దుర్గంధం
అయినా యీ చలికాలం
ఏదో ఒక ఆనందం
ఇంతకు నీ కేలేమిటే?—

* * *

స్వరమేళ—
నే నెవరో నీకు తెలుసు
నే నెరుగుదు నీ వెవరో
నీవులేని నేను సున్న
నేనులేని నీవు సున్న—
నే నుంటేనే నీ తీపి
నీ వుంటేనే నా చేదు
మనమిద్దర మీ జగమున
చావులేని బ్రతుకులము—

కథానిక

జేబుదొంగల బాధితుడు

"పుష్య"

పనిమీద తొందరగా నడిచిపోతున్నాను. వచ్చే పోయే బళ్లతోటీ, కార్లతోటీ గొప్ప కోలాహలంగా వుంది. నేను ఏదో తీవ్రంగా ఆలోచిస్తూవుండటంవలన మనుష్యులను అంతగా పట్టించి చూడలేదు.

అంతవరకూ కలగనిది, నన్నెవరో వెంబడిస్తున్నట్టు చిన్న అనుమానం కలిగింది. నడుస్తూ వుండగానే తిరిగి చూశాను. నే ననుకున్నది నిజమే. ఆయ నెవరోగాని నన్నంటి పెట్టుకునే నడుస్తున్నాడు. అయినా నే నెందుకు అనుమానపడాలి? ఎవరి పని చూసుకోడానికి వాళ్లు వెళ్ళిపోతూ వుంటారు. అలాంటిది నన్నే వెంబడిస్తున్నా డనుకోవడం తెలివి తక్కువ అనుకొని మళ్ళా వేగంగా నడవడం ప్రారంభించాను.

కాని మనసు ఒక మూల పీకుతోంది. ఏం చెయ్యడానికీ తోచలేదు. ఎందుకింత ఆందోళన? ఆగి అడిగేద్దామా అనుకున్నాను. తీరా అడిగితే ఏమనుకుంటాడో? మళ్ళా తిరిగి చూశాను. ఆయన నడుస్తూ నావేపే చూస్తున్నాడు. ఇంతలో వెనకనుంచి 'అయ్యా' అన్న పిలుపు వినిపించింది. చప్పున ఆగిపోయాను. అనుకున్నది నిజమే. ఆయన నాకోసమే వస్తున్నాడు.

మనిషి చూడబోతే నలభైయేళ్ళకు పైబడ్డ వాడిలాగున్నాడు. పంచా, కోటు వేసుకున్నాడు. బాగా మాసిపోయేయి. గడ్డం బాగా పెరిగింది. కళ్లు లోతుకుపోయి నీరసంగా కనిపిస్తున్నాడు.

నేను గాభరాతో ఏం మాట్లాడాలో తెలియక నిశ్చేష్టుడినై నిలుచున్నాను.

"మీతో చిన్న పనుండి వస్తున్నానండి" అన్నాడు.

ఆశ్చర్యమేసింది నాకు. ఆయన ఎవరో, ఏం పని చేస్తున్నాడో, ఎక్కడున్నాడో తెలియదు సరిగదా, ఎన్నడూ ఆయనను చూడలేదు. అలాంటి అపరిచిత వ్యక్తికి నాతో పనేమొచ్చిందా అనుకున్నాను.

"నాతోనా? ఏంపనండీ?" అన్న మాటలు నా నోటినుంచి అప్రయత్నంగా వెలువడ్డాయి.

"అబ్బే, మరేం లేదండి. నాకసలు పెద్ద వాళ్ళతో మాట్లాడడానికే కష్టమనిపిస్తుంది. అంచేత మీలాంటి కుర్రాళ్ళంటే కొంచెం మాట్లాడడానికి మనస్కరిస్తుంది." అని సావధానంగా ఏదో పెద్ద గ్రంథాన్ని వర్ణించేవాడిలాగ ప్రారంభిస్తున్నాడు. తను చెప్పేవన్నీ ఎవరేనా వింటారేమో అన్న భీతితో కాబోలు యిటూ, అటూ చూస్తూ, చెప్పవలసిన విధంగా చెప్పకపోతే నే నెక్కడ వినకుండా వెళ్లిపోతానో అన్న భయంతో ఒక్కొక్క మాటే చెబుతున్నాడు. ఇద్దరం రోడ్డుకు ప్రక్కగా తప్పుకున్నాం.

"మీది ఈ వూరేలా వుంది" అన్నాడు నా సంగతి తెలుసుకోడానికి ఆదుర్దాపడుతున్న వాడిలాగ.

"అవునండి" అన్నాను ముక్తసరిగా.

"చదువుకుంటున్నారా? లేక ఏదేనా పని..."

"చదువు మొన్ననే పూర్తయింది. ఇంకా ఏ పనీ లేదు" అన్నాను. అక్కడితో ఆ సంభాషణని త్రుంచివేద్దామన్న వుద్దేశంతో. ఆయన మాత్రం,

"బాగానే వుంది. మరేం లేదు. మీతో ఒక విషయం మనవి చేసుకుందామని, తమరు కోపగించుకోక పోతే."

"అబ్బే. ఎంతమాట? చెప్పండి."

అన్నాను. అంత మనిషి ఎదురుగా అంత వినయ విధేయతలతో ఏదో చెబుతా నంటూ వుంటే, వద్దనడం మర్యాద కాదని.

"చాలాదూరంనుంచి వచ్చాను. కలకత్తాలో జేమ్సు అండ్ వారెన్ కంపెనీలో పని చేస్తు

న్నానండీ. అకస్మాత్తుగా యీ వూరు రావలసి వచ్చింది."

అని వూరుకున్నాడు. అయితే ఆయన పనికీ నాకూ సంబంధమేమిటి? ఇంతవరకూ ఆ కంపెనీ పేరయినా వినలేదే. ఆలోచనలతో బుర్ర వేడెక్కి పోతోంది.

"అయితే ఏంచంటారు?" అనడిగాను.

"చూశారూ, మీరు యీవూరి వారేగనుక, యిక్కడి సంగతులు బాగా తెలిసున్నవారు గనుక చెబుతున్నాను. అప్పుడే వారం రోజు లయింది నేనొచ్చి. సత్రంలో బస చేశాను. మర్నాడు పని చూసుకుందాంకదా అని రాత్రి పడుకున్నానండి. ఈ వూరు కూడా అలాం టిదే అని తెలిసుంటే జాగ్రత్తగా వుండివుందును. నాకేం తెలుసు యిలాంటిదని. తెల్లారేక చూస్తునా, ఏముంది? నా సామాన్లు లేవు. జేబులో మనీ పర్సు లేదు. కట్టుకున్న బట్ట లతో మిగిలాను."

దీన స్వరంతో పూర్తి చేశాడు మాటని. ఆయన ముఖ కవళికలు పూర్తిగా మారి పోయాయి. ఆ సమయంలో ఆయన ముఖం చూస్తే ఎవరికైనా జాలేస్తుంది. అనుకోకుండానే 'అయ్యో' అన్నాను.

ఆయన తలవాల్చి ఒక్క కన్నీటి బిందువును రాల్చి "ఇప్పుడు నాకేం కావాలో చెప్పండి. ఇంకెవ్వరూ నాకు నా అన్నవాళ్లు లేరు. పోనీ స్నేహితులేనా వున్నారా అంటే అంతకన్నా లేరు. ఇలా జరిగిందని, డబ్బు పంపమని మా వాళ్లకు వ్రాద్దామంటే చివరకు చేతిలో చిల్లు గవ్వయినా లేకుండా పోయింది."

అని నిట్టూర్చి కళ్లు తుడుచుకున్నాడు. మరేమీ మాటాడలేదు. అతనప్పుడు డబ్బు అవసరంలోవున్నట్లు అర్థమైంది. నా గుండెలో రాయిపడ్డది. ఇంకా ఏమి చెబుతాడా అని ఆయనవేపు చూశాను.

"పెద్దవాళ్లతో యిదిచెప్పుకోడానికి ఎంతో కష్టమనిపిస్తుంది. ఒకప్పుడు బహుగా బతికినవాణ్ణి. అదీగాక యింత వరకూ ఎవరి దగ్గరా చెయ్యి చాచి ఎరగను! సగం చచ్చి మీతో చెబు తున్నాను."

నాకు మరీ అంకోళనగావుంది. జేబులో డబ్బులు వేసుకున్నట్లు జ్ఞాపకంలేదు. ఇంతసేపు ఆయన తన దుస్థితిని నాముందు చెప్పుకున్నాక 'నా దగ్గరేమీ లేవండీ' అంటే ఆయన మన స్సెంత చివుక్కుమంటుందో. ఆ గాఢరాలోనే

"అయితే ఏమంటారు?"

అన్నాను. ఈ మారు జవాబివ్వడానికి కొంచెం సందేహించాడు. దగ్గరగా ఎవరూ లేకుండా చూసి,

"మీరు కనికరిస్తారన్న ఆశతో అడుగు తున్నాను. ఇంకెవరిని అడగటానికీ నా ఒళ్లు చస్తోంది. వారం రోజులనుండి భోజనంలేదు. మీరేమైనా ..."

ఊరుకున్నాడు. జేబులు చూసుకున్నాను. ఒక్క పావలా కాసుంది. వారం రోజులనుంచి భోజనం లేదంటున్న మనిషి చేతులో పావలా కాసెలా పెట్టడం. నాకే ఎంతో సిగ్గువేసింది.

"పని తొందరమీద జేబులో డబ్బులు వేసు కోడం మర్చిపోయానండి. ఒక పావలా కాసు మాత్రం వుంది. మరోలాగ అనుకోకుండా తీసుకుంటే సంతోషిస్తాను."

అన్నాను మాటలు తడబడుతూ, ఏమను కుంటాడో అనికించపడుతూ.

"అదే పదివేలండి. లేనిదానికి మీరేం చేస్తారు" అన్నాడు.

మా సంభాగంతా యింగ్లీషులోనే జరిగింది. నేను తొందరపనిమీద వెళ్లుతున్న విషయం స్ఫురణకు వచ్చింది. గబగబా అడుగువేశాను.

మర్నాడు మా రామం గారానే జరిగిన దంతా పూసగుచ్చినట్లు చెప్పాను. చాల విచా రించేడు.

జేబు దొంగలమీద చిన్న వుపన్యాసం దొర్లింది. వీళ్లు ఒక్కొక్కరికి ఎటువంటి యిక్కట్లు కలిగిస్తున్నారో, ఎందరిచేత చేయ రానిపనులు చేయిస్తున్నారో, ఎందరిని ఏ స్థితి నుంచి ఏ స్థితికి దిగలాగుతున్నారో, అన్న విష యంమీద నిలుమన్నపాటున ఒక వుపన్యాసం యిచ్చాడు. కొంతసేపటివరకూ వాడినోట్లోంచి యింకా మాటలు దొర్లుతూనే వున్నాయి.

"అదంతా కాదుగాన్యా, వీళ్ళకు తినడానికి తిండి లేకపోతే, సంపాదించడానికి శక్తి లేక

పోతే, దొంగతనమే చెయ్యాలా అంటాను. ఎందుకు అడుక్కోకూడదూ?"

అన్నాడు వేగిరం యీ విషయం నుంచి విరమించనన్న ధోరణిలో. మావాడి సంగతి నాకు బాగా తెలుసు. ఏ విషయాన్ని పట్టుకున్నా ఒకంతకు గాని వదిలిపెట్టడం జరగదు. అందుచేత నేనేమీ అనకుండా వూరుకున్నాను.

"పాపం, యింతో అంతో గుట్టుగా బతుకుతున్న ఆ పెద్దమనిషిచేత చెయ్యి చాపించారా. అతనికళ్లు ఎంతలా నిలువునా కాలిపోయిందో చెయ్యిచాచి అడగటానికి."

ఇంకా మావాడికి వుక్రోషం తీరలేదు. నోటికొచ్చినవి ఏవో వాగుతున్నాడు. అక్కడికి ఆ విషయంనుంచి ప్రసంగం మారుస్తామన్న వుద్దేశంతో మరేవో విషయా లడిగాను. వాడు వూరుకోలేదు.

"ఈ జేబుదొంగల నందర్నీ కట్టకట్టి కొరడాలతో కొట్టిస్తే నేగాని బుద్ధిరాదు. పాపం నిన్న ఆయనయ్యాడు. రేపు నేనవుతాను. అందరిదీ ఒకలాంటిదే నంటావా బాధ?"

చివరకి ఎలాగైతేనేం ఊరుకున్నాడు. వాడన్నదీ నిజమే. ఈ జేబుదొంగల ప్రవర్తన అమాంతంగా ఆ వ్యక్తిచేత చెయ్యి చాపించింది. ఆ రోజల్లా యీ సంగతులతోనే గడిచిపోయింది.

కొన్నాళ్ళకు యీ సంగతే పూర్తిగా మర్చిపోయాను. చాలకాలంవరకూ యీ జేబుదొంగల ప్రసక్తే రాలేదు. ఒకనాటి సాయంత్రం రీడింగు రూమ్‌లో పేపరు చదువుకుంటున్నాను. ఇంతలో రాము హడావిడిగా వచ్చి,

"ఒరే, నీ కో విషయం చెప్పాలి, రా పోదాం" అన్నాడు. వాడి ఆత్రుత చూసి అదేదో చాల గొప్ప విషయం అనుకొని వెంటనే లేచి వెళ్ళాను. ఇద్దరంకలిసి బీచి చేరుకున్నాం.

"నిన్నొక సంఘటన జరిగిందిరా. అది చెబుదామని నిన్నటినుంచి వెతుకుతున్నాను నిన్ను"

ఆ వేదనను, ఆత్రుతను అపుకుంటూ అన్నాడు. నేను మాటాడకుండా కూర్చున్నాను. ప్రారంభించాడు చెప్పడం.

"నిన్న శ్రీపతీ, నేనూ కలిసి కాఫీ హోటలుకు వెళ్ళాం. లోపల కూర్చున్న తరువాత వాడుప్రిన్సిపాలుగురించి ఏదో ఏకరువు పెడుతూ వుంటే వినడానికి యిష్టం లేకపోయినా వింటున్నాను తప్పదుగదా అని.

"అప్పటికి పదినిముషాల ముందునించి నా వెనకాల ఏవో మాటలు వినిపిస్తున్నాయి. ఇంతల శ్రీపతి మాటలు వింటున్నానుగనక ఆమాటలు సరిగ్గా వినలేక పోతున్నాను. ఆయన సెవగో పాపం బ్రతిమాలుతున్నాడు ఎదురుగుండా వున్న పెద్దమనిషిని. ఎదురుగా వున్నాయన విననట్టు నటిస్తున్నాడు. ఆయన చెబుతున్న మాటలు వినాలన్న కుతూహలంతో ఆయనవేపు చూశాను.

"మాసిపోయిన పంట్లాం వేసుకున్నాడు. కోటు చిన్న చిరుగు పట్టింది. వయస్సు అతనికి యించుమించు నలభై పైమాటే. ముఖమంతా పాలిపోయింది. విచారంతో క్రుంగిపోతున్నట్టున్నాడు. ఒక చెవిని అటు మళ్ళించాను.

" 'నేను మీకు శ్రమకలిగిస్తున్నందుకు చాల కించపడుతున్నాను. నేను చెప్పకునేది కొంచెం వినండి.'

"అంటున్నాడు. కాని ఎదురుగా వున్నాయన యిది వినిపించుకున్నట్టు లేదు. తన స్నేహితుడితో కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నాడు. మళ్ళా అడిగాడు ఆయన.

" 'అందరినీ నోరు విడిచి అడిగే వాడిని కానండి. నా బాధను తెలుసుకో గలవారని మీతో చెప్పుకుంటున్నాను. తమరు కనికరించకపోతే ప్రాణాలు పోతాయండి.'

" 'అయితే ఏమంటావయ్యా?'

"అంతవరకూ చెబుతున్నదేదీ విననట్టు నటించిన మనిషి నోటినుంచి ఈ మాటలు వచ్చాయి. చురచుర చూస్తున్నాడు.

" 'మీరిలా కోపగించుకుంటే ఏం చెయ్యగలను చెప్పండి. నేను పై వూరివాడిని. బొంబాయినుంచి యిక్కడకు ఇరవై మైళ్ళ దూరంలోవున్న వూరికి నన్ను బదిలీ చేశారు. దారిలో దొంగలు కట్టుకున్న బట్టలతో సహా ఒలిచేశారండి.'

"అని కళ్ళంట నీళ్ళు బొటబొట కార్చేడు. ఊస్సురని ఒక నిట్టూర్పును బరువుగా వదిలాడు. ఎదురుగావున్న ఆయన మాత్రం కూర్చొని వింటున్నాడు.

" 'మీలాంటి వుద్యోగస్థులు నా దుర్భరావస్థను అర్థం చేసుకోగలరని సిగ్గు విడిచి చెప్పుకుంటున్నాను. టిక్కెట్టు సయితం మనీపర్సులో వుండిపోవడంచేత అది కూడా నాకుదక్కకుండా పోయింది. టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేస్తున్నానని టిక్కెట్టు కలక్టరు యిక్కడ దింపేశాడండి. ఇప్పటికి నాలుగు రోజులయింది. భోజనం లేదు, కంటికి కునుకు లేదు.'

"కన్నీరు తుడుచుకున్నాడు. అయినా ఎదురుగా వున్నాయనకు కరుణ కలుగలేదు. అంతా విని ఆయన లేచిపోవడానికి సిద్ధంగా వున్నాడు.

" 'అయ్యా! మీకు పుణ్యముంటుంది. ఒక కప్పు కాఫీ అయినా యిప్పించండి. నోరు విడిచి అడుగుతున్నందుకైనా కనికరించండి.'

"ఆ స్నేహితు లిద్దరూ మాట్లాడకుండా వెళ్ళిపోయారు. కొంతదూరం వెళ్ళి నవ్వుకొన్నారు. నాకు వొళ్ళు మండింది అంత కఠిన హృదయులా అనుకున్నాను. పోనీ లేనివాడు మనుకుంటే దగ్గర దమ్మిడి అయినా లేదు. ఏం చెయ్యను?

"ఆయన మాత్రం అలానే కుర్చీలో కూలబడ్డాడు. చేసేదిలేక మేము బయటికి వచ్చేశాం.

"నే నెక్కడుగులాగ. ప్రభుత్వం యీ జేబుదొంగలనని కొంచెమయినా అదుపులో వుంచదేం. అందరినీ అలాంటి బాధలకు గురి చేస్తున్నారు గదా. ఎంత బాధపడ్డాడో పాపం! చివరకి కాఫీకి కూడా చెయ్యి చాచవలసి వచ్చింది."

మా రామం చెప్పవలసిన దంతా సమాప్తి అయిపోయింది. కళ్ళారా చూశాం కొబట్టి జరిగిన సంఘటనలను స్మరణకు తెచ్చుకొని విచారిస్తూ కూర్చున్నాం. విచారించి చేసే దేముంది, దేశంలో ఎలాంటి విపరీత చర్యలు జరుగుతున్నాయో అని అనుకోడం తప్ప?

మే మిద్దరం ఈ సంగతులు మాట్లాడుకుంటున్న సమయంలో శ్రీపతి చిన్ని నవ్వు ముఖంతో మాదగ్గరకు వస్తూనే.

"ఒరే రామం! నిన్న మనం చూసిన ఆయన్ని పెళ్ళాం పిల్లలతో సహా దింపినట్టున్నాడురా టిక్కెట్టు కలెక్టరు" అని ఘొల్లున నవ్వేడు. రామానికి ఇదేమీ అర్థం కానట్టుంది. వెర్రిగా చూశాడు.

"తనొక్కడే బొంబాయినుంచి వస్తున్నానన్నాడు గదా పెళ్ళాం, పిల్లలు ఏమిటి? అదెవరిని చూసి అనుకున్నావో" సందేహాన్ని వెలిబుచ్చుతూ అన్నాడు రామం. దానికి శ్రీపతి,

"పట్టపగలు ఆమాత్రం కనిపెట్టలేననుకున్నావా? ఇవాళ మా నాన్నగారిని దిగబెట్టడానికి స్టేషనుకు వెళ్ళాను. నిన్న మనం చూసిన ఆయన పెళ్ళాం పిల్లల్ని మామూలుగా వుంచి ప్లాటుఫారంమీద నిలుచున్న మరొకాయనతో తన గోడు చెప్పుకుంటున్నాడు. ఆ దృశ్యం చూడటం వల్ల నాకాశ్చర్యం?" అని వుండబట్టలేక శ్రీపతి మరొకసారి నవ్వాడు. వాడి వైఖరి చూసి రామానికి ఒళ్ళు మండింది.

శ్రీపతి సంగతి నాకు తెలుసు. ఎప్పుడూ పరిహాసం ధోరణే. [illegible] స్వతంగా ఆలోచించడం వాడికి [illegible] వుంటాయి. అందుచేత వాడన్న దానిని లక్ష్యపెట్టలేదు మేమిద్దరం.

కొన్నాళ్ళ తరువాత ఏదో మంచి సినిమా వచ్చిందనగానే మా స్నేహితులం అందరం సినిమాకి బయలుదేరాం. హాలుదగ్గర టిక్కెట్లు దొరకడం చాలా కష్టంగా వుంది.

ఇంతలో టిక్కెట్లు కొనడానికి వెళ్ళిన శ్రీపతి గబగబావచ్చి "ఆయన్ని చూడండ్రా" అన్నాడు.

మా అందరి చూపులు అటునికేసి మళ్ళాయి. జేబుదొంగలు తనని కట్టుబట్టలతో వొదిలేసేరని, ఏదైనా సహాయం చెయ్యమని ప్రతిమాలుకుంటున్నాడు.

"ఈసారికూడా ఆయన్ని టిక్కెట్టు కలక్టరు రైలునుంచి దింపినట్టున్నాడురా"

అన్నాడు శ్రీపతి. ఘొల్లుమన్నారు స్నేహితులందరూ.

ఆయననుచూసి రామం, నేనూ విస్తుపోయాం.

ప్రాతఃకాలపు తెలంగాణా

"వెంపా"

మధ్యలో నీ తొందరను గుర్తించి చెప్పబోయే విషయాన్ని ఆపి వినోబాజీ భూదానయజ్ఞాన్ని గురించిన నీ అనుమానాన్ని నివృత్తిచేయాలని ప్రయత్నించా. నా ప్రయత్నం యేమాత్రం ఫలించినా నా లేఖలు కీర్తికాయాన్ని ధరించగలవని భావిస్తా. నెహ్రూ దూతగా పర్యటించిన శ్రీ వినోబాజీ అసలు భూదానయజ్ఞ కార్యక్రమాన్ని ఆదిలో ఆలోచించనే లేదు. ఆయన పర్యటనలో ఒక చోట, అన్నార్తులు "మీరెన్ని శాంతిసౌభాగ్యాలాపనలు చేసినా మా [illegible] చల్లారిన నాడే వాటి ప్రయోజనమ"ని తెలియచెప్పేసరికి తెలంగాణా కల్లోలానికి మూల కారణం ఆర్థిక అసమానతే సుమా! అని ఆ మహనీయునికి అప్పుడు విశదమైంది. ఆ తరువాయి ఈ మహాయజ్ఞాన్ని తలపెట్టాడు. పాడిందే పాడుతున్నానని నీ అనుమానమైతే విషయాన్ని సాగిస్తున్నా విను.

నిజాం ప్రభుత్వ క్రింద పరిపాలింపబడే కర్నాటక మరాఠ్వాడా ప్రాంతాల సంగతి యిక్కడ అప్రస్తుతం గనుక మనకు కావలసిన తెలంగాణానే తీసికొందాం. తెలంగాణా యితర విషయాలు కూడా యిక్కడ అతికినట్టు కనిపిస్తాయి గనుక కలిసిపోయే భాగాన్నే ఇక్కడ ఉల్లేఖిస్తే నీకు శ్రమ తగ్గించిన వాణ్ణవుతానని నా ఆశ. రెండువందల యేండ్లుగా యిక్కడి తెలుగు సోదరులు ఇనుపతెరల చాటున దుర్భర జీవితాన్ని మిగతా ప్రపంచంతో విడివడి అనుభవిస్తున్నారంటే వాళ్ళ నానుకొనే వున్న సర్కారు రాయలసీమలోని తోడబుట్టిన ఆంధ్రులు సిగ్గిలవలసిన విషయం. నిజాం తాబేదారులైన జమీందార్లు, జాగీర్దార్లు, దేశముఖులు, పటేలు పట్వారీలు అక్కడి ప్రజానీకాన్ని తమ ఇనుపపాదాల క్రింద మెత్తలుగా వేసుకొని సాగిపోయారంటే నేను నీకు విశదీకరించవలసిన పనిలేదు.

అసలు నీవూ, నీ వుద్యమం తీవ్ర విమర్శకు గురైన కారణం తెలుపమని నీవు వ్రాసినప్పటికీ నేనా ప్రశ్నకు సంబంధించని విషయాలు వ్రాస్తున్నా నీవెంతో సంతృప్తిని ప్రకటించడానికి కారణం; నేటికాలానికి సాయుధుడవై నీవు అంగలారుస్తున్నావే గాని నీ వుద్యమ గత చరిత్రనుగురించి నీకు అతిస్వల్పంగానూ ఒక్కొక్కప్పుడు అసలు తెలియని కారణంగానే అని గుర్తుంచుకో! నీకు, నీ విమర్శకులకు ఆవిషయాలన్నీ తెలిస్తే నిన్నింతగా వారు విమర్శించడం గాని నీవు వాళ్ళకు సమాధానం చెప్పలేని నిస్సహాయ పరిస్థితిలో వుండటంగాని జరిగి వుండేది కాదు. అప్పుడు యీనాటి నా అవసరం కూడా నీకు వుండివుండేది కాదంటే నీవు గర్విస్తావు కూడా.

నిజాం ప్రభువుకు అంతు చిక్కకుండానే పటేలు పట్వారీలనుండి జమీందార్లవరకు తెలంగాణా ప్రజలశ్రమ శక్తిని పిండి యకరాల కొద్దీ వైశాల్యంగల దివాణాలను తీర్చి దిద్ది పశుతనంలో పరాకాష్ట చెందారు. ఇక సామాన్యులకు మిగిలింది రెక్కలు మాత్రమే! ఈ రెక్కలతోటే వంశ పారంపర్యంగా దివాణాలను సంరక్షించుకుంటూ దుర్భరదారిద్ర్యంలో మునిగి భారమైన జీవితాన్ని దొర్లించుకుంటూ రావడం తెలంగాణా ప్రజలకు శతాబ్దాల తరబడి నిత్యజీవిత విధానంగా మారింది.

కేవలం దేశాన్ని బ్రిటిషు పాలననుండి వేరు చేద్దామనే మహదాశయంతో కాంగ్రెసు నడుము బిగించి పని చేస్తున్న రోజులవి. అయితే నైజాంలో అది కొంత నిషేధింపబడి వుంది. ఆ సమయంలో తెలంగాణా పెద్దలందరూ కలసి "ఆంధ్రమహాసభ, అని ఒక సంస్థను స్థాపించుకొన్నారు. ఐతే అది సామాన్యుని నిత్యజీవితాన్ని తీర్చి దిద్దటానికి వుపయోగపడలేదు. ఆ సమయంలో నీ సోదరుల

బ్రిటిషు ప్రభుత్వంచేత నిషేధింపబడ్డ సంగతి నీకు తెలిసినదే! వారికి అతి సామాన్యుణ్ణి కలిసి కొనే అవకాశం లేక [illegible]గా వుంది. ఈ పరిస్థితిలో అభ్యుదయ శక్తులు కొన్ని తెలంగాణా వైపుకి తమ దృష్టిని కేంద్రీకరించాయి. అప్పుడు తెలంగాణాలో పనిచేస్తున్న సంస్థ "ఆంధ్ర మహాసభ". ఆ దేని నాదం (ఆంధ్రమహాసభ ద్వారా) కమ్యూనిస్టు కార్యకర్తలనుండి ప్రతిధ్వనించింది. మధుపాత్రను పెదవుల దగ్గరకు చేర్చే యువక చేతులు పట్టుతప్పాయి. భూకంపానికి ఊగి నట్లుగా దివాణాలు కంపించాయి. మిత్రమా, ఈ సంవత్సరంలో కవిత్వం వ్రాస్తున్నానని నవ్వ[illegible] స్థితిని చిత్రించడంలో నా కలం ఉరకలు వేస్తోంది. అంతే. ఆ పిలుపు నిరాశా నిస్పృహలకు అనిర్వచనీయమైన ఆనందాన్నిచ్చింది. ప్రతి గుండెలో మేడిని నొక్కిపట్టి నరకం [illegible] ఆ నినాదం జీవశక్తిని పోసింది. పీడిత ప్రజాకోటి ఒక్కుమ్మడిగా ఆ పిలుపు వైపుకి ఆకర్షింపబడ్డారు. ఇంతగా ఆంధ్రమహాసభ మారిపోవడానికి కారణమేమిటని అనుమాన పడేవు, దానికంతటికీ చిత్తశుద్ధితో సాగించే మా కార్యకర్తల చిత్తశుద్ధే కారణమంటాను. అతి సామాన్యులను సంచలనం కల్గించే విధంగా ఆంధ్రమహాసభను నీ వెనకటి తరాల వారు మార్చగలిగారు.

"నీ కాళ్ళు మొక్కుతా దొరా; నీ బాంచన్" (బానిసను) అని ప్రజలు కొట్టుకుంటూ బూట్ల క్రింద నలిగే సామాన్యులకు ఆ కాలానికి "నీ బాంచన్" అనడానికి అభిమానం ఏర్పడ్డది. గ్రామగ్రామాన మహాసభలు, బుర్రకథలు, జముకుల కథలు ఇంకా రకరకాల వైజ్ఞానిక ప్రచారంతో తెలంగాణా ప్రజల్లో నూతన చైతన్యం వెల్లివిరిసింది. అంతకు ముందు ఆంధ్ర మహాసభను ప్రారంభించిన దశలో గాని పూర్తిగా యిప్పుడు నీ అరుణపతాక ఛాయ క్రిందే రానురాను ఈ ఉద్యమం సాగింది. రైతు జన సామాన్యమంతా ఆ పతాకం తమ సంఘటిత శక్తికి చిహ్నమని భావించి ప్రేమించారు. జమీందార్లు బాహాటంగా రైతుల్ని వేటాడటాన్ని ఏ పోలీసులు ఎదుర్కోవడంలో జమీందారులకు ఎక్కువగా మనుష్య రక్తం దొరికేది కాదు. దానితో [illegible] స్వేచ్ఛాప్రవృత్తికి అటంకమైన కమ్యూనిస్టులపై పగపట్టారు.

అనేకమంది [illegible] కార్యకర్తలను తుపాకులతో [illegible] కూడా జమీందారులు వెనుకాడలేదు. జమీందారులు తలపెట్టిన ఈ హింసాకాండానికి ప్రత్యామ్నాయంగా ఉద్యమం మరింత తీవ్రతని [illegible].

నీ [illegible] కాగలవని నాకు తెలుసు. అయినా, నీకు అధికారముంది కూడా! తెలంగాణాలో కలిగిన మార్పు [illegible] కమ్యూనిస్టు కార్యకర్తలు సాగించిన త్యాగ ఫలమే ననడానికి ఎవ్వరూ సిగ్గుపడవలసిన పనిలేదు. వారు ఏ సమయానికి [illegible] అది తిని ఎక్కడ [illegible] అక్కడ నిద్రించి కాలికి బలపాలు కట్టుకొని వందల మైళ్లు పర్యటించి, పనిచేశారు. ప్రత్యేకంగా తెలంగాణా వాసుల హృదయసీమల్లో వారికి ప్రవేశార్హత కలిగింది. [illegible] ప్రాణాలైనా [illegible] సామాన్య గ్రామీణులు విశ్వసించారు. అందుకనే ఆ కార్యకర్తలకు ఉద్యమానికి [illegible] విజయం తేలిగ్గా లభించింది. నా వ్రాతలు నీకు అవగాహన అవుతున్నాయి కదా! అనుమానాలుంటే తెలియజేయి. మరో లేఖలో వివరీకరించడానికి ప్రయత్నిస్తా.

అస్తమానం మనం రాజకీయవేత్తల్ని ఆడిపోసుకోవడం మంచిది కాదు. వాళ్లు రాజకీయాలు వదిలేసినా, వాళ్ళని పోషించవలసిన బాధ్యత ఎలాగూ మనల్ని వదలదు!

కాంగ్రెసుకే నా ఓటు

"దేశభక్తుడు"

[ఈమధ్య [illegible] శ్రీ [illegible] ముస్లింగారు [illegible] మంది కాంగ్రెస్ ప్రచారకుల సమావేశంలో (ప్రజానీకం మధ్యకాదు!) ముచ్చటిస్తూ— "దేశాన్ని సుస్థిరం చేయగలిగింది ఒక్క కాంగ్రెసే: ఇంకో పార్టీని ఎన్నుకుంటే వినాశం తప్పదు" అని తమ దివ్యదృష్టి సారించి జోస్యం చెప్పారు (పూర్తి వివరాలు జూలై 5వ తేదీ ఆంధ్రపత్రికలో చూడవచ్చును). అప్పటికే యీ క్రింద వివరించిన కారణాల మూలంగా నా మనస్సులో నిశ్చయం చేసుకున్నాను, కాంగ్రెసుకే నా ఓటని. శ్రీ ముస్లింగారి జోస్యం చదివాక నా నిశ్చయం వజ్రసంకల్పంగా మారిపోయింది. ఇంకొకరిని ఎన్నుకుని వినాశం తెచ్చిపెట్టుకోవడం దేనికి? శ్రీవారి [illegible] కొట్టి పారెయ్యలేనీ, నా యీ క్రింది కారణాలను సానుభూతితో పరిశీలించ [illegible], పాఠకులకు [illegible].—రచయిత]

మొదటి కారణం

"[illegible]" [illegible] ఉన్నది. [illegible]

రెండవ కారణం

గత ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ చేసిన వాగ్దానాలేవీ నెరవేర్చలేదని కొందరు—కాదు కాదు, అశేష భారత ప్రజ—గోల పెడుతున్నారంటారేమో? "ఆపద మొక్కులు సంపద మరపులు" అనే సామెత మనకు ఉండనే ఉన్నది కదా! చేసిన వాగ్దానాలన్నీ చెల్లించాలనే ఆంతర్యంలోనే వాళ్ళు అప్పట్లో అవన్నీ అన్నారని రుజువు చెయ్యగలరా, ఎవరైనా? ఈ లెక్క ప్రకారం చూస్తే, భారత చరిత్ర ప్రారంభంనుండి నేటివరకూ మనకు మిగిలేది ఆ సత్యహరిశ్చంద్రుడూ, శ్రీరాముడూ,—వీళ్లిద్దరే కదా! మనం ఎంత మునిగిపోయినా, వాళ్ళిద్దరినీ చూసే కదా! ఇంతకూ, సత్యం అన్న మాటకు నిర్వచనమే లేని యీ రోజుల్లో మనకీ మనస్సంక్షోభమంతా దేనికి? సత్యానికే తావు లేని రోజుల్లో దాన్ని గురించి మాట్లాడుకోవడమెందుకు? ఒక గాంధీజీ తన జీవితమంతా సత్యాన్వేషణలోనే గడిపారంటారేమో! మన కాంగ్రెస్‌వారు కూడా సత్యాన్వేషణ చేస్తూనే ఉన్నారు. ఇంకనూ చేయగలరు. కనక ప్రజలు యింతలోనే [illegible] కడంగుట పాడిగాదు. ముంజేతి కంకణమున కద్దమేల అన్నట్లు కాంగ్రెస్ మహనీయుల లోపాలు బోలెడు కనుమలవలె అందరికీ స్పష్టంగా కనబడితే కనబడనివ్వండి గాని, మనది స్వరాజ్యం; సురాజ్యం; పాలించువారు మనవారు; కనక రండా గర్భంలాగు మనం మెదలకుండా ఊరుకోవ

సించే. ఇంతకూ— ముదిమి పైబడినకొద్దీ మతిమరుపు ఎక్కువవడం అనుదినానుభవంలోదే. ఇక ఎన్నికల ప్రణాళికలోని విషయాలు వృద్ధకాంగ్రెస్ ఆచరణలో మరచిపోయిందన్నది ఏదో నేరంగా పరిగణించడం దేనికి? ఎటువంటి ధీమంతుడైనా ప్రమాదవశాన తప్పులు చెయ్యవచ్చును; పురాణ పురుషుడైన ధర్మరాజంతటి వాడే అబద్ధమాడవలసి వచ్చింది. ఇక పోగా సత్యహరిశ్చంద్రుడొక్కడే మనకు దిక్కు. అన్నట్టు యింకో దిక్కు కూడా ఉంది—అదే శుక్రాచార్యులవారి నీతి. సత్యసంధత యొక్క ఉష్ణత్వాన్ని తగ్గించి, సడలించి మినహాయింపులెన్నో ప్రసాదించి, ఎన్నో విషయాల్లో అబద్ధం ఆడవచ్చునని హామీ యిచ్చాడీ ఆచారి. కనక యీ విషయం ఇంతటితో విడిచిపుచ్చుదాం.

మూడవ కారణం

అవశ్యం కాంగ్రెసుకే ఓటు చెయ్యాలనడానికి మరొక ప్రబల కారణం ఏమిటంటే— నాయకులంతా లాఠీపోట్లు తిని, జైళ్లలో మగ్గి స్వరాజ్యం తెచ్చారుకదా! స్వార్థం లేకుండా ప్రపంచంలో ఎవరూ ఏ పనీ చెయ్యరు కదా! స్వరాజ్యం వచ్చిన యీ నాలుగేళ్ళలోను బస్సు రూట్లనీ, సిమెంటు కోటాలనీ, నూలు కోటాలనీ, ఇనుం కోటాలనీ, "సైనక్యూర్" ఎపాయింట్‌మెంట్లనీ (అర్హత అసలే అక్కర్లేకుండా, పని ఏమాత్రం చెయ్యనక్కర లేకుండా పెద్ద జీతాలు ముట్టచెప్పే ఉద్యోగాలు) కంట్రోలు వస్తువుల అమ్మకానికి గుత్తదారులుగాను, లంక పాటలకు యిజారాదారులుగాను, రాజకీయ బాధితులుగా మస్తాపై పట్టాలమీద భూములు మంజూరు చేయించుకొని, — యిత్యాదివీ, ఇంకా బహిరంగం కాని, రచ్చకెక్కని లాభాలెన్నో గుంజుకున్నారు కదా! ఇక్కడి "ఛాన్సు" వీరికి తీసేసి యింకొకరికివ్వకూడదా అంటారేమో! "ఆశాపాశము తాకడకున్ నిడుపు; లేదంతంబు రాజేంద్ర!" అన్నట్లు ఆశ అనే సుగుణ సాధనకు అంతమెక్కడిది? వంద ఎకరాలున్న భూస్వాములు వేల యకరాలకోసం ప్రయత్నించడం లేదా? లక్షలు మూటకట్టిన వర్తకులు కోట్లకు ప్రాకులాడడం లేదా? ఉన్న బ్యాంకు లన్నిటిలోనూ డిపాజిట్లు వేసిన పెద్ద ఉద్యోగులు ఇంక చాలునని లంచాలు తీసుకోవడం మానేశారా?

కాంగ్రెసువారు చేసిన అంత పెద్ద త్యాగానికి—

ఇంత స్వల్ప లాభంతో—

పట్టుమని పది సంవత్సరాలయినా యీ భోగం అనుభవించకుండానే—

అల్పసంతోషంతో పడి ఉండమనడానికి మనకు నోరెట్లా వస్తున్నది? మనవి నాలుకలా, తాటి పట్టెలా? "రండా నాల్కల్ ... లెక్కల్ సేయు పెక్కుల్ సుమీ గండా మొండి కిబండి బండలకు" అన్నట్లుగా మన మూర్ఖ ప్రజల మనస్తత్వం యిలా మారిపోయిందేమిటి? "జనసమ్మతి యూతని జనసట్లు" ప్రాజ్ఞులు ధనము సముపార్జించాలని పెద్దలు చెప్పారుకదా? కాంగ్రెసువారు ప్రాజ్ఞులే అని ఆచరణాత్మకంగా రుజువయిందికదా! అటువంటి పూజ్యుల్ని ఆక్షేపించడం 'కలికాల మహాత్మ్యం' కాక మరేమిటి? ఇంతవరకూ కాంగ్రెస్‌వారు రాగించిన గడ్డిన గూళ్లు చిన్న పేగలలోకయినా చాలవే! ఇంకా పెద్ద పేగలు బావురుమంటున్నాయి. కనక వెక్కసమైనా కక్కసేనా కాస్త వారిని కడుపు నింపుకోనివ్వడం ఉత్తమ ధర్మం. వారింకా దాహం తీరలేదని, రుచి దొరికిన కొద్దీ సరదా ఎక్కువవుతోందని వారి మాటలవల్లా, చేతలవల్లా తెలుసుకుంటూనే ఉన్నాం. ఎదుటివారి మన ప్రవృత్తి కనిపెట్టి వారి కనుగుణంగా నడుచుకోవడమే బుద్ధిమంతుల లక్షణం.

కనక ప్రజలు వివేకవంతులై ఈ—సారి కూడా కాంగ్రెస విజయానికే తోడ్పడతారని ఆశిస్తున్నాను.

నా ఓటుమాత్రం విధిగా కాంగ్రెసుకే!

——:O:——

యుద్ధకాలానికీ, శాంతకాలానికీ అంతర్యంలో ఉన్న తేడా ఒక్కటే. యుద్ధకాలంలో నీశత్రువుని ద్వేషిస్తావు. శాంతిసమయంలో నీమిత్రుల్ని ద్వేషిస్తావు.

చట్టం : శాసనం

అంగర సూర్యారావు

(స్థలం ఆంధ్రదేశంలోని అనంత రాజకీయ పక్షాలలో ఒక ప్రముఖ పార్టీ కార్యాలయం. సమయం రాత్రి ఎనిమిది గంటలు. ఎలక్ట్రిక్ లైట్లు, సీలింగ్ ఫాన్, కుర్చీలు, టేబిలు, ఒక రేడియో సెట్ వగైరా కాఫీ హోటలుకు వుండవలసిన లక్షణాలన్నీ ఆహాలుకు వున్నై. సన్యాసి చుట్టకాలుస్తూ ఒక కుర్చీలో కూర్చుని దినపత్రిక చూస్తున్నాడు. సన్యాసి అంటే వైరాగి అనికాదు అర్థం. జిల్లా నాయకుడు. ఒక క్షణం గడిచింది. అధ్యక్షుడు తొందరగా ప్రవేశిస్తాడు. ఆ వెనుక కార్యదర్శి వస్తాడు. ఇద్దరి బట్టలూ చిందర వందరగా కోడ్డు మట్టితో నిండివున్నై.)

అధ్యక్షుడు: (కోపంతో) మోసం! ద్రోహం! దగా! యీ పట్నం రప్పించి నాకు చేయించిన మర్యాద యిదా? ఉత్తర హిందూస్థానం అంతా నా ఉపన్యాసం అంటే పడి చచ్చిపోతుంది! లక్షలకొద్దీ ప్రజలు హాజరయిన మహాసభలలో ఉపన్యాసాలిచ్చాను కాని నాకెవరూ యిటువంటి మర్యాద చెయ్యలేదు. ఈ జిల్లావాళ్ళకు తిండి లేకపోయినా పొగరు తగ్గలేదు.

సన్యాసి: అధ్యక్షులు తమరు కొంచెం శాంతించి జరిగిన విషయం మెల్లిగా సెలవిస్తారా?

అ: (సన్యాసిని చూచి) ఓహో సన్యాసీ! నువ్విక్కడే వున్నావటయ్యా? నీ వూరివాళ్లు నాకు చేసిన మర్యాద యేమిటో చూశావ్?

స: చిత్తం. అదే సెలవివ్వమని తమర్ని కోరేది?

అ: సెలవివ్వాలట! సెలవు! అతివినయం మూర్ఖలక్షణంఅన్నారు. అందితే జుట్టు. అందక పోతే కాళ్ళు. సిసింద్రీలలా పైకి కనబడరు, బహిరంగా సభలలో మాత్రం చెప్పులు విసురుతారు.

కార్యదర్శి: (ఏదో కొత్తవిషయం కనిపెట్టిన వాడిలా) ఈ పట్నంలో జోళ్ళషాపులు ఎక్కువగా కనిపిస్తున్నై. అధమం కొన్నిటినైనా బహిష్కరిస్తే బాగుండును.

స: చిత్తం! ఈ విషయం కూడా మన అంతరంగిక సభలో చర్చకు తేవాలనుకుంటున్నాను. తిండి, బట్టా కరువు వున్న ప్రజలకు జోళ్ళు ఎక్కువగా సప్లయిఅయితే ప్రమాదం వుందన్న సంగతి నేను యిదివరకే తెలుసుకున్నాను— కాని తమలాంటి పెద్దలు, అఖిలభారత నాయకులు వచ్చి ఉపన్యాసం యిస్తే శాంతంగా విని రేపటి ఎలక్షన్లలో మనకే వోట్లు వేస్తారన్న ఆశతో మిమ్మల్ని పిలిపించాం. కాని,

కా: (మధ్యలో అందుకొని) రేపటి ఎలక్షన్ల వరకూ వుండలేక యీ ప్రజలు మాకే ఓట్లు వేశారు (బట్టలు దులుపుకుంటాడు.)

అ: వాడెవడో కుగ్రవెధవ! వాడికెంత ధైర్యం! ప్రజల సొమ్ము ఎంత తిన్నావని నన్ను ప్రశ్న వేస్తాడా? సమాధానం వినకండా చెప్పు విసురుతాడా? వెనకాల వున్న జనం అంతా వెంటనే గోలచేసి జోళ్ళు, సిగరెట్ పేకలు, గోడ్డుమన్ను మా నెత్తిన వేస్తారా? ఈ ప్రజలు శాసనధిక్కారం చేస్తారా?

కా: ప్రజలకు శాసన ధిక్కారం మనం నేర్పిన విద్య అన్నమాట మనం మరిచిపోగూడదు.

అ: పరాయి ప్రభుత్వపు రోజుల్లో శాసనాన్ని ధిక్కరిస్తే సాగుతుంది కాని స్వతంత్ర భారతంలో ఎంతమాత్రం సాగదని ఋజువు చేస్తాను. (కార్యదర్శితో) సెక్రెటరీ! ఫైనాన్సు డిపార్టుమెంటుకు ఒక నోట్ రాయి: రేపటి బడ్జెట్లో "లా అండ్ ఆర్డర్"కు పది లక్షలు అదనంగా కేటాయించమనీ, జోళ్ళ పరిశ్రమ మీద కొత్తపన్ను విధించమనీ.

కా: చిత్తం! రేపటి టపాలో పంపిస్తాను.

స: ఆర్యా! తమరు కొంచెం శాంతించి నేను చెప్పేమాట వినండి. ప్రజలలో విద్యావిహీనులు అధికంగా వున్నారు. రోజురోజుకూ అనాగరికత బలిసిపోతూ వుంది. ఎటువంటి వారితో ఎలా ప్రవర్తించుకోవాలో వాళ్ళకు అర్థం కావడంలేదు. అందుకు ఇవాళటి సంఘటనే నిదర్శనం. (ఉపన్యాస ధోరణిలో) కనక ప్రజలలో విద్యా,విజ్ఞానం,నాగరికతా, పెంపొందే వరకూ ఎలక్షన్లను గడువు లేకుండా వాయిదా వెయ్యమని నా మనవి. నేనీవారంలో జరిపిన పర్యటనలో పోలీసువాన్ వెనుక లేకుండా ఒక ఉపన్యాసం కూడా యివ్వలేక పోయానని తమకు మనవి చెయ్యడానికి మిక్కిలి చింతిస్తున్నాను. మీరనుమిక్కిలి పోలీసు వాళ్ళున్నా ప్రజల ఆగ్రహం కొంచెం తగ్గడం లేదు. వాళ్ళకు వాళ్ళ ప్రాణాల విలువ తెలియడం లేదు. తిండి లేక చస్తేనంటే తుపాకీగుళ్లకు బలిఅయి చస్తామంటున్నారు. మీవంటి మహానాయకులను చూసి శాంతించడానికి బదులు రెచ్చిపోతున్నారు కనక యిన్ని కారణాలవల్ల ఎలక్షన్లను గడువు లేకుండా వాయిదా వెయ్యమని కోరుతూ నేను విరమిస్తున్నాను.

కా: నేనీ ప్రతిపాదనను బలపరుస్తున్నాను.

అ: ఇది ఆలోచించవలసిన విషయమే! కాని ప్రస్తుతపు విషయం ఆలోచించండి. యీ పూట సభలో ప్రజలు మనమీద తిరగబడ్డారని తెలిస్తే యిక్కడ మనకు పలుకుబడిలేదని ఎవరైనా అనుకోవచ్చు. ఆ అపాయం రాకుండా ఉపాయం వెదకండి.

కా: చిత్తం. ఈ విషయం నేను ముందే పత్రికలకు స్టేటుమెంటు యిచ్చాను. తమకు చదివి వినిపిస్తాను. "ఈ పట్టణపు బహిరంగ సభలో జరిగిన అల్లరి కేవలం ప్రతిపక్షపు రౌడీల కుట్రల ఫలితమే!"

(ఇంతలో ఒక యువకుడు లోపలికివస్తాడు. అధ్యక్షుడికి నమస్కారంచేసి వాళ్ళఅను మతి లేకుండానే కుర్చీలో కూర్చుంటాడు.)

యు: నన్ను నేనే పరిచయం చేసుకోవలసి వచ్చినందుకు విచారిస్తున్నాను. నేను ఆన్ ఎంప్లాయీస్ ఎసోసియేషన్ సెక్రటరీని. అనగా నూతనాంధ్ర నిరుద్యోగి సమితి కార్యదర్శిని. ఇవేళ జరిగిన బహిరంగసభలో తమకు సన్మాన పత్రం సమర్పిద్దాం అనుకున్నాను. సభలో గల్లంతు జరిగిన కారణంవల్ల సమర్పించ లేక పోయాను.

అ: (అనుమానంగా) ఆ అల్లరిలో నువ్వు కూడా పాల్గొన్నావా?

యు: సభలో పాల్గొన్నాను కాని గల్లంతులో పాల్గోలేదు. ఇక నేను అమూల్యమైన కాలాన్ని వ్యర్థపరచక నేను చదివే సన్మాన పత్రాన్ని శ్రద్ధగా వినండి. (జేబులోంచి సైక్లోస్టయిల్ పేపరు తీసి చదవడం ప్రారంభిస్తాడు) అధ్యక్ష మహాశయా!

తమ ఆగమన వార్త వినగానే మా పట్నం ఉద్రేకపూరితమైనది. మహా కష్ట సుఖములను తమకు మనవి చేసుకొనుటకు మాకు అవకాశమును కల్పించిన ఎలక్షన్లకు మా అభివాదనములు. మేము అనగా నూతనాంధ్ర నిరుద్యోగులం తమకు మనవి చేసుకునేది ఏమనగా:

మాకు చేసుకొనుటకు ఉద్యోగములేక, తినుటకు తిండిలేక, కొనుటకు డబ్బులేక, కొల్లుటకు నిగ్గలులేక మేము నానా యిబ్బందిపడుచున్నాము. ఈ పరిస్థితులే మరి కొంతకాలము సాగినచో మేము పుంఖానుపుంఖములుగా దొంగలగానో, గూండా గాంగులగానో, మీకు ప్రమాదకర్మ ప్రతికక్షులైన కమ్యూనిస్టులు గానో మారిపోయేటి ప్రమాదము కలదని తమకు సూచించుచున్నాము.

అ: (మధ్యలో అందుకొని) ఏమిటోయ్! మీరు నన్ను హెచ్చరిస్తున్నారా? బాగానే వుందే వేషం!

యు: తమరు పూర్తిగా విని అప్పుడు విమర్శించండి.

అ: వినడానికేంగాని అబ్బాయి! నీ ముఖంలో ఉత్సాహం మాస్తూవుంటే నాకు ముద్దొస్తూ వస్తోంది. ప్రస్తుతం మీకందరికీ ఉద్యోగాలు లేవనేకదా మీగోడవ. తక్షణం నిన్ను నా ఆనరరీ సెక్రెటరీగా వేసుకుంటున్నాను. మిగతా నీ స్నేహితుల విషయం త్వరంలో ఆలోచిస్తాను. నీలాంటి యువకుడి కోసం నేను చాలాకాలంనుంచి వెతుకుతు

వ్వాను. మేమంతా పెద్దవాళ్ళం ఐపోయాం. మాకు ఓట్ల ప్రమాణం రానురాను తక్కువై పోయింది. జాగ్రత్తగా ఆలోచించి మేము రాకుండా వ్యవహారం నడపడానికి నీలాంటి యువకుడొకడు కావాలి. నువ్వీ ఉద్యోగానికి యిష్టపడతావా?

యు: (ఉత్సాహంతో) ఓ! తప్పకుండా!

అ: ఎలక్షను దగ్గరకు వస్తున్నాయి. మన ఉపన్యాసాలు ప్రజలు వింటే చాలు, మనకు వోట్లు వేస్తారనే నమ్మకం [illegible] ఉంది. కాని యిప్పుడు వచ్చిన కొత్త ప్రమాదమేమిటంటే ప్రజలు మన ఉపన్యాసాలు వినకుండా మనల్ని చూడగానే మనమీద విరుచుకుపడుతున్నారు. ఈ అపాయం రాని ఉపాయం [illegible] నువ్వు చెప్పగలవా?

యు: ([illegible]) దానికి పెద్ద ఆలోచించవలసిన అవసరం లేదండి. మనం [illegible] నడుచుకోవాలి. ఈ సినిమా యుగంలో ప్రజలకు నృత్యాలంటే ఎక్కువ యిష్టం. ఎలక్షను ప్రచారానికి [illegible] ప్రత్యేకించబడివుంది. అంతేగాక [illegible] ఆహ్వానించారంటే రాని వ్యక్తులు [illegible] "ఉపన్యాసానంతరం ఆహార్య నృత్యప్రదర్శన" అని పేపర్లు పంచిపెట్టే వేలకొద్ది జనం వస్తారు. మనం బల్లకొద్ది ఉపన్యాసాలు యిస్తామ్మా. ప్రతి [illegible] ప్రజలు నిశ్శబ్దంగా మన ఉపన్యాసాలు వింటారు. అల్లరి జరిగితే నృత్యప్రదర్శన పోతుందనే భయంతో జనం అల్లరిచేసే వాళ్ళనుకూడా అల్లరి చెయ్యనివ్వరు. ([illegible] వినిపిస్తుంది. కార్యదర్శి [illegible] "సెబాష్! గొప్ప [illegible]!" అని ప్రశంసిస్తాడు.)

అ: మంచి ఉపాయం చెప్పావోయ్! [illegible] నేటి మన ఎలక్షను ప్రచారానికి కొత్త పద్ధతులు ఆలోచించాలి.

యు: చిత్తం! ఆ కొత్త పద్ధతులు కూడా తర్వాత నేను చెప్తాను. ప్రస్తుతం మచ్చుకు ఒకటి చెబుతాను. ఈ పూరి కవులచేత సినిమా పాటల వరసల్లో రాజకీయపు పాటలు రాయించాలి. పాటలు పాడి ప్రచారంచేసే దళాన్ని తయారుచెయ్యాలి.

(ఇంతలో బయట పెద్ద అల్లరి వినిపిస్తుంది.)

అ: (కార్యదర్శితో) ఆదేమిటో చూసిరావోయ్!

(కార్యదర్శి బయటకు వెళ్ళి [illegible] తిరిగి వస్తాడు.)

కా: ఎన్. జీ. ఓలు తమర్ని కలుసుకోడానికి వచ్చారు.

అ: ఎన్. జీ. ఓ. లంటే ఇన్స్యూరెన్సు ఏజంట్లు కాదుగదా?

[illegible]

చిన్న చిన్న [illegible].

అ: ఎందుకు వచ్చారు?

కా: వాళ్ళకు జీతాలు చాలడంలేదట. చినిగిన గుడ్డలతో దిగులు ముఖాలతో జ్వరంపడి లేచినవాళ్ళలా వున్నారు. మీతో మాట్లాడాలంటున్నారు.

అ: (కోపంతో) వీల్లేదని చెప్పు! ఇదేమీ ఎలక్షను సమస్య కాదు. ప్రస్తుతం మేం ఎలక్షన్ల గురించి ఆలోచిస్తున్నామని చెప్పు. ఎలక్షన్ల అనంతరం వాళ్ళవిషయం ఆలోచిస్తామని చెప్పు.

కా: నేను చెప్పిచూశానండీ. ఏమైనాసరే జీతాలు పెంచకపోతే సమ్మెచేస్తామంటున్నారండీ.

అ: సమ్మె! ప్రతి గాడ్దెకొడుక్కీ ఇదో అలవాటు అయిపోయింది. సమ్మెలు సమ్మెచేస్తారని మనం ఎప్పుడూ భయపడనక్కరలేదు. దేశంలో కావలసినంత మంది నిరుద్యోగులు వున్నారు. ఇంగ్లాండు నుంచి, జపాను నుంచి, పాకిస్తాన్ నుంచి [illegible] అవుతున్నారు. వీళ్ళు సమ్మెచేసిన తక్షణం వాళ్ళను ఉద్యోగాలలో నియమిస్తామని చెప్పు. కావలిస్తే సమ్మె చేసుకోమని చెప్పు. (యువకునివైపు చూస్తూ) ఏమంటావోయ్ నువ్వు! ([illegible] స్ఫురణకు వచ్చినట్లు) ఓహో! ఈ విషయం నేను మరిచిపోయాను. ఈ [illegible] సమ్మెచేసిన వెంటనే మీ నిరుద్యోగు లందరికీ ఉద్యోగా లిప్పించగలనని హామీ ఇస్తున్నాను.

యు: సంతోషం! కాని మావాళ్లు క్లెక్ లెస్సగా పనిచేస్తారని నాకు నమ్మకంలేదు.

(కార్యదర్శి బయటకు వెళ్ళివచ్చి)

కా: వాళ్ళంతా దిక్కు మొహాలతో వెళ్ళి పోయారండీ. స్పెషల్ బ్రాంచి పోలీసు ఇన్స్

హైనదేవని వెంకట్రావు గ్రహించాడు. దిన దినం తానెంత అలంకరించుకొని అందంగా కనిపించడానికి ప్రయత్నిస్తున్నా తన కళాలంలో ప్రాప్తించిన భార్యావియోగ కారణంగా తనకు తెలియని వృద్ధాప్యం కమలకు కనిపించి వుంటుంది. లేక ఆమె శీలసంరక్షణకు పాటుపడే కవచమై రాణించగలదేమో? అను ఉపాయ తాను గాయుట! వెంకట్రావు హృదయంలో ఆనాటింటూనాడు చర్చిలో మ్రోగే గంటలాగ "శాంతి" పుట్టు ఆ శోజల్లా వినిపించసాగింది. నిప్రవస్తుక ఆ ఉదయం దృశ్యమే కమలయొక్క సాక్షాత్కరించింది. ఎన్నడూ తన ఎదుటికి రాని కమల తాతున్న తీసికెళ్ళడానికొచ్చి, ఏదో ఒక చేతి బాంబు విసిరినట్లుగా తనను గాభరా చేసింది. ఏ కారణం వల్ల ఆమెకలా తోచిందో అతని మనసుకు తట్టక ఆలోచన పలువిధాల పోయింది. ఆలోచన ప్రవాహం నంటిది! ఆ ప్రవాహం పృథగ్విధ మార్గాలు పట్టడం సహజం. కమల భర్త గతించి పుట్టింటికి చేరి తరువాత గాను ఆమె సౌందర్యానికి మోహితుడై ఆమెను ప్రేమించి, ఆమెకోసం వెంపర్లాడేవాడు. కానీ ఆమె స్నేహంకోసం ఏలా పడి కల్పించుకుని వాళ్ళ యింట్లోకి పోయి ప్రవేశించలేడు! ప్రతి మాసమూ ఒకటవ తేదీ రాగానే, తానివ్వ వలసిన అద్దె కాలాకు డబ్బు తీసికెళ్ళి ఆమె తండ్రిని పిలిచి యిచ్చి రావడమే, అంతకంటే ఏమీ ప్రమేయం ఆ కుటుంబంతో పెట్టుకోనక పోవడమే తన లోపమా? విదేశాలలో స్త్రీ పురుషుల కున్న సౌకర్యాలు ఈ దేశంలో లేక పోగా ఒకరినొకరు అర్థం చేసుకోడానికి కూడా ప్రయత్నించరు. పురుషులు తమ కీర్తి మర్యాదల్ని లెక్క చేయకుండా అబలలు, పతివ్రతలు అని కీర్తి గడించిన స్త్రీల ప్రణయంకోసం పాటుపడుతూండడం సర్వసామాన్య విషయం ఈ దేశంలో. అంతేకాని విదేశాలలోవలె స్త్రీలీదేశంలో స్వేచ్ఛతో పురుషుల్ని ప్రేమించడం మానసికంగా కూడ తప్పు తేయువిధం గాదు. అందువల్ల సౌందర్యవతియగు కమల తనను వెంకట్రావు నిర్లక్ష్యంగా చూస్తున్నాడనుకొన్నదేమోనని వెంకట్రావుకు అనుమానం కూడా కలిగింది! ప్రజలలో చాలామందివలె అతనికి సాహసం తక్కువ. కీర్తి ప్రతిష్ఠలు భంగమవుతాయేమోనన్న భయమెక్కువ.

ఆ ఉదయం కమల కుమార్తెకు తలంటిపోసి తల దువ్వి, సిల్కు గౌనుతొడిగి, పౌడరద్ది, చంకనెత్తుకుని వెంకట్రావు గదిలోకొచ్చి, "ఇదిగో మీ మనమరాలు!" అన్నది సూటిగా.

వెంకట్రావు "ఉషా సుందరీ! రా, రా, రా" అని పిలిచాడు ఉషని, కమలని పలకరిస్తూ.

"మీ వద్ద తెలుగు నవలలేమైనా ఉన్నాయండీ?" అన్నది కమల.

"ఆఁ, నా గ్రంథాలయంలో వుండి. ఇమ్మంటారా?" అని లేచి అలమారులోనుండి ఆ పుస్తకం తీసి వారి కమల చేతి కిచ్చాడు, ఆమె శరీరకాంతి కన్ను మిరుమిట్లు గొలుపుతూండగా.

కమల ఆ పుస్తకాన్ని తీసుకొని ఇంట్లోకి వెళ్ళిపోయింది. ఉష వెంకట్రావు దగ్గరికి వచ్చి, ఒక బొమ్మల పుస్తకంమీద వేలు పెట్టి "తాతా! బొమ్మ" అన్నది. అంటే అందులో బొమ్మలు చూపించమని ఆ అమ్మాయి ఉద్దేశ్యం. వెంకట్రావు ఆ పిల్లకు బొమ్మలు చూపిస్తూ ముద్దు పెట్టుకుని, ఆ బొమ్మల్ని చూచి ఆ బాలిక పొందే ఆనందాన్ని గమనించసాగాడు.

ఇంతలో అతని మిత్రుడు పద్మనాభం వచ్చాడు.

"ఏం వెంకట్రావ్! ఈ అమ్మాయి ఎవరు? నీ కూతురా?" అని ప్రశ్నించాడు.

పద్మనాభానికి వెంకట్రావు ఏకాంత జీవితం గూర్చి తెలిసే అలా అడిగాడు.

"ఆ, నా పెంపుడు కూతురు." అన్నాడు వెంకట్రావు.

"అంటే...?" అని సాగదీశాడు పద్మనాభం.

"అంటే ఏమీ లేదు. నా పెంపుడు కూతురే" అన్నాడు వెంకట్రావు.

"మరి పిల్లను నువ్వే పెంచుతున్నావా? నిజం చెప్పవోయ్ ప్రభూ!" అన్నాడు పద్మనాభం.

"ఈ అమ్మాయి ఈ యింటి యజమాని గారి మనమరాలు!" అన్నాడు వెంకట్రావు.

"అంటే కమల కూతురా? కమలకు భర్త గతించాడుకదూ?" అన్నాడు పద్మనాభం.

"అవును. ఆ విషయం తెలిసికూడా నన్ను

ప్రశ్నించడంలో నీ ఉద్దేశ్యమేమిటి?" అన్నాడు వెంకట్రావు కొంచెం ఉద్రేకంగా.

"ఆఁ. ఏం లేదు. వాసుదేవరావు ఏమన్నాడో తెలుసునా? ఇంటివారమ్మాయికి భర్త గతించడంవల్ల వెంకట్రావు సమస్య పరిష్కారమైంది అన్నాడు."

"వాడు పరమనీచుడు! నీవు వాడిమాటను నమ్మితే, నీవీ నాటినుంచి నావద్దకు రానవసరంలేదు." అన్నాడు వెంకట్రావు.

పద్మనాభానికి కోపం వచ్చింది. వెళ్ళడానికి లేచి నిలబడి "ఉన్నమాటంటే ఎవడికైనా ఉక్రోషమే. నీ యింటికి రాకపోతే నాకు జరగదనా నీ ఉద్దేశ్యం? ఊళ్ళో నిన్ను గూర్చి ఏం చెప్పుకుంటున్నారో నీకు తెలిసి కూడా తెలియనట్లుగా నటిస్తున్నావు. నీ వదృష్టవంతుడివి. సెలవు" అని వీథిలోకి వెళ్ళాడు.

వెంకట్రావుకూడా వెంట వెళ్ళి "పద్మనాభం! నీ వింత ఫూల్ వనుకోలేదు. ఆ వాసుదేవరావు, ఒక్కడే ఫూల్ అనుకున్నాను!" అన్నాడు.

పద్మనాభం "షటప్ యూ స్కౌండ్రెల్" అన్నాడు రోడ్డుమీద నిలబడి. వెంకట్రావు కూడా రోడ్డుమీదకి వస్తాడనుకున్నాడు పద్మనాభం. తన ప్రతిష్ఠకు భంగపరచేటందుకిదొక ప్లానని వెంకట్రావుకు అనుమానం స్ఫురించి వెంటనే తలుపులుమూసి, గడియ వేసుకున్నాడు. కాని పద్మనాభం వీధిలోనుంచి పిచ్చిపిచ్చి మాటలేవో మాట్లాడుతుండగా ఆ యింటి యజమాని సుబ్బరామయ్య యింటికి వచ్చాడు. పద్మనాభం మాట్లాడిన మాటలు కొన్నిమాత్రం విని లోనికి వెళ్లాడు. ఆయన దూరంనుంచి చూచాడు వెంకట్రావు వాకిట్లో నిలబడి పద్మనాభాన్ని ఏదో అనడం.

ఓ పదినిముషాలయిన పిమ్మట సుబ్బరామయ్య వెంకట్రావువద్దకు వచ్చాడు. తన మనుమరాలు ఉష వెంకట్రావువద్దగ కూర్చొని వుండడం చూచాడు.

"ఏమండీ! ఎవరతను వీథిలో నిలబడి మీ మీద కారాలు మిరియాలు నూరుతున్నాడు?" అని ప్రశ్నించాడు.

"వాడో అమాయకుడు. ప్రతి ఒకడూ నావద్దకువచ్చి యీ ఫొటోలు చూచి, అజ్ఞానంతో యీ ఫొటోలు బాగుండలేదనీ, నా కేమీ తెలియదనీ అనటం, నే నేమో అనేసరికి వాళ్లకు కోపంరావటం, ఇది నిత్యకృత్యమైంది. తమ కర్థం కానివన్నీ బాగుండనివన్నీ వీళ్ళ అభిప్రాయం. అసలు వీళ్ళని ఎవ డాహ్వానించాడు నావద్దనున్న ఫొటోలు చూడమనీ, వీటినిగూర్చి తమ అభిప్రాయమిమ్మనీ? అంతకుమించి ఏమీ లేదు." అన్నాడు వెంకట్రావు తెలివిగా. సుబ్బరామయ్య ఆ మాటలకు తృప్తిపడి మనుమరాలిని ఎత్తుకుని లోపలికి తీసుక వెళ్ళాడు.

* * *

వాసుదేవరావు తన కసి తీర్చుకోవడమునకు అవకాశం దొరికినట్లుగా సంతోషించాడు. పద్మనాభం చెప్పిన మాటలు విని. ఇక ఇరువురూ క్లబ్బులో వెంకట్రావుమీద ద్వేషమున్న సభ్యులందరికీ వెంకట్రావు గూర్చి అవినీతికరంగా ప్రచారం చేయ నారంభించారు. అంతే కాదు, అతన్ని సుబ్బరామయ్య ఇంట్లోనుంచి కాళీ చేయించడానికి వలసిన మార్గాలన్వేషించ నారంభించారు. అందుకోసం ఇద్దరూ ఆ గ్రామంలో సుబ్బరామయ్య చుట్టంవద్దకు పోయారు.

"మీ సుబ్బరామయ్యకు మతిపోయినట్లుంది. శీలాన్ని విడిచిపెట్టినవాడికి ఇల్లు అద్దెకిచ్చాడు. భర్త గతించిన కూతుర్ని పుట్టింటికి తీసుక వచ్చాడు. ఆ వెంకట్రావు ఆ కమల కూతుర్ని తన పెంపుడుకూతురుగని యీ పద్మనాభంతో అన్నాడుట! మీ బంధువులేగా సుబ్బరామయ్య? ఆ వెంకట్రావును ఆ యింట్లోనుంచి తరిమే యించాలండీ!" అన్నాడు వాసుదేవరావు.

ఇక పద్మనాభం తను స్వయంగా చూచానని కొన్ని సంగతులు కల్పించి మాట్లాడాడు. ఈ సంగతులు రెండురోజుల అనంతరం సుబ్బరామయ్య చెవినిపడ్డాయి. సుబ్బరామయ్యకు వెంకట్రావు చాలా మంచివాడని అభిప్రాయముంది! కాని యీ ప్రచారం విన్నతరవాత అతనికి మనసులో ఆందోళన కలుగ నారంభించింది. ఆయన ఇంట్లో కమల చదువుతున్న

"నారాయణరావు" నవలను చూచాడు. దాని మీద వెంకట్రావు పేరుంది.

సుబ్బరామయ్య కూతురివద్దనున్న నవల తీసికొని "కమలా! ఈ నవల నీవద్దకెలావచ్చింది?" అని ప్రశ్నించాడు. కమల సమాధానం చెప్పడానికి ఖంగారుపడింది.

"చదువుకోడానికి ఏదైనా పుస్తకం ఇమ్మనమని పనిమనిషిని పంపితే మన యింట్లో అద్దెకున్న వెంకట్రావుగారీ నవల యిచ్చి పంపారు. ఈ నవల చాల బాగున్నది నాన్నగారూ!" అన్నది కమల.

"ఈ వెంకట్రావు చాలా మంచివాడనుకున్నాను. ఇతని ప్రవర్తనగురించి నాకు చాలా రిపోర్టులు వచ్చినయి. ఉష ప్రొద్దు కూకులూ అతని గదిలో కూచోటం నాకేమీ బాగాలేదు. నీవు నీకూతుర్ని దగ్గరఉంచుకుని ఆడించలేవూ? నీకంత బద్ధకమయితే యెట్లా? లోకులు పలుగాకులు! వాళ్ళు ప్రతి విషయాన్నీ శంకించి అపార్థాన్ని కల్పిస్తారు. ఈ వెంకట్రావుని యిల్లు కాళీచేయమని చెబుదామనుకుంటున్నాను." అన్నాడు సుబ్బరామయ్య.

"ఆయనేం చేశాడ? ఆయనకు ఒకరి జోలీ జొక్యమూ లేను." అన్నది వరలక్ష్మమ్మ భర్తతో. కాని సుబ్బరామయ్య తన ఆందోళన తన భార్య గ్రహించలేదని తెలుసుకున్నాడు. వెంకట్రావు వద్దకు వెళ్ళి "వెంకట్రావుగారూ, మీ రయిదేళ్ళనుంచీ మా ఇంట్లో అద్దెకుంటున్నారు. మనం ఇన్నాళ్ళూ చాలా స్నేహంగా వున్నాము. మాకు యిల్లు చాలటంలేదు. అందుచేత మీరు మాయందు దయయుంచి యిల్లు కాళీచేయవలసిందని కోరుతున్నాను. మా అమ్మాయి తాలూకు సామాను కొంత వుంది, అది పడెయ్యడానికి మీరున్న భాగం కావాలి." అన్నాడు సుబ్బరామయ్య.

"అలాగే! నెలాఖరుకు కాళీ చేస్తాను లెండి. ఈలోపుగా మరో యిల్లు కుదుర్చుకుంటాను. ఈవూళ్ళో ఇండ్లు దొరకడం చాలా కష్టంగావుంది. అయినా, మీరిబ్బంది పడుతున్నారని వినడానికి నాకు కష్టంగా వుంది. తప్పకుండా ఇంకో పదిరోజులకి కాళీ చేస్తాను." అన్నాడు వెంకట్రావు.

సుబ్బరామయ్య కుమార్తెతో గట్టిగా చెప్పాడు, ఉషని వెంకట్రావు వద్దకు పోనీయవద్దని. కాని ఆ చిన్నపిల్ల బాగా అలవాటుపడింది. అలవాటు మాన్పించడ మెవరికి సాధ్యమాతుంది? కమల ఎన్నివిధాల ప్రయత్నించినా ఉష తల్లివద్ద వుండటంలేదు. ఇట్టే రోజులు తిరిగిపోయినయి. వెంకట్రావు ఇంకోచోట ఇల్లు కుదుర్చుకుని, తన సామానంతా బండిలో వేసి తీసుకవెళ్తూంటే ఉష ఒకటే ఏడుపు ప్రారంభించింది. కమలకు కూడా మనసులో విచారం కలిగింది. సామానంతా బండిలో ఎక్కించి. ఒకసారి ఏడుస్తున్న ఉషను ఎత్తుకుని "మీ తాతయ్యను మరిచిపోకు! ఇదిగో చాకలెట్లు." అని ఒక చాకలెట్ల పొట్లం ఆమెచేతికందించి ముద్దెట్టుకున్నాడు. ఆ మాటలు విని, ఆ చాకలెట్ల పొట్లం చూచిన కమల, వరలక్ష్మమ్మ "దానికెందుకు లెండి. చాకలెట్లు పెడితే జబ్బుచేస్తుందన్నారు డాక్టరు గారు." అన్నారు. ఆ సమయంలో సుబ్బరామయ్య ఇంటివద్ద లేడు. వెంకట్రావు "ఫరవాలేదు. చాకలెట్లు జబ్బుచేసేవికావు. నా విరోధులు కొంతమంది నామీద విషప్రచారం ప్రారంభించి నన్ను మీ యింట్లోనుంచి కాళీ చేయించారు. ఇక్కడనుంచి పోవడమంటే నాకు చాలా విచారంగా వుంది. అంతలో మీఉషని విడిచిపోవడానికి నాకు బాధగా వుంది. ఐనా తప్పదు." అన్నాడు గాద్గదికంగా.

వెంకట్రావు సామాను బండిలో నడిచిపోతూంటే ఉష తల్లి చంకలో కూర్చొని "తాత, తాత!" అంటూ ఘోషించ సాగింది. కమల పిల్లని యింట్లోకి తీసుకవెళ్ళి చాకలెట్ల పొట్లమూడదీసి ఉషకు చాకలెట్లు పెట్టి సముదాయించడానికి ప్రయత్నించింది. కాని ఉష వెంకట్రావు వున్న ఇంట్లోకి పోయి, బావురుమంటూన్న యిల్లు చూచి దుఃఖించ సాగింది. ఇలా ప్రతిదినం అలవాటు ప్రకారం ఉష ఆ యింట్లోకి పోవడం మానలేదు.

* * *

వెంకట్రావు కొత్త అద్దెయింట్లో ప్రవేశించి పదిహేనుదినాలయింది. మొదటి రెండు రోజులు కమల, ఆమెకుమార్తె ఉష, జ్ఞప్తికి

వచ్చినప్పుడల్లా అతని గుండె బరువెక్కి బాధ పడేది. కాని ఎంతబాధనైనా గతానుభవాన్ని స్మరించుకొని అతను వేదనను భరించటాని కల వాటుపడినవాడవటంవలన మనసు మార్చుకోటానికి తరుచు సినిమా చూడసాగాడు. సినిమాలలో చిన్నపిల్లలు కనిపిస్తే అతనికి ఉష జ్ఞప్తికి వచ్చేది. ఆ పదిహేను రోజులలో పది సినిమాలకు వెళ్ళాడు. ఏ సినిమాకైనా కమల ఉషతో కూడా వస్తే ఒకసారి ఆయిద్దర్నీ చూడ్డామని కూడా అతనికి ఆలోచన కలిగింది. కాని అతను తను వదిలివచ్చిన యింటివైపుకు మరల పోలేదు. వెళ్ళాలనికోర్కె కలిగినా నిగ్రహించాడు.

ఒకటి రెండుసార్లు సుబ్బరామయ్య బజారులో కనిపించాడు కాని అతనాయనను చూచి దూరంగా తొలిగిపోయాడు.

పదిహేను దినాల తరవాత ఒకనాడు సుబ్బరామయ్య కంగారుగా వెంకట్రావింటికి వచ్చి "ఏమండి, వెంకట్రావుగారూ, మా ఉషకు చాలా జబ్బుచేసింది. మీకోసం దిగులు పెట్టుకుందని మా వాళ్ళంటున్నారు. తాత, తాతని కలవరించడం, నేనూ తాతనే కదా అని దగ్గరికిపోతే, నన్ను చూడక ఏడుస్తున్నది. మీరొకసారి వచ్చి ఉషని చూచి పోవాలి. మీ పుస్తకం "నారాయణరావు" కూడా మా యింట్లోనే వుంది. అది తీసుకుందురుగాని, ఒకసారి నా వెంట రావాలి." అన్నాడు.

వెంకట్రావొక నిముషం ఆలోచించి "చిన్న పిల్ల! నేకూడా ఆ పిల్ల నన్ను గూర్చి దిగులు పెట్టుకుంటుందేమో నని మనసులో భయపడ్డాను. నిజంగా అలాగే జరిగింది. పదండి పోదాం!" అని చొక్కా తగిలించి సుబ్బరామయ్య వెంట బయల్దేరాడు. ఉష చిక్కిపోయి మంచాన అంటుకొని వుంది. కమల కూడా కూతురి జబ్బువల్ల ఆందోళనతో చాలా నీరసంగా కన్పిస్తోంది. వెంకట్రావుని చూడగానే ఆమె మంచంలోనుంచి లేచి వెళ్ళి దూరంగా నిలబడింది. వెంకట్రావు మంచంలో కూర్చొని-"ఉషా సుందరీ! ఇటు చూడు. నేను వచ్చాను. నీకు చాకలెట్లు-బొమ్మలు తెచ్చాను" అన్నాడు ఆమె ఒంటిమీద చేయివేసి.

ఉష నీరసంగా కళ్లు విప్పి వెంకట్రావుని చూచి ఒక చిన్న చిరునవ్వు నవ్వింది. తన బుల్లి చేయితో అతని చొక్కా పట్టుకుంది. అతను ఉషని లేవదీసి ఎత్తుకుని "నా కోసం దిగులు పెట్టుకున్నావా, పిచ్చిపిల్లా! ఈ ప్రపంచంలో నే నందరికీ అయిష్టుణ్ణే కాని - నీ కొక్కర్తెకూ నా మీద యింత ప్రేమ వుందా తల్లీ! నీకు జ్వరం నయమవుతుంది. నే రోజూ రెండుపూటలా వచ్చి నీవద్ద కూచుంటాను. నీవేం దిగులు పడకు. చూడు, మీ అమ్మ నీకోసం బెంగ పెట్టుకుని ఎలా అయిపోయిందో! ఏం కమలా? నీ ఆరోగ్యం కూడా సరిగా లేదల్లే వుంది!" అన్నాడు. ఎంతో కాలానికి అతను కమలతో ధైర్యంగా మాట్లాడగలిగాడు.

"అవునండీ! నా పంచప్రాణాలు నా ఉషా సుందరి. దానిని మీదానినిగా చేసుకుని ఇల్లు ఖాళీచేసి పోయారు. మీరు వెళ్ళింది మొదలు అది ఎన్నిసార్లు మీ గదిలోకి వెళ్ళి మిమ్మల్ని వెతికిందో నే చెప్పలేను. రోజూవచ్చి కాసేపు దానినాడించి మళ్ళీ నా కూతుర్ని బ్రతికించండి. మీ మేలు మేము మరచిపోము" అన్నది కమల కంటి కొలకులనుండి కన్నీరు కారుస్తూ.

"ఉష నా పెంపుడు కుమార్తె అని నే ననుకున్నాను. నిజం కూడా అంతే. దానికి నా సర్వస్వం ఇచ్చేద్దామని నిశ్చయించుకున్నాను. నేనా పిల్లకు బి. యే. దాకా చదువు చెప్పించి తగిన వరుడికిచ్చి పెళ్ళి చేద్దామని కలలు కన్నాను. కాని యీ సంఘం, యీలోకం ఎంత క్రూరమయిందో నాకు తెలుసు. నా నిష్కల్మషత నర్థం చేసుకునే వ్యక్తులే కన్పించడంలేదీ లోకంలో." అన్నాడు వెంకట్రావు.

ఆనాటి నుంచి ఉష జబ్బు తగ్గుదలకు వచ్చింది. ప్రతిదినం ఉదయ సాయంత్రాలు వెంకట్రావు ఉషని చూడడానికి వెళ్తున్నాడు.

ఒకనాడు సుబ్బరామయ్య "వెంకట్రావుగారూ, మీరెంత మంచివారో నాకు తెలిసి కూడా ఇతరులు మిమ్మల్ని గూర్చి చెప్పిన విషయాలు విని, ఇతరులకోసం నేను మిమ్మల్ని ఇల్లు ఖాళీచేయమని చెప్పాను. నిజంగా మీరు వెళ్ళిపోవటం మనసులో నా కిష్టంలేదు. మీరు

ఫస్టు తారీకునాటికి మళ్ళీ మీ భాగంలో ప్రవేశిస్తే నాకేమీ అభ్యంతరంలేదు. మీ ఉషా సుందరి ఉద్దేశ్యంకూడా అదే. ఆపిల్లకు నిజంగా తాతగారు మీరేగాని నేనుకాను. ఆ విషయం దాని జబ్బులో రుజువైంది" అన్నాడు. వెంకట్రావు ఉష పక్కలో కూర్చొని, "ఉషా! మీ తాతగారు నన్ను వచ్చి మీ యింట్లో చేరమంటున్నాడు. నీకేమంటావు?" అని ప్రశ్నించాడు.

ఉష, "నా తాతయ్యా!" అంది. ఆమాటలు విని సాలక్ష్మమ్మ. కనుల నిండ ఆనందబాష్పాలు విడిచారు.

"నా జీవితమంతా స్వప్నతుల్యమైంది. నాకు ఉషా సుందరిని చూచిన క్షణంనుంచి ధైర్యం ఉత్సాహం కలిగాయి. నేను నా జీవితమామె ఉన్నతికోసం ధారపోయ నిశ్చయించుకున్నాను. నేనెక్కడనుంచి వెళ్ళిపోయానన్న మాటేగాని ప్రతిక్షణం ఆమె ముద్దు పలుకులు ఆమె నవ్వుపువ్వులు, ఆమె చిన్నారిమాటలూ, చేష్టలు జ్ఞప్తికి వచ్చి, ఆమెకూ, నాకూ జన్మాంతర సంబంధమేదో వుందని ఆందోళనతో కుందుతూనే ఉన్నాను" అన్నాడు వెంకట్రావు.

వాసుదేవరావు, పద్మనాభం, తదితర అకారణ శత్రువు లాశ్చర్యమందేవిధంగా మళ్ళీ వెంకట్రావు తన స్వంతంగా అయిదేళ్ళనుంచీ వుంటున్న భాగంలో ప్రవేశించడమే కాక, ఉషా సుందరిని [illegible] [illegible] వస్తున్నాడు. [illegible] [illegible]. అరగంటలో [illegible] [illegible] ముందు ధైర్యంలో నిలబడివాడు. పాత స్నేహితులెవరైనా ఎదురై "ఎవరీ అమ్మాయి?" అని ప్రశ్నిస్తే, "నా పెంపుడు కూతురు. ఉషాసుందరి ఆమె పేరు. ఆమె భరత నాట్యం నేర్చుకుంటుంది. బి. యే. దాకా చదువుకుంటుంది. నా ఆస్తికంతకూ హక్కుదారురాలు నా ఉషా సుందరే." అని సమాధానం చెబుతాడు.

కుర్రవాడి ఏడుపు కారణం

బులుసు-జీ.ప్రకాశ్

బజార్లో కెవ్వు కెవ్వుమని కుర్రాడొకడే ఏడుపు. ఎవరి తాలూకువాడో ఎవరికీ తెలియదు. వెక్కి వెక్కి రోదిస్తున్నాడు.

"నీకేం కావాలి బాబూ!" అని బుజ్జగించి అడిగారొకాయన.

"చెప్పు నాయనా, ఏడుస్తావెందుకు?"

"మీ నాన్న కావాలి కదూ?"

"మీ నాన్నెవరు?

"మీ ఇల్లెక్కడుంది?" ఒక్కొక్కరే అడిగేస్తున్నారు, వాడికొక్కవర్సండి మాచెడ్డ ఇచ్చి పడిపోయేటట్లు. కాని కుర్రాడు మాట్లాడకుండా వున్నాడు. ఉలకడు. పలకడు. కొందరు పిప్పర్‌మెంట్ బిళ్ళలు, కొందరు చాక్లెట్లు, మరికొందరు స్ట్రాంగు బిళ్ళలు ఎవరికి తోచింది వాళ్ళు తీసుకొచ్చి యిస్తున్నారు. అవన్నీ పుచ్చుకోలేదు పాపం ఆ నిసుగు. అయినా చుట్టూ ఉన్నవాళ్ళ బలగం తానకూడేదారు క్షణంలో. ఒకాయన కుర్రాణ్ణెత్తుకుని—"అయ్యలారా! ఈ కుర్రాడు మాట్లాడకుండా వున్నాడు. ఇతని తండ్రి గానీ, మరే యితర బంధువులుగాని ఇక్కడున్నట్లయితే తీసుకోమని ప్రార్థన" అని తన త్రాణకొద్దీ అరిచాడు. లాభం లేకపోయింది.

ఒకాయన నిమ్మళంగా తీసుకొనమని నిర్బంధిస్తే తిన్నాడుకాదు. అంచేత ఆ మహాశయుడు గొప్ప టక్కువేశాడు. కుర్రాడు ఏడుద్దామని నోరు తెరిచేసరికల్లా నోట్లో పడేశాడాతను. కుర్రాడు ఏడుపు ఒక్క నిమిషం ఆపి 'థూ' అని ఉమ్మగా, అది ఒకాయన వెళ్ళిపోదామని వెను దిరిగేసరికి, అతని చొక్కాపైపడి అంటు

ఉంది, అంతా నవ్వులు మొదలు. ఆ వ్యక్తికి అసలు కీలకం గ్రహించక ముందట రుసరుసలాడి, మళ్ళీ అందరితోపాటు తానూ ఒక్క నవ్వునవ్వి చల్లగా చకచకా నడుచుకుపోయాడు.

"ఎవరండీ ఆ కుర్రాడు?"

"ఏమీ చెప్పకుండా వున్నాడు"

"మాట్లాడ్డం వొచ్చా?"

"మహారాజు కొడుకులాగ! ఒణుకు లేకుండా పణుకులా మాట్లాడుతాడు"

"వాళ్ళ నాన్నెవరో మీకు తెలుసా?"

"తెలిస్తే భోగట్టా చెయ్యక మానేస్తామా?" అన్నాడు నా ప్రక్కాయన, నేనడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్తూ.

పలుకుబడితోపాటు నారాయణా అన్నట్లు నేనుకూడా అబ్బాయి నడిగాను "మీ నాన్నెవరు బాబూ?" అని.

"క్రిష్ణశాస్త్రి."

నేనడిగితే చెప్తాడని జవాబివ్వగానే చూస్తున్న వాళ్ళాశ్చర్యపోయారు. సిగ్గుపడ్డారు. నేను వెళ్ళిపోవాలనుకునేంతలో ఒకాయన నన్నాపి— "బాబూ! నువ్వతన్ని మాట్లాడించు నాయనా! నువ్వేవాళ్ళ అప్పపేద మట్టి వచ్చినట్లున్నావ్. నువ్వడిగ్గానే చెప్పాడు" అని బ్రతిమాలాడు.

నేను వెంటనే కుర్రాణ్ణి సమీపించాను. అబ్బాయి కయిదేళ్లుంటాయి. నుదురు వెడల్పాటిది. కళ్ళు పెద్దవి. చిన్న ఎత్తు క్రాఫింగు. నిక్కరు, అంగీ చొక్కా. కాళ్ళకి బుల్లి బూట్లు. మొత్తంమీద సామంతుల కుర్రాడిలా అవుపిస్తున్నాడు.

"నువ్వేం చదువుతున్నావ్ బాబూ?" అన్నాను.

"రెండు."

"శెభాష్! ఇక ఫర్వాలేదు!" అనుకున్నా.

"నువ్విక్కడ కెందుకొచ్చావ్?"

చెప్పాడు కాదు.

"మీ నాన్నగారి పేరు క్రిష్ణశాస్త్రి కదూ అన్నావ్? ఆయనేరి?"

"ఇల్లాగే నాతో వొచ్చి నన్నిక్కడొదిలి ఎక్కడికో పోయారు."

కొంతసేపు యోచించాను. ఏ ఆలోచనా పాలుపోలేదు.

"ఇంతకీ మీ యిల్లెక్కడమ్మా?"

జేబులోంచి ఒక చాక్లెట్ తీసి నోట్లో పెట్టుకుంటూ.

"అల్లా కిథీగా!" అన్నాడు చాక్లెట్ చప్పరిస్తూ ప్రేమగా చూస్తూ.

అబ్బాయిని నా కూడా తీసికెళ్లాను. నా వెనకాలే కొంతమంది వొచ్చారు. ప్రతి యింటికీ వెళ్ళి అడిగాను. ఎవరూ మాకు తెలీదంటే తెలీదన్నారు.

"మీ యిల్లిక్కడ కాదంటున్నారే! ఇక్కడేనా?"

"కాదు, ఆ పక్క" అని ఆ ప్రక్కవీథి చూపెట్టాడు. మళ్ళీ ఆ వీధిలో ప్రతి యింట్లో అడిగాను. ఎవ్వరూ ఎరగమన్నారు.

ఇల్లా ఆ కుర్రాడు నాలుగైదు వీథులు తిప్పాడు. చివరికి పోలీసుస్టేషన్ కి తీసికెళ్ళి కథా సంగ్రహం చెప్పి వప్పచెప్పాను. పోలీసుల్ని చూడగానే కుర్రాడు రెయింజర్ లా విడుపు మొదలెట్టాడు. "భయంలేదు బాబూ!" అని బుజ్జగించాను. ఇంకా ఆ ఏడుపు జోరు, హోరు తగ్గలేదు.

"ఏంకావాలి నాయనా? చెప్పమ్మా!" అన్నాను.

"మా అమ్మ కావాలి" అక్షరాలు ఒత్తి పలికాడు.

"మీ అమ్మ కావాలా? మీ అమ్మెక్కడుంది? చెప్ప తీసుకొస్తాను."

"చచ్చిపోయింది."



తారాపథం



'పేరంటాలు' సమీక్ష

పి. నరసింహామూర్తి

ప్రస్తుతం మన తెలుగు చిత్రసీమలో తయారవుతున్న చిత్రాలన్నీ ప్రజల నుండి ధనరాసులు కొల్లగొట్టుకోవటమే ప్రధానోద్దేశంగా కలిగి వున్నయి. కాశీమజిలీ కథలు తీసుకుని, కొంత హాస్యాన్ని జోడించి, ప్రణయాలు పలుకీతులుగా నడుపుతూ, ఔచిత్యమనేది ఏమాత్రమూ యోచించకుండా, మధురగానమంటూ కుప్పలుగా పాటలు చిత్రం నిండా గుప్పేసి, జానపద చిత్రాలని ప్రజల నెత్తిమీద దింపేస్తున్నారు. నిర్మాతల నవల చిన పనిలేదు. అటువంటి చిత్రాలను ప్రజ అపూర్వంగా ఆనందిస్తున్నారు, అభినందిస్తున్నారు. దీన్ని కనిపెట్టి నిర్మాతలాశతో జానపద చిత్రాలు నిర్మించారంటే ఆశ్చర్యమేముంది!

ఇటువంటి వాతావరణంలో "పేరంటాలు" వంటి చిత్రాలు చోటుగా తలెత్తి పైకి రావాలంటే అసాధ్యమనే చెప్పాలి. అయినా సాహసంతో ఆ చిత్రాన్ని ప్రజలకు సమర్పించిన నిర్మాతలభినందనీయులు.

"పేరంటాలు" జరిగిన కథ. జరిగిన కథ కింక తప్పా లెన్నటమంటూ ఏమున్నది? ఈ కథలో నాగేంద్రుడి పాత్ర కారోచితంగా వుంది. మంగళగారి జీవితమే కావ్యంలా, అద్వితీయమయిన యితిహాసంలా వున్నది కాబట్టే, ఆమెకటువంటి అపూర్వ స్నేహితుడు లభించాడు. ఆ పాత్రను చూస్తూన్నంత సేపూ విశ్వనాథవారి "వేయిపడగలు" గుర్తొచ్చింది. కలియుగంలో కాలం గడిచినకొద్దీ, ధర్మం నశించి వేయిపడగల స్వామి కొక్కొక్క పడగే పడిపోయింది. ఆ నవలలో పసిరికకు కూడా యిదే గతి పట్టింది. ప్రజలకు ధనకాంక్ష హెచ్చి పాపభీతి నశించినకొద్దీ పసిరికలా వెక్కి మంచుకై మరణించాక, ఈ చిత్రంలో నాగేంద్రుణ్ణి చూచినప్పుడివే జ్ఞాపకానికి వచ్చినయి.

కాని ప్రేక్షకుల్లో చాలమంది ఈ పాత్రను సరిగా గుర్తించలేక పోయినారు. "సాంఘిక చిత్రంలో పాము లేమిటి" అని కవి యొక్క పామరత్వాని కింతో విచారం వెలిబుచ్చారు! కుక్కల్నీ, గుర్రాల్నీ పెంచితే అవి ఎంత విశ్వాసంగా సేవ చేస్తయో అందరికీ తెలుసు. పాశ్చాత్య దేశంలో కుక్కల్నిగాని, పిల్లుల్నిగాని పెంచని కుటుంబాలు అరుదు. అలాగే పాములు పెంచారంటే ఎందుకు ఆశ్చర్యపడాలి? పాము విష జంతువు కాబట్టే కోటికొకరి కలాంటి పిచ్చి సరదా కలుగుతూ వుంటుంది. అయినా మంగళగారి పెంపకం మామూలు మాదిరి పట్టితెచ్చి యింటిలో పాలుపోసి పెంచటం కాదే. అందరి మాదిరి ఆమెకూడా పుట్టలో పాలుపోసింది. సర్పంతో స్నేహం కలిగింది. పూవులతో మాట్లాడే భావుకులు, ప్రేమికులు వుంటారని విశ్వసించద

గలిగిన లోకం, మంగళగారి పాముతో మాట్లాడిందంటే అసంబద్ధమని ఎందుకంటున్నారో?

మరో సంగతి: పగ పట్టగలిగిన పాము ప్రేమించి అనుసరించిందంటే ఆశ్చర్యం దేనికి? ప్రాణులు, తమ కపకారం తలపెట్టిన వారిని తప్ప అపకారం చెయ్యవన్నది సర్వజనవిదితమే. ప్రాణుల్లో వుత్తమజాతి నాగేంద్రుడిది. ప్రేమించ కలదంటే వింత ఏముంది?

'పేరంటాలు' జరిగిన కథ కాక, కవి కల్పనే అయితే నాగేంద్రుడి పాత్రను సృష్టించినందుకెంతైనా కవిని అభినందించవలసి వుంటుంది.

వీరభద్రయ్యకు పాము కరచినప్పుడు, పాములవాడొచ్చి కాటేసిన చోట మందు రాచి, నయమవుతుందని ఆశలేక కులదేవుడయిన నాగేంద్రుణ్ణి ప్రార్థించారు. లక్ష్మి నాట్యం చేసింది. ఈ దృశ్యంలో వ్యంగ్యాన్ని గుర్తించలేక 'ఏమిటో పిచ్చి పౌరాణిక ధోరణుల'ని విమర్శించారు. మందువల్లనే వీరభద్రయ్య బ్రతికాడనీ, స్వామి తమ ప్రార్థన మన్నించాడని నమ్మారు లక్ష్మి, పాములవాడూ యిద్దరూ. ఇలాంటి మూఢ నమ్మకాలను మనం ఎన్ని చూడటంలేదు! మశూచికం వస్తే అమ్మవారికి కొలుపులు చేయించి, చద్ది నైవేద్యాలు పెట్టి ఎన్నో యాతనలు పడతారే గాని, ఆఖరుకు చనిపోవటానికయినా ఒప్పుకుంటారే గాని, మందుల మాకుల జోలికి పోరు. ఏదయినా జబ్బు తిరపతి వెంకటేశ్వరుడికి ముడుపులు కట్టి నయమయితే ఆయన మహిమనీ, కాకపోతే మన కర్మ అనీ సంతృప్తిపడే వాళ్ళెంతమంది లేరు. ఇలాంటి మూఢ నమ్మకాలమీద గొడ్డలిపెట్టుగా ఈ ఘట్టాన్ని చూపించిన దర్శకుడు ప్రశంసనీయుడు కాదూ!

ఈ చిత్రంలో ప్రతి దృశ్యాన్ని భావయుతంగా, ఏదో ఒక ప్రయోజనాన్ని దృష్టిలో వుంచుకుని నిర్మించారు. రచ్చబండదగ్గర పంచాయితీ సభ ఇందుకొక నిదర్శనం. వీధి నాటకంలో చిత్రాంగి సారంగధరుడికి తన వలపును తెలిపిన ఘట్టం ప్రత్యేకంగా ఏరి చూపించటం మరో వుదాహరణ.

సంభాషణలు క్లుప్తంగానూ, పటుత్వంగానూ వున్నాయి. ఎక్కడా విసుగెత్తించే వుపన్యాసాలూ, ధర్మంమీద, సత్యంమీద యితిహాసాలూ, నీతి సూత్రాలమీద ప్రసంగాలూ లేకపోవట మొక ప్రత్యేకత. మచ్చుకి 'మనసు చెడితే దానితోపాటు అన్నీ చెడ్డట్టుగానే వుంటయి.' 'మనసనేది అప్పుడప్పుడు పేచీ పెడుతూనే వుంటుంది దొరా. దాని నంతగా పట్టించుకోకూడదు'—. సులభమయిన భాషలో కొండంతభావాలు చెప్పించటం కవియొక్క రచనాచాతుర్యాన్ని చాటుతుంది.

కుటుంబయ్య, తను మంగళగారిని ప్రేమిస్తున్నాడా లేదా అని నిర్ణయించుకునేటప్పుడు జరిగిన అంతస్సంఘర్షణ అద్భుతంగా చూపించారు. ఏ మనస్తత్వ శాస్త్రవేత్తయినా చూస్తే దర్శకుణ్ణి తప్పకుండా అభినందిస్తాడు.

మంగళగారికీ, కుటుంబయ్యకూ ఎడబాటు కలిగినప్పుడు వారిద్దరి మనోభావాలను చిత్రించటంలో దర్శకులు నూతన పద్ధతి నవలంబించారు. విశ్వమంతా తమ హృదయమే అయి విలపించారన్నట్లున్నది. కవి హృదయాన్ని తెరమీద తర్జుమా చేశారు.

కాటకం వచ్చిన తరువాత మంగళగారిని లక్ష్మి కొండ గుహకు తీసుకు వెళ్ళేవరకు జరిగిన కథ సరిగ్గా అర్థమవటంలేదు. ఇక్కడ చాల లోపాలు కనపిస్తున్నాయి.

సంగీతం జనరంజకంగా వుంది. సన్నివేశానికి తగినట్లుగా, భావోచితంగా పాటలూ, ఫణితులూ వున్నాయి. ఇది ఈ చిత్రానికొక మెఱుగు. పాటలు వ్రాసినవారూ, సంగీతం కూర్చినవారూ ఒకరే కావటంవల్ల నేమో.

ఈ చిత్రంలో నృత్యాలన్నింటిలోకి లక్ష్మి నాగేంద్రుణ్ణి ప్రార్థిస్తూ చేసిన నృత్యం అమోఘంగావుంది. నృత్యాలను కథలో సరైనచోట్ల ప్రవేశపెట్టారు. కావాలని వాటిని కథలో యిరికించినట్లుగా వుండకండా కథ జరగటానికి అవసరమనిపించేటట్లు ప్రవేశ పెట్టబడ్డయి.

విషాద సన్నివేశాల్లో నేపథ్య సంగీతం కోలాహలంగా హాలంతా మారుమ్రోగేటట్టుగా పెట్టేశారు. ఇది గందరగోళం పుట్టించేటట్లున్నది కాని విషాదాన్ని కలిగించేటట్లు లేదు. ఎవరైనా ఏడ్చేటప్పుడు దీర్ఘ

కాలమాసన్నివేశాన్ని నిలుపుతూ, అసహ్యంగా పెద్ద గొంతుకతో ఏడ్పించటం విసుగెత్తించింది. చాలచోట్ల ఏడుపు తెచ్చిపెట్టుకున్నట్లుగా వుంది గాని సహజంగా లేదు.

హాస్యంకోసమని ఒకే పాత్రచేత నాలుగు అయిదుసార్లు ఒకే మాటలనిపించటం పరిపాటయింది. అదే ఈ చిత్రంలోనూ కనుపిస్తుంది. అటువంటిది కోరిన హాస్య రసాన్ని కలిగించ లేకపోవటమే కాక పాత్రను చిత్రవధ చేస్తుంది.

వాతావరణం కల్పించటంలో దుస్తులు (పాత్రలు ధరించేవి) ప్రధాన పాత్ర నిర్వహిస్తయి.

చిత్రంలో ఏ పాత్రను చూసినా కొండ జాతివారని అనిపించనే లేదు. చిత్రం చూస్తున్నంత సేపూ 'ఇది కొండజాతుల్లో జరిగిన కథ' అని గుర్తుంచుకుంటే తప్ప కొన్నిచోట్ల ప్రేక్షకుడికి కథ సాఫీగా నడవలేదు. ఇది ప్రధానంగా దుస్తుల్లో లోపమే. ఇలాంటివే చిన్న చిన్న లోపాలున్నాయి.

ఏమయినా చిత్రం మొత్తంమీద చాల చక్కగా వున్నది. గోపీచంద్ గారు చిత్రనిర్మాణంలో తమ ప్రతిభను వెల్లడిచేశారు. అందుకు వారిని తప్పక అభినందించవలసిందే. వీలయినప్పుడల్లా చిత్రంలోని ప్రధాన భావాన్ని, ఆదర్శాన్ని ప్రేక్షకులకు గుర్తు చేస్తూ వచ్చారు.

నటీనటవర్గమంతా అద్భుత నటనాకౌశల్యాన్ని చూపించారు. ఎన్నదగినవారు ముక్కామల, లింగమూర్తి, నారాయణరావు.

దివాస్వప్నం

“ తాతాజీ ”

ఒక రోజు మధ్యాహ్నం, సుష్టుగా భోజనం చేసి, ఆంధ్రుడు నిద్రబోయేడు. ఆ నిద్రలో కలగన్నాడు.

విశాల ఆంధ్ర రాష్ట్రం నిర్మితమైంది. ఎన్నో సంవత్సరాలనుండి తను కలలు కంటున్న స్వరాష్ట్రం సమగ్ర స్వరూపంతో రూపొందడం చూసి ఆంధ్రుడు సంతోషంతో వుప్పొంగిపోయేడు. తన ప్రత్యేక వ్యక్తిత్వాన్ని తిరిగి సంపాదించుకున్నానని విర్రవీగేడు. తను కూడా భారత రాజ్యాంగంలో భాగస్వామి నైనానని ఢిల్లీ రాజవీధుల్లో రొమ్ము విరుచుకు తిరిగాడు. విశాల ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం తనకే గాక, భారతీయ అంతర్జాతీయ అభ్యుదయానికి తోడ్పడుతుందనీ, తన రాష్ట్ర నిర్మాణంలో సంకుచిత జాతీయతత్వానికి ప్రేరేపణ వుండదనీ సగర్వంగా ప్రకటనలు చేసేడు.

రాష్ట్ర నిర్మాణం కాగానే, దేశాన్ని సస్యశ్యామలం చేయాలనీ, దారిద్ర్యాన్నీ, దుర్భిక్షాన్నీ నిర్మూలించాలనీ ఆంధ్రుడు పూనుకున్నాడు. ఎన్నో యేళ్ళ క్రిందట తను ప్లానులు తయారుచేసుకున్న రామపాదసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకొని యెవ్వరూ అనుకోనంత స్వల్ప కాలంలో ప్రపంచంలో గణనకెక్కిన ప్రాజెక్టులను నిర్మించుకున్నాడు. దేశంలో మారుమూలల్ని కూడా గోదావరీ జలంతో తడిపి తనకే గాక యిరుగుపొరుగువారి దుర్భిక్షాన్ని కూడా నివారించాడు. పల్లెపల్లెకూ విద్యుచ్ఛక్తిని పంపి నాగరికతతో పరిచయం చేసేడు.

ఆంధ్రుడు అంతటితో వూరుకోలేదు. సాహిత్య, కళారంగాలమీదికి దృష్టిని ప్రసరించేడు. కోటి సాహితీపరులందర్నీ చేరదీసి ఆదరించాడు. తనవారిలో కూడా ప్రపంచ సాహితీపరులతో తులతూగగల సాహిత్యవేత్త లున్నారనీ, వారికి తగిన ప్రోత్సాహం, ప్రచారం లేకనే పేరు ప్రతిష్ఠలు లేకుండా పోతున్నాయనీ గ్రహించాడు.

అజంతా, యెల్లోరాలు తన పూర్వులు సృష్టించిన కళాఖండాలేనని మరొకసారి ప్రకటించుకున్నాడు.

చరిత్రపు అగాధాల్లో మరుగుపడిపోయిన

తన పూర్వ చరిత్రాంశాల్ని పైకితీసి బూజు దులిపించి తనకుకూడా మహోజ్వల చరిత్ర వుందని నిరూపించుకుని సంతుష్టి పడ్డాడు.

నాటకరంగంలోని తన కళాకారులందర్నీ ఒక సమాజం క్రిందకు తెచ్చి కట్టుబాటుతో నడపడటం ప్రారంభించాడు. "ఆంధ్ర నేషనల్ థియేటర్" నిర్మించుకొని తన కళా పిపాసత్వానికి తానే మురిసిపోయేడు.

"విశాలాంధ్ర" అని ఒక దినపత్రికను తను స్వయంగా, స్వంతగా ప్రకటిస్తున్నాడు. దాన్ని అనన్య, అసామాన్య ప్రచారంగల ఆంధ్ర దిన పత్రికగా చేసుకున్నాడు.

ఇపు డాంధ్రుడి గర్వాని కంతులేకుండా వుంది. తన ఆంధ్రత్వాన్ని పూర్తిగా జీర్ణించుకున్నానని. తన వ్యక్తిత్వాన్ని పుష్కలంగా నిలబెట్టుకున్నాననీ ఆంధ్రుడి గర్వం.

ఇంతలో మధ్యాహ్నం మూడుగంటలైంది. ఆ టైముకి ఆంధ్రుడికి కాఫీ తాగడం అలవాటు. అంచేత విధిగా మెలకువవచ్చింది. తన కలని తలచుకుని యేదో అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందేడు. కాని కలలోని విశేషాలు అపుడే మర్చిపోయేడు. కొన్ని విషయాలు మాత్రం మసకమసకగా జ్ఞప్తికి వస్తున్నాయి.

ఆంధ్రుడు వెంటనే కాఫీ దేవాలయానికి పరిగెత్తేడు. కాఫీ తాగుతూ తన కలగురించి ఆలోచించాడు. లేచిన వెంటనే కొంచెం మసకగా జ్ఞప్తివున్న విషయాలుకూడా కాఫీ తాగిం తర్వాత కరిగిపోయేవి.

"ఏమైనా, కాఫీ తాగితే అనవసోదరుల కాఫీయే తాగాలి" అన్నాడు ఆంధ్రుడు ప్రక్కన కూర్చున్న అపరిచిత వ్యక్తితో. చటుక్కున యెందుకలా అన్నాడో అర్థంకాక ఆ వ్యక్తి తెల్లబోయేడు.

ఆంధ్రుడు కాఫీ హోటలునుండి బయటికి వచ్చి దినపత్రిక నొకటి కొనాలనుకున్నాడు. ఇంతలో, రోడ్డుమీద నిలబడే పత్రిక చదువుకుంటున్న వ్యక్తి ఆంధ్రుడి కంటబడ్డాడు. ఇక తను వేరే పత్రిక కొనడం అనవసరం అనిపించింది ఆంధ్రుడికి. ఆ వ్యక్తి దగ్గరికి వెళ్ళి ఆయన చదువుకుంటున్న పేపరులాక్కున్నాడు. (అక్షరాలా లాక్కున్నాడు) పాపం, ఆ వ్యక్తి తెల్లబోయి చూస్తున్నాడు, ఆంధ్రుడు పేజీలు తిరగవేస్తూంటే.

ఆ దిన పత్రికలో ఒక వార్త కనబడింది ఆంధ్రుడికి —"రామపాద సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి యింతలో ఆ వ కా శ ం లేదని ప్లానింగ్ కమిషన్ వారి నిర్ణయం."

ఆ వార్త పూర్తిగా చదవడానికి కూడా ఆంధ్రుడికి మనస్కరించలేదు. పేపరు ఇచ్చేసి ముందుకు సాగిపోయేడు బజారులోకి. కాఫీ హోటల్ రేడియోలో నుండి ప్రబోధగీతం వినబడుతూంది ఆంధ్రుడికి —"చావలేదు, చావలేదు ఆంధ్రుల మహోజ్వల చరిత్ర."

లేఖ

ప్రభుత్వోద్యోగుల పిల్లల చదువు

జూన్ 29వ తేదీ "తెలుగు స్వతంత్ర" సంచికలో శ్రీ "చంద్ర" వ్రాసిన "సగం చచ్చిన నల్లులు" అనే కథానికలో స్వల్ప జీవితంతో పిల్లల స్కూలు జీతాలు కట్టడంలో గల కష్టాలను వ్రాశారు. ఈ రోజుల లో ఇద్దరు హైస్కూలు విద్యార్థులకు చదువు చెప్పించవలెనన్న అధమం నెలకు 15 రూపాయిలు అవుతున్నది. నెలకు 150 రూ.లకు తక్కువ జీతం తెచ్చుకొంటున్న నాన్ గజెటెడ్ ఉద్యోగులు తమ పిల్లలకు చదువు చెప్పించవలెనన్న అది తలకుమించిన కార్యమవుతున్నది. అసలు వారి జీతంలో మూడవవంతు ఇంటి అద్దెకు సరిపోతున్నది. కొంతమంది ఉద్యోగులు తమ పిల్లలందరకూ ఒకే పర్యాయం చదువు చెప్పించలేక కొంతమంది పిల్లలను బడికి పంపలేకపోతున్నారు. కనుక మన ప్రభుత్వం నాన్ గజెటెడ్ ఉద్యోగస్థుల పిల్లలకు హైస్కూలు చదువువరకు ఉచితంగా చదువు చెప్పించిన చాలా బాగుండును.

వెలువలి కృష్ణమూర్తి

కథానిక

ఉద్యోగ పర్వంలో కల్యాణి

"శర్మ"

ప్రసాదరావు మొదట్లో ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజి నుంచి ఆర్డరు రాగానే వుద్యోగం దొరికింది గదా అని సంతోషించాడు. సిగరెట్టు బీడీలకయినా దమ్మిడీ సంపాదన వచ్చే మార్గం లేక పోరంబోకల్లే తిరిగే కన్న నాలుగు జీతంరాళ్ళు స్వశక్తితో సంపాదించి నలుగురిలో యోగ్యుడనిపించుకోటం నిజంగా మహాభాగ్యమే అనుకున్నాడు. తనకు వుద్యోగం ఎప్పుడెప్పుడు వస్తుందా అని తపిస్తూ తపస్సుచేస్తూ పుట్టింట్లో మగ్గుతున్న తన అర్ధాంగిని తెచ్చి నిక్షేపంగా చీకూ చింతా లేకుండా సుఖంగా జీవయాత్ర చెయ్యొచ్చు అని ఆశ పడ్డాడు. తల్లిదండ్రుల నుంచి చిన్నమాట పడకుండా యిక విముక్తి కలిగింది కదా అని అనుకున్నాడు.

కాని తీరా వెళ్ళి వుద్యోగంలో జాయిన్ అయ్యేసరికి, ఆశలు, అపోహాలు, కలలు ఒట్టి భ్రమలూ భ్రాంతీ అయినాయి. ఇంత బేవార్సు వుద్యోగం యింకోటి వుండబోదని అభిప్రాయ పడ్డాడు. తీరా కలవరించి పలవరించి పరితపించి యీ నరకంలో పడ్డామేమిరా బాబూ అని చింతించాడు. కాని మొత్తమ్మీద తనకు తగ్గ వుద్యోగం కాదనే నిశ్చయం కలిగింది. ప్రసాదరావు ఆ గ్రామ రెవిన్యూ ఆఫీసులో క్లర్కు. అసలు ఆ ఆఫీసే చిన్నది కావటంచేత యిద్దరు ముగ్గురు జనాభా కంటే ఎక్కువ వుండదు. ఒక టైపిస్టు, ఇద్దరు క్లర్కులు, ఒక హెడ్డు క్లర్కు — యిదే ఆఫీసు బలగం అంతా. అన్నట్టు ఒక జవాన్.

ఇప్పుడు గోల అంతా ఆ హెడ్డు క్లర్కు గారితోనే వచ్చింది. చావు అంతా ఆయనతోనే వుంది. ఆయన పేరు జనార్ధనరావు. జనార్ధనరావు పేరుమాట ఎట్లావున్నా ఆయన మటుకు ఆఫీసులో వాళ్ళని మర్దనచేసి వదిలిపెడుతున్నాడు. అదేంపాపమో కాని ఆయన ప్రకృతి అందరిమల్లేనే వుండదు. వాలకం, వైఖరి కూడా అల్లాగే వుంటుంది. జనార్ధనరావు ఒట్టి అనుమానపు మనిషి అని ఆ జానపదులు చెప్పేమాట. ముమ్మాటికీ అంతేకూడ. ఆయన చేసేపనులు అన్నీ పరిహాసాస్పదంగానే వుంటాయి. మళ్లీ ఎవరు తన్ను చూసి నవ్విపోతారో అని న్యూనత. ఇది ఎట్లా కుదురుతుంది? ఆయనేవో చేస్తూనే వుంటాడు. వాళ్ళంతా నవ్వుతూనే వుంటారు.

జనార్ధనరావు ఎంత అనుమానపు మనిషి అంటే రెండు రెళ్లు నాలుగేనా అని సంశయించే లెఖ్ఖలో మనిషి. జీవితాన్ని కొన్ని వైపరీత్య వికృత సమస్యలు పట్టుకోనేకూడదు. పట్టుకుంటే యావజ్జీవమూ పీడించి గుండెల్ని పిండేస్తాయి. మనశ్శాంతి సంతుష్టులను కరువు చేస్తాయి. ఇరవైనాలుగు గంటలూ అడుక్కుదూరి సమస్యలతో మనస్సును హైరాన పెట్టుకుంటారు. చివరకు పాపం ఆ మానవ మాత్రులు.

ఆ గ్రామంలో రెవిన్యూ పనులు చాలా తక్కువ. ఎంత ఎక్కువ వచ్చినా రోజుకి పది పదిహేను కాగితాల కంటె ఎక్కువ రావు. ఒక కాగితం చూడడానికి కనీసం రెండు గంటలు పడుతుంది. "ప్రసాదరావుగారూ! ఇక్కడ లెఖ్ఖ సరిపోయిందో లేదో చూడండి యింకోసారి. ఎందుకయినా మంచిది" ఇదే వరస ప్రతి కాగితానికీ. "అబ్బే అక్కర లేదండి" అంటే "అహహ! ఎందుకయినా మంచిది, తర్వాత పస్తాయిస్తే ప్రయోజనం వుండదు. చూడండీ." ఎదురు మేకులు యిట్లా వుంటాయి. పోనీ చూసి ఒక పావుగంట ఆగి యిస్తే కాగితంవంక ఎగా దిగా ఒక అరగంట చూసి, "నరహరిరావుగారూ! మన ప్రసాద

గారు ఇక్కడ ఏదో లెఖ్ఖ వేశారు. మీరు కూడా ఒకసారి చూడండి" అని యివ్వటం, ఆయన చూసి యివ్వంగానే "మళ్ళీ చూశారా" అని అడుగుతాడు. చివరికి అక్కడికి తెగింపు అయిన తర్వాత "నరసింహారావుగారూ! ఈ కాగితం చూడండి" అని ఆయనకు చూపిస్తాడు. ఆయనా అయిన తర్వాత మళ్ళీ ఒక అరగంట వేస్టు. చివరకు ఆ కాగితంమీద సంతకం పడే సరికి అక్కడ పనిమీద వచ్చిన పెద్దమనిషికీ, ఆఫీసు క్లర్కుకూ ప్రాణాలు మచ్చమాస్తాయి. ఈ విధంగా గవర్నమెంటు రూల్సు ప్రకారం అయిదు గుంటలకు ముగియావలసిన ఆఫీసు ఏడు దాకా నడుస్తుంది.

జనార్దనరావు గుమాస్తాలను వేపుకుతినటం యింతా అంతా గాదు. పొరపాటున నిజంగా తప్పుపని చేస్తే యిహ ప్రాణాలు కొరుక్కుతినటమే. చివరికి ఆ గుమాస్తాకు విసుగెత్తి సెలవు పెడతాడు. అపుడు విషయం కొంచెం పాతపడుతుంది. ప్రతి కాగితం ప్రతి గుమాస్తాకు తిరగవలసిందే. చిన్నపిల్లవాడిని అడిగినట్టు "ఏమండీ ప్రసాదంగారూ పదహారు మూళ్లు నలభై ఎనిమిదేగా" అని అడుగుతాడు. ఎవరయినా సెలవు పెడితే యీకకు యీక పీకకు పీకగా ఆరాలు తీసి మచ్చమాపిగాని సెలవు శాంక్షన్ చెయ్యడు. ప్రసాదరావు వుండే గది జనార్దనరావు ఇంటికి సమీపంలో వుంది. అందువల్ల ఆఫీసునుంచి వస్తూ పోతున్నా, వేరే పనులమీద గ్రామంలోకి వెళ్ళవలసి వచ్చినా వాళ్ళ యింటి ముందు నించి వెళ్ళటంకద్దు. ప్రసాదరావు యింకా భార్యని కాపరానికి తీసికొనిరాలా. ప్రసాదరావు ప్రకృతి చాల వింత అని గ్రామంవాళ్ళే అంటారు. ఎవరితోనూ అనవసరంగా పూసుకొని మాట్లాడడు. ఒకవేళ ఖర్మంజాలక మాట్లాడవలసి వచ్చినా ముఖ్యంగా మూడు ముక్కల్లో ముక్తసరిగా ముగించి తప్పుకు వెళ్ళేమనిషి.

జనార్దనరావు యింట్లోలేని సమయంలో ప్రసాదరావుని హఠాత్తుగా దోవని వెడుతూంటే ఆపింది కల్యాణి. "ఏమండీ మీభార్య కాపరానికి రాలేదా? అసలు పెళ్ళి ఐందా" అనడిగింది. ప్రసాదరావు "అయిందండీ! ఇంకా కాపరానికి రాలేదు." అని తల వంచుకొని వెళ్ళిపోతున్నాడు. "ఒక్క మాటండీ! మావారు ఆఫీసులో సరిగా వుంటారా? వెర్రిమొర్రిచేష్టలు చేస్తారా?" అని తిరుగ ప్రశ్న వేసింది. "ఎబ్బే! అటువంటివి లేవండి! త్వరగా వెళ్లాలి. వెళ్ళి వస్తా!" అని ఒదిలించుకొని వెళ్లాడు. సరిగ్గా ఆ సమయానికి జనార్దనరావు మలుపు తిరిగి రావటం జరిగింది. మలుపు తిరుగుతూన్నప్పుడు ప్రసాదరావు కళ్ళూ జనార్దనరావు కళ్ళూ కలిశాయి. వాకిట్లోకి రాగానే గిలకవలె నుంచున్న భార్యనుచూసి నోట్లో చుట్ట అవతల పారేసి "లోపలికి పో!" అని కసిరాడు. "మీకంతా అనుమానమేనండి" అని గలగల గాజులతో లోపలికి గిరుక్కుమని వెళ్ళింది.

జనార్దనరావుకు అనుమాన పిశాచం బాగా నరనరంలో పట్టుకుంది. సరిగ్గా వాకిట్లో సొగసుగా అలంకరించుకొని మీనాక్షివలె నుంచోటం మలుపు తిరగంగానే ప్రసాదరావు ఎదురవటం ఆ శంకకు దోహదం యిచ్చి అనుమానానికి స్థానం కల్పించాయి. ఇంట్లోకి వచ్చి "నీకు వాకిళ్ళలో ఏంపని? మొగవాళ్లు తిరిగే తావు గదా! అసలే కాస్తీ పోజులు దొంగచూపులుకు పెట్టింది పేరు. ఆడదానివి కదా, జ్ఞానం వుండక్కరలా" అని ఝుమాయించి ఛడామడా అక్కసు కక్కాడు. "ఊరుకోండి ఎవరన్నా వింటే నవ్విపోతారు మన తెలివితేటలకి" అని నోరు మూసింది. ఆ రాత్రల్లా జనార్దనరావు అనుమానపు వికృత ఆలోచనల మంటల్లో కాలిపోయినాడు. మనస్సులో అప్రకృతి భావాలు విజృంభించినాయి. గుండెల్లో కణకణలాడే నిప్పులు పోసినట్లయింది.

మర్నాడు భోజనం పెడుతే "ప్రసాదరావుగారు బాగా పని చేస్తారండీ ఆఫీసులో?" అని జనార్దనాన్ని కల్యాణి అడిగింది. దీంతో లోపల అనుమానం ధృవపడింది. "వాడు ఎట్లా చస్తే యేం చెప్పు? ఈసారి వాడి మాట ఎత్తాలి చెపుతా" అని తోకతొక్కిన నాగువలె అరిచాడు. "చాల్లెండి ఎవరన్నా వింటే నవ్విపోతారు" అని తాళంవేసింది నోటికి.


ఆ రోజున ప్రసాదరావు సెలవు పెట్టాడు,

తలకాయ నొప్పిగావుందని. ఆఫీసుకు వచ్చిన తర్వాత జనార్దనరావు తెలుసికొని ప్యూన్‌ని పిలిచి "ఒకేయ్ ఆయనని అర్జంటుగా పిలుచుకొని రారా" అని కాగితం వ్రాసి పంపాడు. లోపల మనస్సు కల్యాణికీ ప్రసాదరావుకూ సంబంధం కల్పించి నానా హంగామా చేసి పాత మారుస్తోంది. నిన్న సాయంకాలంవరకు రాయల్లే నిరోగం నొప్పి ఎరుగని మనిషికి తెల్లారేప్పటికి తలకాయనొప్పి ముంచుకురావటం దొంగవేషం అనిపించింది. ఏదో లేవతీసుకు పోవటానికి గోతులు త్రవ్వుతున్నాడు అని మనస్సు చెపుతున్నట్లుంది. ఈలోగా ప్యూన్ వచ్చి "నిజంగానే తల నొప్పిగా వుందిటండీ. పడుకొన్నారు" అన్నాడు. "సరే లే" అని మనస్సులో అనుకున్నాడు.

మధ్యాహ్నం అవుతూంది. ఎండ నిప్పులు చెరుగుతున్నట్లు వుంది. ఆఫీసులో వాళ్ళని పని చేస్తూవుండమని చెప్పి ప్యూన్‌ని తీసికొని గబగబ యింటిదోవ పట్టాడు. ఇంటికొచ్చి కోపంతో బూటుకాలుతో తలుపు తన్నాడు. కాని జవాబు రాలా. దబదబ బాదాడు. కాని మాటాపలుకూ లేదు. 'దీనిదుంపతెగ! టక్కరిదేం ఏడుస్తోందో!' అని తలుపు బద్దలు అవుతుందా అన్నట్లు కొట్టాడు. లోపల ఏదో కొంపముంచే పని జరుగుతోందని మనస్సు చేసే ఘోష చెవుల్లో గింగురు మంటోంది. పోరు ఎక్కువయింది. "ఒకే పలుగు పట్రా" అని బంట్రోతును పిలిపించాడు. ఈ చప్పుడుకు, పిడుగుల మోతకు చుట్టుప్రక్కలవాళ్లు చేరారు. ముఖంలో కళ మారింది, రూపు మారింది. మొహం చెమటలు కారుతోంది. బంట్రోతు పలుగు తెచ్చాడు. రోకళ్లు తెచ్చారు, తలుపులు పగులగొట్టారు. అంతా గాలించారు. మనిషిజాడ లేదు. జనార్దనరావుకు సిగ్గు, భయం, సంశయం ముప్పిరిగొన్నాయి. ఈ తఫా "లేవదీసుకుపోయాడు" అని మనస్సు ఘోషిస్తోంది. అనుమానం వుధృతమయింది. "ఎక్కడి పోయినట్టు యీ మనిషి" అని పంచాంగం విప్పాడు. ప్రతివాళ్ళూ ఎక్కడికి పోయిందంటే ఎక్కడికి పోయింది అనేవాళ్లేగాని ఆర్చేవాళ్లు తీర్చేవాళ్లులేరు. జనార్దనరావు పెరటి తలుపు తీసివుండటం చూశాడు. వీళ్లు యిద్దరూ రంగం ఎక్కడో పెట్టారు అనే సంశయం ఎక్కువయింది. కల్యాణి వచ్చి వీథి తలుపులు తీసివుండటం చూసి గాభరాపడింది. వాకిట్లో చుట్టుప్రక్కలవాళ్ళు ఎక్కడికి వెళ్లావమ్మా అంటే ఎక్కడికి వెళ్లావూ అని ప్రశ్నించుతున్నారు. జనార్దనరావు ఆకారం చూసి "అమ్మయ్యో" అంది. "ఎక్కడికి వెళ్ళావో చెప్పు! చంపేస్తా వాడి దగ్గరకేనా, వెళ్ళివచ్చింది? ఆ రాడీ దగ్గరకేనా?" అని చేతిలో గునపం ఎత్తాడు. "అయ్యో లేదండీ. చిన్న షావుకారి భార్య కబురుపంపిస్తే వెళ్ళానండీ" అని గోల. చావుదెబ్బ తప్పింది చెంపలు ఫెడీలుఫెడీలు మన్నాయి కల్యాణికి. ఆ కోపంలో రౌద్రరోషంలో నిజానిజాలు తెలుసుకొనే పరిజ్ఞానం పోయింది. కల్యాణి తన్నులు తింది.

ఆ గ్రామం అంతా కలిపితే ఆరుమైళ్ళ పొడుగు ఏవైపునా లేదు. సాయంకాలానికల్లా వూరంతా గుప్పుమంది. ప్రసాదరావుకు యిదేమీ తెలియదు. వచ్చిన తర్వాత అంతా తెలిసింది. "ఇంత అనుమాన పిశాచమా" అనుకున్నాడు. ఆ గ్రామంలో వుండటం అభిమానానికీ ఆత్మగౌరవానికీ భంగం మాత్రమే కాక ఎపుడో చెప్పుదెబ్బలు తినవలసివస్తుందని తలచాడు. "ఉద్యోగం లేకపోతే పీడాపోయింది యీ దిక్కుమాలిన పీడలు ఎవడు పడతాడు. బ్రతికుంటే వుద్యోగం చేసుకోలేకపోతామా" అని క్లర్కు పోస్టుకి రాజీనామా యిచ్చాడు. "హెడ్డు గుమాస్తా ఒట్టి అనుమానపు మనిషి అనీ తనకూ తన భార్యకూ రంకులు కట్టాడనీ" రాజీనామా లేఖలో వ్రాశాడు.

కొన్నాళ్ళ తర్వాత నిజంగానే కల్యాణి ఎవర్నో తీసుకుని లేచిపోయింది.



భూమికి ఆకర్షణశక్తి అనే గుణం ఉన్నన్నాళ్లు విమాన ప్రయాణం మానుకోవడం మంచిదనే భయస్థులు కూడా లేకపోలేదు మనలో!

స్కెచ్

"తెల్ల దుంపలు"

జి. అచ్యుతరామయ్య

మూర్తి లైబ్రరీలో కూర్చుని పేపరు చదువుతున్నాడు. దేశంలో ప్రబలంగావున్న నిరుద్యోగ సమస్యను గురించి వ్రాయబడిన సంపాదకీయం అతన్ని ఆకర్షించింది. తీక్షణంగా చదువుతున్నాడు. "గంట" అయింది. ప్రక్కనే వున్న మురళి "బెల్లు అయింది, రారా" అనే సరికి మూర్తి యీ లోకంలోపడ్డాడు. ఇద్దరూ బయలుదేరి క్లాసురూము చేరుకున్నారు.

లెక్చరరు చెప్పుకుపోతున్నాడు. అరగంట అయేక ఆగి "టేక్ డవున్" అన్నాడు. మిగతా కాలమంతా కలక్టరాఫీసు గుమాస్తాలా చేతులు నొప్పి పుట్టేటట్టు వ్రాసేను నోట్సు. రోజూ అంతే. మొదటి అరగంట ఉపన్యాసం, మిగతా అరగంట నోట్సు. ఆ కాలేజీకి అది ప్రత్యేకత. ఎంత వ్రాసినా నోట్సు తరగటం లేదు. రోజురోజుకూ వృద్ధి చంద్రుడిలా పెరిగి పోతున్నది. అప్పుడప్పుడు ఎందుకీ వ్రాతంతా అనుకునేవాడు మూర్తి. సంపాదకీయం కళ్ళ ముందు ప్రత్యక్షమయేది. తానుకూడ యీ చదువు తరువాత ఆ నిరుద్యోగ శాఖలోనే చేరాలా అనుకునేవాడు. ఏమో; పరీక్షలు సమీపిస్తున్నాయి. భయంగా వుంది. అయినా తప్పదు. క్లాసులో నోట్సులో పేజీలు నింపి యింటిదగ్గర ఎద్దులా పనిచేయాలి. పరీక్షలో పేపర్లు నింపాలి. ఎన్నికష్టాలుపడ్డా ప్యాసవాలి. అదే గమ్యస్థానం. కాని ఆ గమ్యస్థానం చేరే లోపున ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటాయి. వాటికి తట్టుకుంటూ విజయధ్వజ మెత్తాలి. అది మానవ విధి. అయినా కొంతమంది విఫలు లవుతూంటారు. అలా అని ముందుగా మనం మానకూడదు. అలాగే మూర్తికూడ పని చేస్తున్నాడు, మూడు పూటలయి తిండి లేక పోయినా.

సాయంత్రం మూడున్నర అయింది. ప్రక్కవాడు ఎంత తొందరగా బెల్లు అవుతుందా అని చూస్తున్నాడు. మధ్యలో మూర్తితో అన్నాడోసారి, "ఎంతకూ బెల్లు అవదేంరా?" అని. ఎందుకు వాడు అలా తొందరపడుతున్నాడు? తన్ను బాధిస్తున్నట్టే వాడిని కూడ ఆకలి బాధిస్తూందేమో? మరి తను వాడిలాగ బెల్లుకు తొందరపడటం లేదే!

ప్రక్కనున్న వాడి తండ్రి పెద్ద గవర్నమెంటు ఉద్యోగి. వీడొక్కడే కొడుకట. అతనెక్కడో వుంటూ వీణ్ణి యిక్కడ హాస్టల్లో వుంచి, వీడు ఎప్పుడు ఎంత కావాలన్నా తాను దొంగ లంచాలద్వారా గణించిన సొమ్మును పంపి "చదువు" చెప్పిస్తున్నాడు. వీడికి రెండు పూట్లా హాస్టలు టిఫిను చాలదు. హోటలుకు పోతాడు. రోజుకు రెండు కాప్స్టన్ సిగరెట్టు పెట్టెలు, వారానికి ఒక సినీమా. ఎలా లేదన్నా హాస్టలు బిల్లు కాకుండా పైగా డెబ్బయి రూపాయలు రమారమిఅవుతుంది. మరి తానో, ఉదయం 9 గం॥లకు రాత్రి 8 గం॥లకు భోజనం, అంతే. ఈ మధ్యను మరేం వుండదు. తనతండ్రి రాబడంతా ఆ స్నేహితుడు పైగా పెట్టే ఖర్చంత వుంటుంది. మరి టిఫిను ఎక్కణ్ణుంచి వస్తుంది.

కాలం మనకోసం ఆగదు. మూడుమాయాక్తై అయింది. మూర్తికి లెక్కలేనన్ని ఆలోచనలు. బెల్లయిన వెంటనే యింటికి పోవాలి. కాలేజీలో కూర్చుందామన్నా వీలుండదు. తలుపులు వేసేస్తారు. క్లాసులో వున్నంతసేపూ ఎలాగోలాగ ఆకలిక తట్టుకోవచ్చు. ఇంటిదగ్గర ఆకలితో వుండటం కన్న మరో నరకముండదు. అయినా యింటికిపోవాలి. ఆకలితో పోరాడాలి. అణగ ద్రొక్కాలి!

మూర్తి మొదట వద్దన్నాడు కాలేజీ చదువు, యింటి పరిస్థితులుచూసి. "ఉన్న ఒక్క పిల్లాడైనా కాలేజీ ముఖము చూడకుండా చదువు ముగించటమా, వీల్లేదు" అని మూర్తిని ప్రవేశపెట్టేడు అతని తండ్రి. అవసరం వస్తే తిండైనా మాన్దామను

తున్నారు తల్లి తండ్రులు. నానా తంటాలుపడి టర్మ్ ఫీ కట్టేస్తున్నాడు ఆయన. కాని తిండి గురించి అంతబాధ పట్టం లేదు. ఉన్న నాడు తింటున్నారు, లేనినాడు ఏకాదశి. ఇప్పుడు మూర్తి యింట్లో మూడు పూటలైపస్తు. ఆ రాత్రితో రెండు రోజులూ పూర్తవుతాయి. తెచ్చిన రేషనుబియ్యం అయిదురోజులే వస్తయి. హిందూదేశపు జనాభా రేషను లెక్కల్నిబట్టి 50 కోట్లు వున్నా, మూర్తి యింట్లో ముగ్గురే. తల్లి ఎంతో మొరపెట్టింది, అధమం మరో మనిషి వున్నట్టు చీటీపుట్టించమని. వీల్లేదన్నాడాయన. బ్లాకు మార్కెట్టులో కొనలేరు.

గడియారం తన పని చేసుకు పోతూంది. నాలుగయింది. ప్రక్కవాడు చాల తొందర పడుతున్నాడు. బెల్లయింది. మూర్తి గుండెల్లో రాయిపడింది. అందరూ క్లాసు రూముల్లోంచి బయట పడ్డారు. గోష్ఠిముఖం పట్టేరు. మూడు పూటల్నుండి తిండి లేదేమో కళ్ళు తిరుగుతున్నాయి. పక్కగా పోతున్న మిత్రుని పిల్చేడు, వాడి ఆధారంగా పోదామనుకుని. ఏదో అర్జంటు పని వుందంటూ వాడు పోయాడు.

శర్మ పోతూ మూర్తిని కలుసుకుని రెండడుగులు జోరుగా వేసి ముందుగా పోతున్న అమ్మాయిల దగ్గరగా వెళ్ళి వాళ్ళపై వ్యాఖ్యలు మొదలెట్టాడు. మూర్తికి ఆ నీరసంలో వెగటుగా తోచినయి. శర్మ వాళ్ళనూ, ఖరీదయిన చీరల్నూ, వాళ్ళ ఫేషన్లనూ వర్ణిస్తూంటే మూర్తికి ఎందుకంత ఆడంబరం అనే ధోరణిలో పోసాగేయి ఆలోచనలు. ఇల్లు వచ్చేసింది.

తల్లి యింట్లో ఒకమూల కూచుంది. ఆపూటికి రోజూ వంట ప్రయత్నంలో వుండేది. కాళ్ళు కడుక్కుని మూర్తి వీధిలో చాప వేసుకు కూర్చున్నాడు. అలాగే చీకటి పడింది. "నాయనా, రేపు బియ్యం యిచ్చేటప్పుడు విరుచుకోమని రేషను బియ్యం అప్పుగా కొట్టు వాడివ్వడా?" తల్లి అంది. మూర్తి మాట్లాడలేదు.

అరగంట గడిచింది. తండ్రి వచ్చేడు. భుజం మీద వేసుకున్న చిన్న మూట విప్పి భార్య ముందు పోసేడు. "ఎలాగ..." భార్య మాట పూర్తి చెయ్యకుండానే "ఒకరూపాయి అప్పు దొరికింది, తెచ్చేను" అన్నాడు. ఆమె లేచింది. పొయ్యి రాజేసింది. మరో అరగంటలో చిన్న దీపపుబుడ్డి దగ్గర రాసుకుంటున్న మూర్తిని పిలిచింది. ముగ్గురూ కూర్చున్నారు. మెత్తగా ఉడకపెట్టిన ఆ తెల్ల దుంపలకు కొంచెంగా చింతకాయ పచ్చడి రాసుకుంటూ తిన్నారు. ఆ రాత్రి గడిచింది. మర్నాడుదయాన్నే కోమటి కొట్టుదగ్గరకు పోయి పద్దు బుక్కులో రాసి అవారం బియ్యం మూర్తి తెచ్చేడు. ఎన్నాళ్ళు? ఐదురోజులు. తరువాత కుదురుతే మిగతా రెండురోజులూ తెల దుంపలు!

సుషుప్తి

ఎన్నటికో పరిసమాప్తి
ఈ గాఢ మహాసుషుప్తి
ఎన్నటికానో లయమ్ము
ఈశూన్య నిశాలయమ్ము
ఎంతవరకు మోస్తుంది?
ఈ తమో జటాభారం
వవరాలపు నగ్నశిరం
భువిదాకిన భగ్నకరం
ఎంతవరకు ప్రాగ్భామిని
గొంతుకలో మ్రోగుతుంది
ఈ యరుణారుణకిరణం
ఎప్పుడుమియు నిప్పుకణం
ఎన్నాళ్ళని తూర్పువాటి
ఏడుస్తుంది "జాటజాట"
ఎన్నాళ్లెముకల కోరది
వినిపిస్తుంది "కిటకిట"

చీల్చివేయు నెంతవరకు
చీకిన కర్ణపుటంచుల
ఏటి లోయల మ్రోగే
ఘూక కఠోరపు కూతలు

ఎన్నటికో పరిసమాప్తి
ఈగాఢ మహా సుషుప్తి
ఎన్నటికానో లయమ్ము
ఈ శూన్య నిశాలయమ్ము

—సి. నారాయణరెడ్డి

కాలక్షేపానికి ఒక కథ

విలువ లేని అనుభవాలు

యస్. ఆర్. నంది

ఛెంగు ఛెంగున గెంతుకొంటూ పరుగు పరుగున యింటికి వచ్చాను. వచ్చీ రాగానే బల్లమీద పుస్తకాలు విసిరేసి, అమ్మ యివ్వబోయే కాఫీని గూడ తీసుకోకుండా మైదానం వేపు పరుగు తీశాను.

కుక్క మంచంలో కూచొని చుట్ట కాల్చుకొంటున్నాడు తాతయ్య. నన్ను చూడగానే నవ్వుతూ చేతులు చాచాడు. ఒక్క దూకులో తాతయ్య ఒళ్ళో వాలిపోయాను.

నా శరీరాన్నంతటినీ వేయి నోళ్ళతో ముద్దులాడాడు.

"ఇంతవరకూ ఎక్కడున్నావు బాబూ?" అనడిగాడు, నా ముఖాన్ని రెండు చేతులతో తన ముఖం దగ్గరికి తీసుకొంటూ.

"లంకమీద ఆడుకొంటున్నాను తాతయ్యా. రాముగా, రంగడూ, సత్యం, ఎచ్చి నేనూ కలసి దొంగాటాడాం. నేను ఒక్కసారి దొంగనవలేదు. అస్తమానం సత్యంగాడే అవుటయేవాడు. చివరికి ఉడుక్కుపోయి మా ఆట చెడగొట్టాడు కూడా. మేమందరం వాడిమీద చేరి ఉడికించాం." ఊపిరి ఆడని ఆనందంతో గుక్క తిప్పుకోకుండా చెప్పేస్తున్నాను. అన్నం తిని యిక్కడికి పరుగెత్తుకొని వచ్చేదాకా జరిగినవన్నీ చెప్పి తృప్తిగా ఒక చిరునవ్వు నవ్వాను.

తాతయ్య నన్ను ముద్దుపెట్టుకొంటూ పక్కన కూచోబెట్టుకొన్నాడు.

నా ఘనకార్యాలని వర్ణించలేక నేనే అలసిపోయాను. శ్వాస కాస్త నెమ్మదించిన తర్వాత తాతయ్యతో అన్నాను: "కథ చెప్పవు తాతయ్యా?"

"ఏం కథ? రోజూ కథలంటావు. నా కొచ్చిన కథలన్నీ చెప్పేశాను. ఇంకేం మిగిలాయని నీకు చెప్పడానికి?"

"రోజూ అలానే అంటుంటావ్, ఏదో మళ్ళీ కొత్తకథ చెబుతూనే వుంటావ్ ... అలానే ఈవాళ గూడా ఓ కథ చెప్పు తాతయ్యా."

తాతయ్య నానించి తప్పించుకో లేక పోయాడు.

"సరే. కథేవింటి? రోజూ చెబుతున్నదే కథవది. ఈవాళ 'యత' చెబుతాను వింటావా?"

ఈ 'యత' అనేమాట నాకు కొత్తగా వినిపించింది.

"యతే చెప్పు తాతయ్యా."

ఆరిపోయిన చుట్ట తీసి పక్కన పెట్టి మెల్లగా మంచంమీద మేను వాల్చాడు. నన్ను గూడా తన పక్కన పడుకోబెట్టుకొన్నాడు. కథలు వినడానికి తాతయ్య పక్కలో, కోడిపిల్లలు తల్లి రెక్కలకింద ఇమిడేటట్టు, నేను పడుకో వడం పరిపాటే. తాతయ్య గూడా తన కుడి చేతిని, నా తలమీదుగా భుజాలమీద జోల పాటలు పాడిస్తాడు. ఈవాళ గూడా అంతే!

యత ప్రారంభించాడు.

"అనగా అనగా ఓ వూళ్ళో ఓ అమ్మా, నాన్నా వున్నారు."

"ఏ వూళ్ళో తాతయ్యా?"

"ఒక వూరు. ఏదో ఒక వూరు. పేరెందుకులే... ఆ అమ్మా నాన్నకి ఓ కొడుకు. ఆ కొడుక్కి వాళ్ళేదో పేరు పెట్టారులే. పేరు లేకుండా ఎవరూ వుండరు కదు బాబూ! ఆ అబ్బాయి రోజు రోజుకీ యింతా, అంతా పెద్దవాడవుతున్నాడు. 'మ్మ' 'త్త' 'న్న' అనే మాటలు గూడా నేర్చుకొంటున్నాడు. బంగరడం దగ్గరనుంచీ, తప్పటడుగులు వేస్తూ, పరుగెత్తడం వరకూ నేర్చుకొన్నాడు... కాదు. తిరుగుతున్న కాలం ఆ అబ్బాయికి వాటన్నిటినీ నేర్పించింది!

"అబ్బాయికి ఏడేళ్ళు వచ్చాయి. అయిదేళ్లు వచ్చేయంటే ఏం చేస్తారు?

"ఆటలాడుకొంటాడు."

"కాదు. అక్షరాభ్యాసం చేయిస్తారు."

"ఆఁ. అవునవును. పలకలు, బలపాలు పంచిపెడతారు."

"హాఁ. అదే! అంటే బడికి వెళ్లి మంచి మంచి పాఠాలు చదువుకొని గొప్పగొప్ప విషయాలు నేర్చుకోవడమన్న మాట!

"ఆ అబ్బాయి రోజూ బడికి వెడుతూంటే ఆఅమ్మా నాన్నలు ఎంతో మురిసిపోయేవారు. ఎంతో ముద్దుగా, కోరిందల్లా నెరవేరుస్తూ పెంచుతున్నారు. అమ్మా నాన్నా నీకు రోజూ అన్నంపెట్టి, ముస్తాబుచేసి బడికి పంపించడం లేదూ? అలాగే నన్నమాట."

"మరి ఆ అబ్బాయి రోజూ ఆడుకొనే వాడా?"

"ఆఁ. మంచిమంచి ఆటలు ఆడుకొనేవాడు. కోతి కొమ్మచ్చి, దొంగాట, ఎండానీడా ఆట లన్నమాట. అలాగే ఆడుతూ పాడుతూ చదువు కొంటూ ఆ అబ్బాయి యింతా అంతా పెద్ద వాడవుతున్నాడు. బడిలోగూడ మంచిమంచి పాఠాలు నేర్చుకొంటూ, పరీక్షల్లో ఫస్టుగా పాసవుతూ మాస్టర్లందరిచేతా 'భేష్' అనిపించు కొంటున్నాడు.

"అంతలో ఆ కుర్రాడికి యుక్తవయస్సు వొచ్చిందట."

"ఆఁ...?" ఈ నోరుతిరగని మాట కర్థం తెలీలేదు.

"అంటే పెద్దవాడయాడన్న మాట. బళ్లో అన్ని పరీక్షలూ పాసయి యింటి కొచ్చేశాడు."

"ఎందుకు?"

"ఇక చదువు పూర్తయిపోయింది."

"మరిక చదువుకో నవసరంలేదూ?"

"ఊహుఁ. అంతటితో ఆ చదువు ఆఖరు. ఐతే యిప్పుడతను ఉద్యోగంకోసం ఊరంతా తిరిగాడట. అప్పుడు పనులాట్టే శ్రమలేకండానే దొరికేవి. అందువల్ల సాయంకాలానికి ఓపని దొరికిందట."

"ఏంపని తాతయ్యా?"

"ఏదో ఒకపని, పొట్టకోసం."

పొట్టకోసం పని. ఈ 'లింక్' ఏమిటో అప్పుడు నాకు తెలీకపోయినా అలస్యాన్ని భరించలేక ఊకొట్టాను.

"ఐతే అతను అలాగలా పని చేస్తూచేస్తూ కొంత డబ్బు కూడబెట్టాడట. ఒక రోజున అతని అమ్మా నాన్న అతని దగ్గరికొచ్చి 'బాబూ, యిక నీకు యుక్తవయస్సొచ్చింది, పెళ్ళిచేసుకొని ఒక యింటివాడవు కావాలి" అన్నారట. అతను సిగ్గుతో 'సరే' అన్నాడట."

"పెళ్ళి అయిపోయింది. పెళ్లాం యింటి కొచ్చింది."

నాకెందుకో చాల సంతోషమయింది. అప్రయత్నంగా, కారణం తెలీకండానే చప్పట్లు కొట్టి నవ్వాను. నా నవ్వులోని గూఢార్థాన్ని తాతయ్య గ్రహించగలిగాడో లేదో గాని, ఆ చిన్న వయసులో ఆ 'ఉద్రేకం' నాకలా ఎందుకు కలిగిందో అర్థం కాలేదు.

"అతనికి పెళ్ళి, పెళ్ళి అయిపోయింది. పెళ్ళాం అతనితో కాపరం చెయ్యడానికి వచ్చింది. ప్రొద్దుట పని చేసేవాడు. ఎందుకు?"

"హాఁ..." అలస్యాన్ని భరించలేక మూలిగాను.

"అలా మరిచిపోతే ఏలా? పని చేయడం పొట్టకోసం."

"ఆఁ ఆఁ పొట్టకోసం..."

"మరి ఇంట్లో పెళ్ళాం ఎంచక్కా అన్నం వండి, వండింది వడ్డించి, వడ్డించింది అతను తిన్నాడో లేదో సరిగా చూసి, సరిగా చూసిన తర్వాత విస్తరెత్తి పారేసి, తను తర్వాత తినేది."

"అవును సత్యవతి గూడా నాకు లక్కపిడతల్లో బువ్వ అలాగే పెడుతుంది తాతయ్యా."

"లేప్పొద్దుట దాన్నే పెళ్లాడుదువుగానిలే."

ఆ మాటకి తాతయ్య ఛాతీమీద కొట్టి తగిల్నిచ్చాను. తాతయ్య నవ్వి తిరిగి ప్రారంభించాడు.

"ఇలాగలాగ, అలాగలాగ రోజులు, రోజుల మీద వారాలు, వారాలమీద నెలలు, నెలల మీద ఏడాదులు గడచిపోతున్నాయి. అతనికి ఒకరోజున మంచి కొడుకు పుట్టాడట, కొడుకు పుడితే ఎంత సంబరపడ్డాడతను? ఓహ్! మిఠాయిలే కాదు, జిలేబీలే కాదు, కోవాలే కాదు— అన్నీ పంచిపెట్టాడట."

"ఎందుకు?"

"సరదా. కొడుకు పుట్టాడుకదూ! ఆ కొడుకంటే అతనికెంతో ప్రేమ. అతనికే కాదు. అతని పెళ్ళానికి కూడా ఎంతో ప్రేమ! యిద్దరూ ఆ కొడుకుమీద ఈగనయినా వాలకండా ఎంతో ప్రేమగా చూసుకొంటున్నారు. ఆ పిల్లాడు అలా అలా పెరుగుతూ రెండేళ్ళవాడయేసరికి, వాడికి మరో తమ్ముడు పుట్టాడట."

"మరి వాళ్ళకి పేర్లు లేవు తాతయ్యా?"

"ఎందుకులేవు. ఉన్నాయి. అవన్నీ చెబితే నువ్వు మరచిపోతావ్. రెండోవాడు ఇంతా అంతా పెద్దవాడయేసరికి ఒక చెల్లెలు పుట్టిందట."

"మరి మొదట పిల్లాడిని బళ్ళో వేశారా?"

"ఆఁ. వేశారే..."

"ఆడుకొంటున్నాడా?"

"మహారాజులా. ఆ యిద్దరూ ఆడుకోవడమే గాకండా, ఈ చెల్లెలు కూడా క్రమేపీ పెద్దదై, వాళ్ళతో సమానంగా దొంగాటలాడేదట. ఇంతలో మరో చెల్లెలు పుట్టింది."

"ఈసారి చిన్నచెల్లెలు పుట్టిందన్నమాట!"

"ఆఁ. ఈ చెల్లెలు కూడా ఇంతో అంతో పెద్దదయ్యేసరికి, మరొక చెల్లెలు పుట్టిందట..."

"మొత్తం ఎంత మంది? ఒకటి, రెండు, మూడు, ముగ్గురు చెల్లెళ్ళన్నమాట!"

"ఆఁ ఇంతలో పాపం పెద్దన్నయ్యకి జబ్బు చేసిందట. అతను-అంటే ఎవరు? ఈ పిల్లల నాన్నన్నమాట-అతను పెద్ద కొడుకుని ఓ డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళాడట. ఆ డాక్టరు కూడ పిల్లాడికి మందులు, ఇంజక్షన్లు ఇచ్చాడు. రెండు నెలల తర్వాత పెద్దకొడుకు జబ్బునించి తేరుకొన్నాడు. కాని సన్నగా ఉఫ్ అంటే ఎగిరిపోయేటట్టు తయారయ్యాడట. వాడికి మంచి బలమైన టానిక్కులు, మందులు తినిపించేసరికి, పనిచేస్తూ కూడబెట్టిన డబ్బంతా పూర్తయిపోయింది.

"ఇలాగే కాలం జరుగుతుండేసరికి, మళ్ళా ఓ పిల్ల పుట్టింది. యింట్లో అంతా యింతింత చిన్న పిల్లలు. కొళ్ళాపేళ్ళా పడేవాళ్ళు. బొంగి మొలల్తో ఊరంతా తిరిగేవారు. అలసిపోయిన తర్వాత ఇంటికి తిరిగొచ్చి, తల్లి చేసిన ముద్ద తిని మళ్ళా వీధులంట పడేవారట."

"మరి చదువుకోరూ?"

"ఆఁ ఎందుకు చదువుకోరు? చదువుకొంటారు. కాని వాళ్ళ అమ్మా నాన్నకి శ్రద్ధ ఏదీ? నాన్న పగలంతా పని చేస్తూంటే, అమ్మ వంటింట్లో అన్నాలు వండుతూంటే, వాళ్ళ కోసం శ్రద్ధ తీసుకొనేవాళ్ళెవరు?"

"ప్రయివేటు మాస్టరు లేరూ?"

"ఆ వూళ్ళో కావలసినంత మంది వున్నారు కాని వాళ్ళింటికి రారు."

"ఏం?"

"వాళ్ళ నాన్న దగ్గర ఆ ప్రయివేటు మాస్టర్లకిచ్చేంత డబ్బులేదు."

"ఎందుకు లేదు?"

"చేసే ఉద్యోగం చిన్నది కదూ?"

"అయితేమాత్రం ఎక్కువ డబ్బు ఎందుకు దొరకదు."

"దొరకదు. అంతే. ఎందుకు దొరకదో నువ్వు పెద్దవాడవయిన తర్వాత తెలుసుకో."

"నేను పెద్దవాడనయిన తర్వాత ఉద్యోగం చేస్తానేమిటి? ఆడుకొంటూ చదువుకొంటాను గాని."

సరే ఏదో చేద్దువుగాని మొదట నేను చెప్పేది విను. అలాగ అతను పనిచేస్తున్నా సరైన జీతం దొరక్క కష్టాలు పడుతుండే సరికి, మళ్ళా భార్యకి పురుడొచ్చింది. మళ్ళా ఆడపిల్ల. ఇక అతనికి విసుగెత్తిపోయింది. పుడుతున్న పిల్లలకి పాల డబ్బాలు తెచ్చేందుకు కూడ డబ్బు లేదు. తల్లిపాలు లేక పిల్లలు ఆకలి బానల్లాంటి కడుపులతో, చీపురు పుల్లల్లాంటి కాళ్ళు చేతులతో వూరంతా తిరుగుతుండేవారు.

"ఒకరోజున అతనికి జ్వరంవచ్చింది. అంటే మందులివ్వాలి. మందులిస్తే మనిషి బాగుపడతాడన్నమాట."

అప్పట్లోనాకు మనుషులకి జ్వరాలు ఎందుకొస్తాయో అర్థం కాలేదు. అంతకంటే అర్థం కాని పెద్ద సమస్య: జ్వరం వస్తే మందులెందుకు వేస్తారు అని! కాని తాతయ్య చెప్పే కథ మంచి సరదాగా వుండటంవల్ల మధ్య ప్రశ్న వేయలేదు.

"అతను మంచం పట్టాడు. పట్టిన పదిరోజుల్లోనే ఎముకలగూడు అయిపోయాడు. ఇంట్లో పెళ్లాం ఏంచేస్తుంది? ఆడది! ఇరవై నాలుగు గంటలూ అతని దగ్గర కూచొని సేవ చేస్తూండేది. కాని ఆ జబ్బు యింకా ఎక్కువ అవడంతో, యిక లాభంలేదని ఉన్న ఆ ఒక్క కొంపనీ తాకట్టు పెట్టి కొంతడబ్బు తెచ్చింది.

"ఆ డబ్బుకి అతను బాగయ్యాడనుకో. కాని, ఆయింటి మీద అప్పు తీర్చడానికి ఎంతో శ్రమ పడవలసి వచ్చింది. అందుకు తోడు ఆడపిల్లలు పెద్దవాళ్ళయి యింట్లో వున్నారు. వాళ్ళకి పెళ్లిళ్లు చెయ్యాలి. మగవాళ్ళంటే ఫరవాలేదు. ఆడపిల్లల కలా కాదుగా..."

తాతయ్య చెప్తున్న కథ మాంచి రసవంతంగా వుండటంవల్ల కొబ్బోలు త్యాగ నాసికా మార్గాన్ని వదిలి నోటి మార్గాన్ని పట్టింది. పెదవులు, గొంతుక, స్వరతంత్రులు గాలి రాపిడికి ఎండి, మాటలు మూగవోతూయి. " కొట్టటం లేదు.

"..పిల్లలకి పెళ్లిళ్లు చేశాడు. అప్పటికి చాల అప్పు చేశాడు. మగపిల్లలు కూడ పెళ్లిళ్లు చేసుకొని ఎవరి దారిన వారు విడిపోయారు.

"అప్పటికి యింకా ముగ్గురు ఆడపిల్లలు ఒక్క మగపిల్లగ మిగిలారు. అంతలో భార్యకి జబ్బు చేసింది. అతనికి మందిప్పించలేక అతను కళ్లు తేలేశాడు. ఆమె కళ్లు మూసింది—నలుగురి పిల్లని చేతిలో పెడుతూ.

"పిల్లని తనే పోషిస్తున్నాడు చాలం రోజులుగా? ఆడపిల్లలని పెద్ద వాళ్ళని చేసింది వాళ్ళకి కూడ పెళ్ళిళ్ళు చేశాడు.

"కాని చిట్ట చివరి కొడుకు ఒక్కడు మాత్రం మిగిలాడు. వాడిని అతను బాగా చదివించి, వార్ధక్యంలో తన్ని విడిచి పోయిన పెద్ద కొడుకల్లా గాకుండా, గొప్పవాడిగా చేయాలనుకున్నాడు. అప్పటికే అతనికి పదివయస్సు దాటిపోయింది. ఆ పిల్లాడికోసం కష్టపడి పని చేస్తున్నాడు. అలాగ చేస్తూనే అప్పులూ బాకీలూ తీర్చాడు.

"పిల్లాడు అలాగలా ఎది పెద్దవాడయి పెద్ద చదువులు చదివి వెంటనే ఉద్యోగంకూడ సంపాయించుకొన్నాడు. అప్పటికే అతనికి అరవైయేళ్లు నిండడంచేత ఇక వొంగి కష్టపడ లేక కొడుకు యింట్లో ఒక్క మంచంలో కూలబడ్డాడు.

"తనకి తానే ఆ కొడుకు పెళ్ళి చేసుకొన్నాడు—తండ్రి అవసరం లేకుండా. ఆ తండ్రి కష్టంమీద ఏ కొడుకు పెరిగి పెద్దవాడయ్యాడో, ఆ కొడుకే ఈవేళ ఆ తండ్రిచేత ఒక పైసా అయినా ఖర్చు పెట్టించుకోకుండా, స్వతంత్రంగా తను సంపాదించిన డబ్బుతో పెళ్ళి చేసుకొని ఒక యింటివాడయాడు. అలాంటి కొడుకు యింట్లో, అతను యిప్పుడు గతుకుతున్నాడు."

తాతయ్య ఆగాడిక్కడ.

"ఇంకా అతను వున్నాడా తాతయ్యా?"

"ఆఁ యింకా వున్నాడు.

"నాకు చూపించవూ!" అన్నాను ఆత్రుతగా.

తాతయ్య నవ్వాడు. "అతనెలా వుంటాడో [illegible]"

"[illegible]"

"ఎన్నేళ్లుంటా యనుకుంటావ్?"

"[illegible]"

"[illegible]"

"అంతా విన్నావుగా [illegible].."

"[illegible] ఆలోచించి అతని వయస్సు [illegible]"

చాలసేపు ఆలోచించాను. తెలియలేదు. [illegible] అలు నా మనస్సులో [illegible], ఊహిస్తూంటే [illegible] చిన్నతనం [illegible] ఇతని [illegible] కొన్ని సందల [illegible] ! కాని ఎందుకో మనస్సు అలా చెప్పడానికి అంగీకరించలేదు.

"ఎంతో [illegible] తాతయ్యా" అన్నాను మెల్లగా.

"ఇంతేనా నీ చురుకు? అతని వయస్సిప్పుడు డె-భై-ఐ-దు" తాతయ్య రాగాలు తీశాడు.

"ఆఁ" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏం! వింతగా వుందా? మరి వింతగా వుండదూ. అసలు అతనే అప్పుడప్పుడు ఆశ్చర్య

పోతూంటాడు. "హరి, నాకీ డబ్భైవిదేళ్లు ఎలా వచ్చాయి!" అని.

"అవును తాతయ్యా ఎలా వచ్చాయి?"

"ఎలా వచ్చాయి కాదు బాబు, ఎందుకొచ్చాయి? అను. ఎందుకంటే, అతనెప్పుడూ జీవితం గురించిగాని, మనిషి గురించి గాని పాతకాలంగా కూచొని ఏటి గూడార్థం, అంతరార్థం ఏవిటి అని ఆలోచించుకోలేదు. ఒక వేళ ఆ ఆలోచన కష్ట సమయాల్లో కలిగినా, ఆ బాధలు అతని మనస్సుని, శరీరాన్ని కుళ్ళ కంపలలో కొట్టి, లేపి, పరుగెత్తించింది. అందువల్ల అతను తన్ని గురించి, తన స్థితిగతులని గురించి, తన చుట్టూవున్న వాటిని గురించి తెలుసుకొని, తదనుగుణంగా నడిచేందుకు తగిన వీలు చిక్కలేదు.

"కాని యిప్పుడు కుక్కి మంచంలో కూచొని, పాతకాలంగా గుండెమీద చెయ్యి వేసుకొని ఆలోచించుకొంటూంటాడు. "నే నెందుకు పుట్టాను, ఏం చేశాను, ఏం చేస్తూ వెళ్ళిపోతున్నాను" అని! కాని గడచిన కాలం అతన్ని వెక్కిరిస్తూ, అతని కళ్ళనుండి తిరుగుతూంటే, చేతగాక ఒక కన్నీటి బొట్టుని, డబ్భై ఏడేళ్ళ అనుభవంతో, విడుస్తుంటాడు. అతని పళ్ళన్నీ లోకంలోవున్న రుచు లన్నిటినీ చవిచూసి, రాలిపోయాయి. అవి మళ్ళా 'పాల పళ్లు'గా తిరిగి అతని బోసి నోటిలో రావు. వస్తే...?"

తాతయ్య ఆగిపోయాడు.

"వస్తే...?" అని నేను ప్రశ్నించుకోలేదప్పుడు; ఇప్పుడు ప్రశ్నించుకొంటున్నాను ఏదో ఆశతో కాలం విలువని తెలిసికోగలను కదా అని!

అభిప్రాయవేదిక

ఆంధ్ర రాజకీయాలు

"ఉమేశ"

ఆంధ్ర రాజకీయాలు ప్రస్తుతం పాదరసంలాగా పట్టుకొంటకుండా దొర్లుతున్నవి. అంతా అయోమయం, గందరగోళంగా ఉన్నది. ఎంతగా బుర్రలు బ్రద్దలు చేసుకున్నా ఇదమిత్థమని అంతుపట్టక ప్రజలు హైరానవుతున్నారు. ఆంధ్ర ప్రజాపార్టీ తీర్మానాలకు ప్రకాశంగారి వ్యాఖ్యానాలకు సమన్వయం కుదరక జనాలకు చికాకు కలుగుతున్నది. ఆదిలోనే హంస పాదా? అన్న నిరుత్సాహం నుండి తెప్పరిల్లడానికి కొన్నాళ్ళు పడుతుంది. ఇది ఇలా ఉండగా దురదృష్టవశాత్తు సంభవించిన పుత్రవియోగాన్ని పురస్కరించుకొని తలవని తలంపుగా సంజీవరెడ్డిగారు తమ రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షపదవికి రాజీనామా యిచ్చారు. దీనితో ప్రాణాలు కడబట్టి వారి పార్టీవారంతా రాజీనామాను ఉపసంహరించుకోమని విజ్ఞప్తులు చేస్తున్నారు. రాష్ట్ర కాంగ్రెసు సంఘానికి పంపించవలసిన రాజీనామాను కాంగ్రెసు అధ్యక్షునికి పంపటంవల్ల అసలది సక్రమమైన రాజీనామా కాదని కళావారు తమ మిత్రులకు కొంత గుండెనిబ్బరం చేకూర్చారు. బెంగుళూరు ఎ. ఐ. సి. సి. సమావేశం ఫలితంగా రాగల పరిణామాలను బట్టి రాజీనామాను గురించిన పూర్తివివరాలను పసికట్ట వచ్చునని కొందరు అనుకొంటున్న మాటలకు ఎంత ప్రాధాన్యం ఉన్నదీ కొన్నాళ్ళకుకాని తెలియదు. ఇంతకీ ఈ రాజీనామా సంగతి ఏమి కాబోతున్నది? బెంగుళూరు సమావేశ ప్రయోజనం ఏమవుతుంది? ఎవరిని కదిలించినా ఇవే ప్రశ్నలు. ఎక్కడ చూచినా ఇవే చర్చలు. అన్నీ ప్రశ్నార్థకాలే తప్ప ఒక్కటీ ప్రస్ఫుటంగా కనపడటం లేదు. ఈ సందిగ్ధ పరిస్థితులు చివరకు ఏ కొలిక్కి చేరేదీ ఎలా చెప్పటం? అందునా నేటి ఆంధ్ర రాజకీయాల స్థితి అరటిపండు తోలు

మీద కాలువేసినట్లున్నది.

* * *

ప్రజలను చిందరవందర చేసే ప్రకటనలు చేయటానికి నాయకులు వెరవనప్పుడు "అము పెద్దలు 'చేరి' పోరాడుచుండ, నడుమనున్న లేగల కాళ్ళు నలుగునట్లు"వుతుంది సామాన్యుల సంగతి. మొన్న జరిగిన ఆంధ్ర ప్రజాపార్టీ సమావేశాన్ని గురించి నిజానిజాల ప్రసక్తి లేని నానారకాలైన ప్రకటనలు వెలువడడం వల్ల ఆఫీసు కార్యదర్శి ఒక అధికార ప్రకటన చేయవలసి వచ్చింది. దానిమీద అసలు ఆఫీసూ లేదు, ఆఫీసు కార్యదర్శి లేడని ప్రకాశంగారు బాంబువంటి ప్రకటన ఒకటి చేశారు. ఈమాట వల్ల తమ ప్రకటనలోని ఇతరఅంశాలను కూడా శంకించమని ప్రజలను వారే ప్రేరేపించినట్లయింది. ఒక ఆఫీసు కార్యదర్శి ఆధ్వర్యం క్రింద విజయవాడలో పార్టీ ఆఫీసు మొదటి నుండీ నడుస్తూనే ఉన్నదన్న నగ్నసత్యాన్ని అంత సునాయాసంగా ఖండించటం వల్ల నాయకులెంతకైనా సాహసులేనని ప్రజలు నిర్ఘాంతపోవలసి వస్తున్నది. వెనక ఒకసారి మద్రాసు అసెంబ్లీ కాంగ్రెసుపార్టీ అంటూ ఏదీ లేనేలేదని ప్రకటించారు. ఆంధ్ర ప్రజాపార్టీ అంతర్ధానమై పోయిందని ఇప్పుడంటున్నారు. ఏదైనాసరే వారుఉన్నదంటే ఉన్నట్లు లేదంటే లేనట్లు అన్న ధోరణి ఎంతమందికి నచ్చగలదు? పాట్నాలో అఖిలభారత ప్రజాపార్టీ ఏర్పడిన మరుక్షణంలోనే ఆంధ్ర ప్రజాపార్టీ అందులో లీనమై అదృశ్యమైపోయిందనీ ఆ తరువాత ఆంధ్రలో తాము, ఢిల్లీలో కృపలానీ తప్ప మరెవ్వరూ లేరనీ ప్రకాశంగారు చెప్పటం చూస్తే ఏమనిపిస్తుంది? పాట్నాకంటె ముందే నడుస్తున్న ఆంధ్ర ప్రజాపార్టీని రద్దు చేయాలన్నా, లేక కృపలానీ పార్టీలో కలిపి వేయాలన్నా పార్టీ ఆ విధంగా నిర్ణయం చేయాలి. ఏదీ లేకుండా నేను చెబుతున్నాను కనుక అంతేనంటే వినేవారుండవద్దా?

ఆంధ్రప్రజాపార్టీని అఖిలభారత ప్రజాపార్టీలో అంతర్భాగంగా చేసి, ఒక అడ్‌హాక్ కమిటీని నియమించటానికై ప్రకాశంగారు ప్రజాపార్టీ అభిమానుల సమావేశాన్ని పిలిచారు. మొదటిరోజున ఆంధ్రపార్టీ కౌన్సిల్ సభ్యులు మాత్రమే ప్రకాశంగారి అధ్యక్షతన సమావేశమయ్యారు. సమావేశం ప్రారంభంలోనే శ్రీ వి. వి. రమణగారి ప్రశ్నకు సమాధానంగా పాట్నాసభ ఏజంటుగా కాక ఆంధ్రపార్టీ నాయకుని హోదాలోనే తా నా సభకు అధ్యక్షత వహిస్తున్నట్లు ప్రకాశంగారు వివరించారు. ఆ సమావేశంలో ఆంధ్రపార్టీ స్వతంత్ర ప్రతిపత్తితో అఖిలభారత ప్రజాపార్టీకి అనుబంధం కావాలన్న ఏకగ్రీవ నిర్ణయం జరిగింది. మినిట్సు పుస్తకంలో "తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించబడ్డది. నేను ఓటు చేయలేను" అని ప్రకాశంగారు స్వహస్తంతో వ్రాశారు. పాట్నాసభ మరుక్షణంలోనే ఆంధ్ర పార్టీ మాయమైపోతే ఆ పార్టీ నాయకుని హోదాలో ఈ సమావేశాన్ని ఎందుకు నిర్వహించినట్లు? మినిట్సు పుస్తకంలో ఎలా వ్రాసినట్లు? దీనినిబట్టే ఆంధ్ర ప్రజాపార్టీ యథాతథంగా నిలబడి ఉన్నదని ప్రకాశంగారు అంగీకరించినట్లు తేలడంలేదా? తరువాత అడ్‌హాక్ కమిటీని నియమించాలని ప్రకాశంగారు ప్రతిపాదించినప్పుడు, క్రొత్త కమిటీని వేయవలసిన పనిలేదని నిర్ణయించి అంతకుముందున్న కౌన్సిల్‌నే జనరల్ బాడీగా మార్చి, అందులో నుండి ఒక కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆ కార్యవర్గంలో ప్రకాశంగారు, వారి అనుచరులుకూడా ఉన్నారు. తీర్మానంమీద ప్రకాశంగారు తాము ఓటు చేయలేదని వ్రాశారే తప్ప వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొనలేదు. అధ్యక్షుడు వోటు చేయవలసిన అవసరమేమిటి? ఉన్నా తమ అంతరంగికులుకూడా ఆమోదించిన నిర్ణయాలను ప్రకాశంగారు మన్నించాలా లేదా?

* * *

నాయకుడైన వ్యక్తి అధిక సంఖ్యాకులచేత తన అభిప్రాయాలను ఒప్పించనైనా ఒప్పించాలి. లేదా తానే మెజారిటీనిబట్టి సర్దుకుపోవాలి. రెండూ కాకుండా నియంతృత్వ ధోరణి చలాయించటం ఈ రోజులలో వీలవుతుందా? రంగా ప్రకాశంగారల మధ్య పార్టీ నాయకత్వాన్ని గురించే అభిప్రాయభేదాలు

వచ్చినవనీ రంగాగారు ప్రకాశంగారి వెనుక గోతులు త్రవ్వారనీ కొందరు ప్రచారం సాగిస్తున్నారు. ఆంధ్ర ప్రజాపార్టీలో మొదటి నుండీ ప్రకాశంగారికంటె రంగాగారికే హెచ్చుబలం ఉన్నదన్న సత్యాన్ని ఎవరూ కాదనలేరు కదా. అయినప్పుడు నిజంగానే రంగాగారు ప్రకాశంగారికి అపచారం తలపెడితే మొదట్లోనే ప్రకాశంగారిని నాయకునిగా చేయవలసిన అవసరమేమున్నది? పైగా తాను ఉపనాయకుడుగా ఉండటానికి అంగీకరించవలసిన పనేమున్నది. ప్రకాశంగారి పెద్దతనాన్ని మన్నించి సంఖ్యాబలాన్ని మనసులో పెట్టుకోకుండా వారే నాయకుడన్నారు. సభ్యుల అభిప్రాయం ప్రకారం పోతూంటే ప్రకాశంగారికీ పార్టీకీకూడా ప్రతిష్ఠ దక్కేది. అలాకాకుండా నాయకుని హోదాలో క్రమపద్ధతులను సరిగచేయకుండా వ్యవహరించటానికి ఉపక్రమించటంవల్ల క్రొత్తగా ఏర్పాటు చేసిన కార్యవర్గంలో నాయకుడు, అధ్యక్షుడు మొదలైన అగ్రాసనం లేకుండా చేయవలసి వచ్చింది. మొన్నటి తీర్మానాలనుబట్టి రంగాగారికి పార్టీలో ఉన్న బలం రుజువవుతున్నా కూడా ఇప్పటికీ రంగాగారు పార్టీ నాయకుడనని ఊరేగటంలేదు. ప్రకాశంగారి ధోరణివల్ల, మనస్సు కష్టపెట్టుకుంటూనే, నాయకుడనే ప్రత్యేక హోదాను తొలగించవలసి వచ్చింది. సోషలిస్టు పార్టీవలె కార్యవర్గం ఆమోదంతో కార్యదర్శులే వ్యవహరించాలన్న ఏర్పాటు మొదట్లోనే ఎందుకు చేయలేదో ఇప్పుడెందుకు చేయవలసి వచ్చిందో తెలుసుకుంటే ప్రకాశంగారు తమకూ పార్టీకీ బాధ కలిగించే పరిస్థితులు కల్పించినందుకు విచారపడవలసి వస్తుంది.

• • •

ఈ నిర్ణయాలతో సమావేశం ముగిసినట్లే భావించాలి. కాని మరునాడు మళ్ళీ అడ్ హాక్ కమిటీ నియామకంకొరకు మరొక సమావేశాన్ని పిలిచారు ప్రకాశంగారు. ఆ సమావేశంలో అడ్ హాక్ కమిటీ నియామకమేమీ జరగనే లేదు. పైగా ఆంధ్ర ప్రజాపార్టీ ఆమోదించిన తీర్మానాల దృష్ట్యా అడ్ హాక్ కమిటీని నియమించవలసిన అవసరం ఉంటుందేమో కృపలానీతో చర్చించమని ప్రకాశం గారిని ఆదేశించారు. ఆమాత్రైనా ఎందుకు అనవలసి వచ్చిందంటే ప్రకాశంగారు తనకేదో చిన్నతనం జరిగినట్లు నొచ్చుకోవటం వల్లనే. పాట్నాలో తాను మాట ఇచ్చివచ్చాననీ, ఈ సమావేశాన్ని అందుకే పిలిచాననీ ఆ విధంగానైనా తీర్మానించక పోతే తనకు తలవంపులుగా ఉంటుందనీ ప్రకాశంగారు బాధపడటంచేత ఆ రూపంలో ఒక తీర్మానం ఆమోదించారు. దీనికే తన అభిప్రాయాలను సభ్యులు అంగీకరించి అఖిలభారత పార్టీతో కలిసి పోవటానికి నిర్ణయించారనీ, కృపలానీతో చర్చించి అడ్ హాక్ కమిటీని ఏర్పాటు చేయటానికి తనకు అధికారం ఇచ్చారనీ ప్రకాశంగారు వ్యాఖ్యానిస్తున్నారు. బేషరతుగా కృపలానీ పార్టీతో చేరమనీ, ఆయన అనుమతితోను దయాదాక్షిణ్యాలతోను పనిలేదనీ ఆంధ్ర పార్టీ నిర్ణయిస్తే ఈ విధంగా వ్యాఖ్యానించటం స్వీయ సంతృప్తికే తప్ప దేనికి? పార్టీ నిర్ణయాల దృష్ట్యా మరొక కమిటీ అవసరం ఉంటుందా అని కృపలానీతో చర్చించమంటే, అక్కరలేదని నిర్ణయించినట్లు చెప్పి తన బెట్టును కాపాడుకోవటానికి ప్రకాశంగారికి అవకాశం కలుగజేయటానికే ఆ నిర్ణయం. కృపలానీకి నిజంగానే తన పార్టీని పెంపొందించుకోవాలన్న ఆరాటమే ఉంటే వాస్తవిక పరిస్థితులను బలాబలాలను గమనించి తదనుగుణమైన విధంగా ప్రకాశం గారిని నడిపించటం అవసరం. అలా కాకుండా కృపలానీ ఆమోద ముద్ర లభించేవరకు ఆంధ్ర పార్టీ కార్యవర్గం సమావేశం కాకూడదని ప్రకాశంగారు శాసించినంత మాత్రాన కార్యక్రమం ఆగదు.

కృపలానీ పార్టీప్రణాళికలో భాషాప్రయుక్త రాష్ట్ర విభజనను గురించి ప్రస్తావనే లేదు. ఆంధ్ర పార్టీకి స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర పార్టీ ప్రణాళికలో అవసరమైన మార్పులు చేసుకొనే అధికారం ఉండకపోతే ఎలా? ఆంధ్ర పార్టీ మారు మాటాడకుండా కృపలానీ పార్టీతో చేరిపోవాలనే వారికి ఆంధ్ర రాష్ట్ర సమస్యలో పనిలేదా? తమ అనుచరులంతా అంగీకరించిన నిర్ణయాలకు

భిన్నంగా వ్యవహరించాలన్న వృథా శ్రమ ప్రకాశంగారికెందుకు? మద్రాసులో తమఇంట్లో ఆఫీసుపెట్టి అఖిల భారత ప్రజాపార్టీ పేరుతో ఆంధ్ర ప్రజాపార్టీని ఎదిరించాలన్న సంకల్పం ఎంతవరకు కొనసాగుతుంది? ఆంధ్రలో డెమోక్రాటిక్ ఫ్రంటును తామొక్కరే ప్రారంభించినప్పటి అనుభవంతోనైనా ఇలాంటి ప్రయత్నాన్ని విరమించుకోవటం వారికే మంచిది కాదా? ప్రజలను తాత్కాలికంగా ఉంవర వంవర పరచటానికి తప్ప ఆ ఎత్తు దేనికి ఉపయోగపడుతుంది? ప్రజలను పీడించుతున్న దుష్ట శక్తులను ఎదుర్కోవటానికి ఇప్పటికైనా ప్రకాశంగారు తమ సహచరుల ఏకగ్రీవ నిర్ణయాన్ని అనుసరించాలి.

ప్రకాశంగారిని సక్రమ పంథాలో పెట్టటానికి బదులు వారి శ్రేయోభిలాషుల వలె నటించే నడింపల్లి నరసింహారావు, క్రొవ్విడి లింగరాజుగార్లు పెడదారులు పట్టించటానికి పూనుకోవటం, వారే తన మిత్రులని ప్రకాశంగారు భావించటం శోచనీయం. డాక్టరు చలపతిరావుగారి ధోరణి ప్రకాశంగారికి క్షేమదాయకమో లేక వీరు చెవులుకొరికి సాధిస్తున్నదే లాభకరమో త్వరలోనే తెలుస్తుంది. మొదటి రోజు సమావేశం అనంతరం "ఇంత పొడుగు ప్రకటన ఒకటి చేసి తెచ్చావుగా లాభం" అని ప్రకాశంగారు నడింపల్లి వారిని మందలించారట. కాని ఏమి లాభం? పార్టీలో అభిప్రాయభేదా లేర్పడితే సర్దుబాటు చేయవలసింది పోయి బహిరంగంగా అల్లరి చేసుకోవటంవల్ల తమ అసమాన మేధాశక్తిని ప్రదర్శిస్తున్నామని వీరు భ్రమిస్తున్నారు. ప్రకాశంగారు కేంద్ర ప్రజాపార్టీ కార్యవర్గ సభ్యులయ్యారని ఈర్ష్యతో రంగాగారు వ్యతిరేకిస్తున్నారట. రంగాగారు కాంగ్రెసు కార్యవర్గసభ్యుడుగా ఉండగా వారా సభ్యత్వాన్ని వదులుకోవాలని గుంటూరులో నడింపల్లివారి ఇంట్లో ప్రకాశంగారి సమక్షాన జరిగిన ఒక సమావేశంలో తీర్మానం చేసి పత్రికలకిచ్చినప్పుడేమో? ప్రకాశంగారికి కేంద్ర ప్రజాపార్టీ కార్యవర్గంలో సభ్యత్వం వచ్చినందుకు రంగాగారు వాపోవటం కాదు అసలు సంగతి; ఆంధ్ర పార్టీ నాయకుడుగా ఉంటున్న ప్రకాశంగారు పార్టీతో నిమిత్తం లేకుండానే అంగీకరించి, నేను ఒప్పుకొని వచ్చాను కనుక మీరూ ఒప్పుకోవాలని గొడవ చేయటంవల్ల, స్వతంత్రించి చేసిన పనికి ఇతరులు బాధ్యులు కానవసరం లేదని చెప్పవలసి వచ్చింది.

ప్రకాశంగారు పాట్నా సభ కార్యవర్గ సభ్యత్వాన్ని స్వీకరించినపుడు రంగాగారు అప్పటికప్పుడే ఎందుకు అభ్యంతరం చెప్పలేదని ఒక ప్రశ్న బయలుదేరింది. రంగాగారిని సంప్రదించకుండా స్వీకరించటం ప్రకాశంగారి తప్పా లేక అక్కడే మీరు ఒప్పుకోకూడదని ప్రకాశంగారిని వత్తిడి చేయకపోవటం రంగాగారి తప్పా? ఇప్పుడే ఇన్ని అంటున్నవారు, ఆ పద్ధతిలో రంగాగారు తనకు రాలేదా ప్రకాశంగారికి కూడా వద్దని సాగదీశారని అనేవారు కారా? ప్రకాశంగారు అంగీకరించటంలో ఆంధ్ర పార్టీ పాలసీకి విరుద్ధమేమీ లేదట. ఆంధ్ర పార్టీ ఒక అభిప్రాయానికి రాకముందే ఆ తీర్పు ఎలా చెప్పినట్లు? ఇప్పటికైనా అది విరుద్ధమేనని తేలింది కదా.

పాట్నా సభకు ముందు అఖిల భారత ప్రతిపక్షం ఒకటి ఏర్పడాలని చెప్పిన రంగాగారు ఇక్కడకు వద్దంటున్నారని మరొక విమర్శ సాగిస్తున్నారు. ఇప్పుడైనా అఖిల భారత పార్టీ అక్కరలేదని రంగాగారు అనటంలేదే. ఆ నియమావళి వగైరా ఫలానా విధంగా ఉంటే మంచిదని ఆయన అభిప్రాయం. కాంగ్రెసు ఆశయాలకే కాకుండా, కార్యక్రమాలకు కూడా ట్రూ కాపీ అయ్యే పద్ధతిలో మరొక పార్టీ పెట్టటంలో అర్థమేమిటి? ఆ విధంగా ప్రజలకు క్రొత్త నాయకత్వం ఏమి లభించినట్లు? కృపలానీ పార్టీ ప్రణాళిక, నిబంధనలు, కాంగ్రెసుకు డిటోగా ఉండటంవల్లనే ఆంధ్ర ప్రజాపార్టీ ఈ నిర్ణయానికి రావలసివచ్చింది. అఖిల భారత పార్టీ కావాలన్నారు కనుక అది ఎలాంటిదైనా సరే చేరమని చెప్పడమా? పెండ్లి కావాలన్నావు కనుక పిల్ల ఎలాంటిదైనా సరే ఒప్పుకోమంటే ఎలా?

——:O:——

Edited, Printed and Published by KHASA SUBBA RAU, at *Swatantra Printers*,